Published from Visakhapatnam
PRGI NO:APTEL/25/A1888

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




విశాఖపట్నం Visakhapatnam | సంపుటి : 01 Vol.No : 01 | సంచిక : 146 Issue No : 146 | ఆదివారం Sunday | మే 3, 2026 3 MAY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



# రుతు పవనాలు ముందే రాక..

## కానీ వేడి, ఉక్కపోత తప్పదు : ఐఎండీ

- ఈ ఏడాది సాధారణం కంటే ముందే రుతుపవనాలు
- మే 14-16 మధ్య అండమాన్‌ను తాకనున్న నైరుతి
- దేశవ్యాప్తంగా మే నెలలో అధిక వర్షపాతం అంచనా
- చాలా ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువ


ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఒకేసారి చల్లని, వేడి కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందే దేశంలోకి ప్రవేశించే అవకాశం ఉందని, మే నెలలో దేశవ్యాప్తంగా అధిక వర్షపాతం నమోదవుతుందని శుభవార్త చెప్పింది.

అదే సమయంలో, కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు, దేశవ్యాప్తంగా అధిక రాత్రి ఉష్ణోగ్రతలు తప్పవని హెచ్చరించింది.ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర వెల్లడించిన వివరాల ప్రకారం, ఈసారి నైరుతి రుతుపవనాలు మే 14 నుంచి 16 మధ్య అండమాన్, నికోబార్ దీవులను తాకే అవకాశం ఉంది.

2 - మిగతా

# కర్ణాటకలో బర్డ్ ఫ్లూ కలకలం

- 40 నెమళ్లు మృతి, కంటైన్‌మెంట్ జోన్ ప్రకటింపు



బెంగళూరు : కర్ణాటకలో బర్డ్ ఫ్లూ వైరస్ భయాందోళరణంగా తుమకూరు జిల్లాలో సుమారు 40 నెమళ్లు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఈనలు రేకెత్తిస్తోంది. ౧5చీ1 కా ఘటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు, ప్రభావిత ప్రాంతం కేంద్రంగా తీసుకుని 10 మీటర్ల పరిధిలో కంటైన్‌మెంట్ జోన్‌ను ప్రకటించారు.

- మిగతా 2లో..



# ఇరాన్‌తో యుద్ధంపై నాలుక మడతవేసిన యూఎస్..

## అది యుద్ధమే కాదన్న ట్రంప్

- ఇరాన్‌తో సైనిక చర్యపై మాట మార్చిన ట్రంప్ ప్రభుత్వం
- అది యుద్ధం కాదని, కాంగ్రెస్ అనుమతి అవసరం లేదని వాదన
- దళాలను వెనక్కి పిలవాలని డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష డెమోక్రాట్లు
- ఇరాన్‌పై భీకర దాడికి 'డార్క్ ఈగిల్' క్షిపణులతో అమెరికా సన్నాహాలు
- ఐరోపా సమాఖ్య కార్లపై 25 శాతం సుంకం విధిస్తూ ట్రంప్ సర్కార్ నిర్ణయం

2 లో

అమెరికా : ఇరాన్‌పై సైనిక చర్య విషయంలో అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం మాట మార్చింది. తా ము చేస్తున్నది యుద్ధం కాదని, కేవలం పరిమిత సైనిక చర్య మాత్రమేనని చెబుతోంది. ఇరా న్‌తో ఇప్పటికే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినం దున, యుద్ధానికి కాంగ్రెస్ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని శ్వేతసౌధం స్పష్టం చేసింది. అమె రికా చట్టాల ప్రకారం అధ్యక్షుడు ఏ దేశంపైనైనా యుద్ధం ప్రార ంభిస్తే 60 రోజుల్లోగా కాంగ్రెస్ ఆమోదం పొందాలి. ఇరాన్‌పై ట్రంప్ ప్రభుత్వం ఫిబ్రవరి 28న సైనిక చర్య ప్రారంభించి, మార్చి 2న కాంగ్రెస్‌కు అధికారికంగా తెలియజేసింది.

# సుప్రీంలో మమతా బెనర్జీకి చుక్కెదురు



## కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయమే సుప్రీం

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపులో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు నడుచుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై టీఎంసీ నేతలు నమ్మకం ఉంచాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే ఎలక్షన్ కమిషన్ నియమించడాన్ని సవాలు చేస్తూ టీఎంసీ వేసిన పిటిషన్‌ను కోల్‌కతా హైకోర్టు కొట్టివేసింది. కోల్‌కతా హైకోర్టు తీర్పును టీఎంసీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది.

2 పేజీలో..



# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ

ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్ : ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌కు సర్జరీ జరగడంతో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. తగిన విశ్రాంతి తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# చేనేతల లోగిళ్లలో 'ఉచిత' కాంతులు



- గత నెల 1 నుంచి ఉచిత విద్యుత్ అమలు
- మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు
- మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా అందజేత
- జీరో పేమెంట్ తో మే నెల విద్యుత్ బిల్లుల రాక
- నేతన్నల కుటుంబాల్లో హర్షాతిరేకాలు
- 'ఉచిత విద్యుత్'తో ఆర్థిక మేలు
- సీఎం చంద్రబాబుకు ,మంత్రి లోకేశ్ కు చేనేతల ధన్యవాదాలు
- నేతన్నలకు ఏడాది ఉపాధే లక్ష్యం : మంత్రి సవిత

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

ఇచ్చిన మాటకు కట్టుబడుతూ కూటమి ప్రభుత్వం నెరవేర్చిన హామీ నేతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. ఉచిత విద్యుత్ పథకం అమలులో భాగంగా తొలి నెలలో జీరో పేమెంట్ విద్యుత్ బిల్లు రావడంతో చేనేతలు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ఒకవైపు చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తీసుకొచ్చేలా చర్యలు చేపడుతూనే, నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగేలా పథకాలు అమలు చేస్తోంది.

దీనిలో భాగంగా, గత నెల ఒకటో తేదీ నుంచి చేనేతలకు మేలు కలిగేలా కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా లక్షా నాలుగు వేల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందజేసేలా చర్యలు చేపట్టింది. మగ్గంపై నేసే నేతన్నలకు నెలకు 200 యూనిట్లు, మర మగ్గంపై నేసే నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు.

- మిగతా 2లో..




- పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఘనతను ప్రశంసించిన వెంకయ్యనాయుడు
- లోకేశ్ తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని ప్రశంస
- తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయించడం లేదని ఆవేదన

# లోకేశ్‌పై వెంకయ్యనాయుడు ప్రశంసలు

న్యూఢిల్లీ : ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరుపై భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసల జల్లు కురిపించారు.

- మిగతా 2లో..



# పేలుడు ఘటనలో ముగ్గురు జవాన్లు మృతి

కాంకేర్ : కాంకేర్ జిల్లాలో భూమిలో ఉన్న మందు పాతరలను తొలగించే క్రమంలో ఓ మందుపాతర (ఐఇడి) పేలి ముగ్గురు జవాన్లు మృతి చెందారు. ఈ ఘటన శనివారం కాంకేర్-నారాయణ్‌పూర్ సరిహద్దు సమీపంలో జరిగింది. ఛోటేబెతియా పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసుల బృందం మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను తొలగించే క్రమంలోనే ఈ ఘటన జరిగింది. మృతి చెందిన వారు జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి)లు.

- మిగతా 2లో..



# వైద్య ఆరోగ్య రంగానికి శాపంలా కూటమి ప్రభుత్వం

## ఆరోగ్యశ్రీ నిర్వీర్యం. ఆస్పత్రుల్లో వైద్య సేవలు శూన్యం

- పబ్లిసిటీ ఫుల్.. పనితనం నిల్
- ఒక్క కొత్త పెన్షన్ ఇవ్వలేదు. పైగా 6 లక్షల పెన్షన్లు కోత!
- అమరావతి అద్దాలకే రూ.2,540 కోట్లా? ఇది దోపిడీ కాదా?
- మాజీ మంత్రి విడదల రజిని

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి : టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా, ఒక్క హామీని నెరవేర్చకుండానే కేవలం ప్రచార ఆర్భాటాలతోనే కాలం గడుపుతోందని మాజీ మంత్రి విడదల రజిని వెల్లడించారు. ప్రతి నెలా ఒకటిన పెన్షన్ పంపిణీ పేరుతో ఏదో ఒక గ్రామంలో స్కిట్లు వేస్తూ, సెట్టింగ్స్ ఏర్పాటు చేసి, నానా హడావిడి చేస్తూ సీఎం చంద్రబాబు డ్రామా చేస్తున్నారని ఆమె ఆక్షేపించారు. జగన్‌గారి హయాంలో ఇచ్చిన 66.35 లక్షల పెన్షన్లలో 6 లక్షల పెన్షన్లను కట్ చేయడమే కాకుండా, ఇప్పటి వరకు ఒక్క కొత్త పెన్షన్ ఇవ్వని అసమర్థ ప్రభుత్వం కూటమిదేనని చెప్పారు. వైయస్సార్‌సీపీని 'గొడ్డలి పార్టీ' అని విమర్శించే టీడీపీకి, వెన్నుపోటు పొడిచిన చరిత్ర తప్ప మరొకటి లేదని, త్వరలోనే ప్రజలు ఈ అరాచక పాలనకు చరమగీతం పాడతారని, పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి విడదల రజిని హెచ్చరించారు. ప్రెస్‌మీట్‌లో విడదల రజిని మాట్లాడుతూ"

దేశంలోనే ఒక ఆదర్శమైన పథకంగా గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఆరోగ్యశ్రీని ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వంలో వైద్య ఆరోగ్య రంగం నాశనమై పోయింది. ఆరోగ్యశ్రీని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కిందకు తీసుకొచ్చి, ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పగిస్తున్నారు. నాడు లక్షలాది మందికి ప్రాణదానం చేసిన ఆరోగ్యశ్రీ పథకం ఇప్పుడు ఈ ప్రభుత్వ నిర్వాకం వల్ల ఉనికి కోల్పోతోంది. ఇంకా ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేయడమే కాకుండా, చివరకు అడ్డగోలుగా ఎల్‌ఓసీలు ఇస్తూ,

2 లో

# కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదు..

## ప్రజలు మరో 20 ఏళ్లు ఓటు వేయరు: కేటీఆర్

- రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి బాగా పెరిగిపోయిందని ఆరోపణ
- కాంగ్రెస్ అరాచకాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని మండిపాటు
- బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్న కేటీఆర్

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలు, అవినీతి, కుంభకోణాలను చూసి ప్రజలు మరో ఇరవై ఏళ్లు ఆ పార్టీకి ఓటు వేయరని వ్యాఖ్యానించారు.

- మిగతా 2లో..



## సంపాదకీయం

### ప్రభుత్వాల్లో లోపించిన
# ఆర్థిక క్రమశిక్షణ !

తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. ఉద్యోగుల బకాయిలను చెల్లించలేని దుస్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. ఎపిలో కిందామీదా పడి కేంద్రం నుంచి కొన్ని గ్రాంటలు తెచ్చకుని సర్దుకుంటున్నారు. ఎన్‌డిఎలో చంద్రబాబు కీలకం కావడంతో ఇప్పుడు కేంద్రం ఆయన పాదాక్రాంతం అవుతోంది. చంద్రబాబును కేంద్రమంత్రులు పొగిడేస్తున్నారు. పథకాలకు సంబంధించి నిధులను ఆగమేఘాల మీద విడుదల చేస్తున్నారు. అయినా ఆర్థిక క్రమశిక్షణ ఇరు రాష్ట్రాల్లో కనిపించడం లేదు. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క లెక్కలు సరిగా వేయడం లేదు. దుబారా ఖర్చులకు విదల్చడం తప్ప, అసలు వ్యవహారాల్లో పెద్దగా పట్టించుకోవడం లేదు. పెన్షనర్లు, ఉద్యోగులకే 8వేల కోట్ల బకాయలు ఉన్నాయంటే ఎంత దౌర్భాగ్యంగా ప్రభుత్వం నడుస్తుందో చెప్పవచ్చు. ఈ మధ్యే వేయికోట్లు విడుదల చేశారు. ఇకనుంచి నెలనెలా వేయికోట్లు విడుదల చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఉద్యోగులకు వారికి చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించకుండా పోవడం దారుణం. అది గత కెసిఆర్ ప్రభుత్వమైనా, ఇప్పుడున్న రేవంత్ ప్రభుత్వమైనా వైఫల్యంగానే చూడాలి. జీతాలు 1వ తారీఖున వేస్తున్నామని గొప్పలు చెప్పకోవడం మరింత అసమర్థతగా చూడాలి. దుబారా ఖర్చులు, దుబారా పథకాలు, హెలికాప్టర్ తిరుగుళ్లు మాత్రం ఆగడం లేదు. అందుకే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల విషయంలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా నాన్చివేత ధోరణి కొనసాగించింది. ఆర్థికంగా భారం పడని సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పేరుకుపోతోంది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమై ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సి ఉండగా వారూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం లోపించడంవల్ల ఇలా జరుగుతోందని అనుకోవాలి. అధికార యంత్రాంగంలో బాధ్యతా రాహిత్యం వారసత్వంగా కొనసాగుతోంది. ఇకపోతే ఉద్యోగులు కూడా లంచాలకు మరిగారు. చిన్నపనికి కూడా లంచం లేనిదే ఫైలు ముట్టడం లేదు. అంతెందుకు మాట్లాడడం లేదు. పంచాయితీల్లో వేయి తడపనిదే మాట్లాడడం లేదంటే అవినీతి ఎంతగా పెరిగిందో చూడవచ్చు. జిల్లాలు పెరిగితే కలెక్టర్లకు పనులు సులువువుతాయని అనుకున్నారు. కానీ అసలు కలెక్టర్లు తమ క్షేత్ర పరిధిలో పర్యవేక్షించడం మానేశారు. గ్రామస్థాయిలో ఉద్యోగులపై అజమాయిషీ కనిపించడం లేదు. ఫలితంగా సమస్యలు పేరుకుపోవడమే కాకుండా కొత్త సమస్యలు తరుముకు వస్తున్నాయి. దీనికితోడు మంత్రుల్లో కూడా బాధ్యత కనిపించడం లేదు. ఎవరు కూడా సమస్యను పరిష్కరించాలన్న చొరవ చూపడం లేదు. ఆర్థికమంత్రి భట్టి చొరవ చూపి ఉంటే ఉద్యోగుల బకాయిలు ఇలా పేరుకు పోయేవి కావు. ఎంతసేపు ఆరు గ్యారెంటీలను అమలు చేశాం..మాది ప్రజాప్రభుత్వం అంటూ పోజులు ఇవ్వడం తప్ప ఏమీ చేయడం లేదు. అంతెందుకు జర్నలిస్టుల అక్రిడేషన్ల సమస్యకూడా రెండున్నరేళ్లు అయినా సక్రమంగా పరిష్కరించలేకపోయరు. అసమర్థ మంత్రులు, అధికారుల వల్లనే పరిస్థితి మరింత అయోమయంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కొండల్లా పేరుకుపోతున్నా, రెండున్నరేళ్లుగా డిప్యూటి సిఎం భట్టి నోరు మెదపలేదు. ఆర్థికశాఖ చూస్తున్న ఆయన దీనిపై దృష్టి పెట్టలేదు. బకాయిలు అందక పలువురు పెన్షనర్లు న్యాయస్థానం తలుపు తట్టడం, ప్రభుత్వానికి కోర్టు అక్షింతలు వేయడం జరిగినా తక్షణంగా సమస్యను పరిష్కరించలేక పోయారు. అందుకు కారణం లేకపోలేదు. ఉన్న డబ్బులు పందేరాలకు సరిపోతోంది. కొత్త పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించేందుకు తయారవుతున్నారు. కమిషన్ల లేనిదే బిల్లులు పాస్ కావడం లేదని లోకం కోడై కూస్తున్నా మేల్కోవడం లేదు. నిజానికి పెన్షన్లు ఆపడం, బకాయిలు చెల్లించకపోవడం అన్నది కెసిఆర్ హయాంలోనే పెద్ద ఎత్తున జరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే అమలు చేయడంతో బకాయిలు కొండల్లా పేరుకు పోయాయి. బకాయిల చెల్లింపు అనేది ప్రభుత్వం బాధ్యత. నిధుల కొరత అని ఈ బాధ్యత నుంచి తప్పించుకోలేరు. తెలంగాణ ప్రభుత్వమే కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆర్థిక సంక్షోభంలోనే ఉంది. మిగతా రాష్ట్రాలు కూడా ఈ జాబితాలో చేరబోతున్నాయి. ఇందుకు ఉచిత పథకాలు తెల్ల ఏనుగుల్లా సవారీ చేస్తున్నాయని గుర్తించడం లేదు. ప్రభుత్వాలు అప్పల ఊబిలో కూరుకుపోవడానికి రాజకీయ పార్టీల ఉచిత పథకాల తీరే కారణం. ఇందులో ఎటువంటి మొహమాటం అక్కర్లేదు. వివిధ స్థాయిలలో నిర్లక్ష్యం ప్రవేశించడంతో జవాబుదారీ తనం లోపించింది. సమస్య ఏదైనా దాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే. ఆయన కిందిస్థాయిలో ఏం జరుగుతందో తెలుసుకోవడం లేదు. ప్రభుత్వంపై పట్టు సాధించలేక పోతున్నారు. దీనికితోడు కాంగ్రెస్‌లో సొంత నిర్ణయాలు తీసుకునే వెసలుబాటు ఉండదు. మొత్తంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమస్యల ఊబిలో చిక్కుకుపోతోంది. ఆర్థిక కష్టాలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అలవిగాని హామీల అమలుకు ప్రయత్నించి, అది సాధ్యం కాక ప్రభుత్వం చతికిలపడుతోంది. రైతుబంధు వంటి పథకాన్ని కూడా విడతల వారీగా అమలు చేయాల్సిన దుస్తితి కొనితెచ్చుకున్నారు. అప్పలు చేయడం, వడ్డీలకు చెల్లించడం నిత్యకృత్యంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకే ఎనిమిది వేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బిల్లుల చెల్లింపులో ప్రాధాన్యాలు పాటించకపోవడం,రాజకీయ పలుకుబడిని బట్టి చెల్లింపులు చేయడం వల్ల వివిధ వర్గాల ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోంది. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించలేకుండా, అభివృద్ధి పనులు చేయకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని హుంకరిస్తే..ప్రజలు ఆదరించాలని గుర్తించాలి. అధికారం అన్నది ప్రజల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉందని గుర్తించి మసలుకుంటే మంచిది.

## రుతుపవనాలు ముందే రాక..

మే నెలలో దేశ సగటు వర్షపాతం సాధారణం కంటే 110 శాతం ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేశారు.

అయితే తూర్పు, ఈశాన్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తక్కువగా నమోదయ్యే సూచనలున్నాయి.వర్షాల సూచన ఉన్నప్పటికీ, వేడి విషయంలో ఊరట అంతంతమాత్రంగానే ఉండనుంది. దేశంలోని చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉన్నా, రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం అధికంగా ఉంటాయని ఐఎండీ తెలిపింది. "అధిక వర్షాల అంచనాతో మేఘాలు కమ్ముకుని ఉంటాయి. దీనివల్ల రాత్రిపూట వేడి బయటకు పోకుండా చిక్కుకుపోయి రాత్రులు వెచ్చగా ఉంటాయి" అని మహాపాత్ర వివరించారు.మరోవైపు గుజరాత్, మహారాష్ట్రతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా వంటి తూర్పు తీర రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాల్పులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో అధిక తేమ కారణంగా ఉక్కపోత తీవ్రంగా ఉంటుందని ఐఎండీ పేర్కొంది. కేరళకు రుతుపవనాల రాక తేదీని మే చివరి వారంలో ప్రకటిస్తామని తెలిపింది.

### ఇరాన్‌తో యుద్ధంపై
## నాలుక మడతవేసిన యూఎస్..



దీంతో శుక్రవారానికి 60 రోజుల గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో, 1973 నాటి చట్టం ప్రకారం కాంగ్రెస్ అనుమతి పొందాల్సిన అవసరం లేదని, ఎందుకంటే సైనిక చర్య 60 రోజులకు మించి కొనసాగలేదని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ సెనెట్‌లో తెలిపారు. అయితే, ఈ వాదనను ప్రతిపక్ష డెమోక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గడువు ముగిసినందున ఇరాన్ నుంచి అమెరికా బలగాలను తక్షణమే వెనక్కి పిలవాలని డిమాండ్ చేస్తున్నారు. భారీ దాడికి అమెరికా సన్నాహాలు ఒకవైపు రాజకీయంగా మాటల యుద్ధం జరుగుతున్నప్పటికీ, మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతోంది. ఇరాన్‌పై యుద్ధం కొనసాగించాల్సి వస్తే, భీకర దాడి చేసేందుకు 'డార్క్ ఈగిల్' అనే హైపర్‌సోనిక్ క్షిపణులను వాడేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఐరోపా సమాఖ్య (ఈయూ)తో వాణిజ్య ఒప్పందాన్ని గౌరవించడం లేదంటూ అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈయూ నుంచి దిగుమతి అయ్యే కార్లు, ట్రక్కులపై సుంకాన్ని 25 శాతానికి పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో మరో వాణిజ్య యుద్ధానికి తెరలేపినట్లయింది.

# చేనేతల లోగిళ్లలో 'ఉచిత' కాంతులు

ఉచిత విద్యుత్ పథకం అమలుతో చేనేత కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలిగింది. ఒకవైపు చేనేత రంగ అభివృద్ధికి ప్రణాళికలు అమలుచేస్తూనే, నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగించేలా పథకాలు అమలు చేస్తోంది. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు రూ.4 వేల చొప్పున పెన్షన్ అందజేస్తోంది. ఏటా రూ.5 కోట్ల మేర త్రిఫ్ట్ ఫండ్ నిధులు కేటాయిస్తోంది. నూలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తోంది. ఆప్కో ద్వారా చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తోంది. ఆన్ లైన్ ద్వారా నేరుగా వినియోగదారుల ఇళ్లకే చేనేత ఉత్పత్తులను డోర్ డెలివరీ చేస్తోంది. 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ.24.43 కోట్లు అందచేసింది.

**జీరో విద్యుత్ బిల్లుల రాక...**

గత నెల ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకం అమల్లోకి రావడంతో, గడిచిన రెండ్రోజుల నుంచి గ్రామాల్లో చేనేతలకు విద్యుత్ బిల్లులను ట్రాన్స్ కో అధికారులు అందజేస్తూ వస్తున్నారు. జీరో పేమెంట్ విద్యుత్ బిల్లులు రావడంతో, చేనేతల ఆనందానికి అవధుల్లేకుండాపోయింది. బిల్లులు చెల్లించాల్సిన అవసరంలేదని ట్రాన్స్ అధికారులు చెబుతుండడంతో వారంతా మురిసిపోతున్నారు. చేనేత, విద్యుత్ శాఖాధికారులు సమన్వయంతో పనిచేస్తూ నేతన్నల ఉచిత విద్యుత్ పథకం విజయవంతానికి తమ వంతు పాత్ర పోషించారు. రాష్ట్రంలో 50,252 మగ్గం నేతన్నల కుటుంబాలను, 6,995 మరమగ్గం మీద నేసే కుటుంబాలను ఉచిత విద్యుత్ పథకం కింద అర్హులుగా గుర్తించారు. వారికి ఉచిత విద్యుత్ సరాఫరా చేశారు. మిగిలిన అర్హులకూ ఉచిత విద్యుత్ పథకం వర్తించేలా కృషి చేస్తున్నారు.



**ఉచిత విద్యుత్ తో ఆర్థిక భరోసా**

ఉచిత విద్యుత్ తో మగ్గం నేతన్నలకు నెలకు రూ.720లు, సంవత్సరానికి రూ.8,640లు లబ్ధి కలుగనుంది. మరమగ్గం మీద నేసే కుటుంబానికి నెలకు రూ.1,800లు, ఏడాదికి రూ.21,600లు లబ్ధి కలుగనుంది. ఉచిత విద్యుత్ రూపంలో నెల నెలా ఆర్థిక భారం తప్పిందని, తమకు ఆర్థికంగా ఎంతో మేలు చేస్తోందని నేతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చినమాటకు కట్టుబడుతూ, ఉచిత విద్యుత్ హామీ నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు, కూటమి ప్రభుత్వానికి చేనేతలు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

**నేతన్నలకు 365 రోజులూ ఉపాధే లక్ష్యం**

చేనేత కార్మికులకు గౌరవ జీవనం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. సగం ధరకే చీర, దోవతి నినాదంతో ఆనాడు అన్న ఎన్టీఆర్ చేనేత రంగానికి ఊపిరిపోస్తే, నేడు సీఎం చంద్రబాబు నేతన్నలకు ఆర్థిక మేలు కలుగజేసేలా పథకాలు రూపొందిస్తున్నారు. పెన్షన్లు, నూలుపై సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్ నిధులు, ముద్ర రుణాలు, 90 శాతం సబ్సిడీ ఆధునిక పరికరాలు అందజేత వంటి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించేలా కూటమి ప్రభుత్వం పలు ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా మెగా టెక్స్ టైల్స్ పార్కులు, క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. గత నెల ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకంతో నేతన్న కుటుంబాలకు మరింత లబ్ధి కలుగుతోంది. మగ్గం నేతన్నలకు ఏడాదికి రూ.8,640లు, మరమగ్గం నేతన్నలకు రూ.21,600 లబ్ధి కలుగుతోంది. చేనేతలకు 365 రోజుల పాటు పని కల్పించడమే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్యం దిశగా వడివడిగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్నాం...ఉచిత విద్యుత్ తో నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు చేనేతల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని మంత్రి సవిత పేర్కొన్నారు

### వైద్య ఆరోగ్య రంగానికి
# శాపంలా కూటమి ప్రభుత్వం

**ఆరోగ్యశ్రీని తాకట్టు పెట్టిన కూటమి ప్రభుత్వం:** వాటికి సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సహాయం చేస్తూ, అందులో 30 శాతం కమిషన్ తీసుకుంటున్నారు. అలా ఒక చేత్తో ఇచ్చి, మరో చేత్తో లాక్కుంటున్నారు. ఇంకా ఆస్పత్రుల్లో వైద్యులు ఉండడం లేదు. మందులు, సూది, దూది కూడా లేని దౌర్భాగ్య స్థితి నెలకొంది.

ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపుల కోసం నెట్‌వర్క్ ఆస్పత్రుల షూరిటీతో అప్పులు తేవడం ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ట. ఆరోగ్యశ్రీకి దాదాపు రూ.4 వేల కోట్ల బకాయి పెట్టి, ప్రజలను వైద్యానికి దూరం చేస్తున్నారు. వైయస్.జగన్ హయాంలో ఆరోగ్యశ్రీని దాదాపు 3300 ప్రోసీజర్స్ వరకు పెంచి ఏ పేదవాడికి కష్టం రాకుండా చేశారు. పథకంలో రూ.25 లక్షల వరకు పరిధి పెంచితే దాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టిస్తోంది.

మరోవైపు ఏటా రూ.1000 కోట్ల చొప్పున 5 ఏళ్లు ఖర్చు పెడితే, నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలు పూర్తవుతాయి. కానీ, చంద్రబాబు ప్రభుత్వం, ఆ పని చేయకుండా, నిధుల కొరత పేరుతో పీపీపీ అంటూ వాటిని తెగనమ్మే ప్రయత్నం చేస్తోంది.

అమరావతిని తన స్వప్రయోజనాల కోసం ఒక 'అవినీతి కేంద్రం'గా మార్చిన చంద్రబాబు, అక్కడ భవనాల అద్దాల కోసం ఏకంగా రూ.2,540 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించడం దారుణం. అవే నిధులు ప్రజల ఆరోగ్యం, విద్య కోసం వెచ్చిస్తే పేదలకు



మేలు జరిగేది. కానీ, చంద్రబాబుకు ప్రజల కష్టాల కంటే అమరావతి కాంట్రాక్టుల మీదనే ప్రేమ ఎక్కువ. రాజధాని నిర్మాణాన్ని చంద్రబాబు తన సంపద సృష్టించుకునే 'అవినీతి కేంద్రం'గా మార్చేశారు. అసెంబ్లీ భవనాల అద్దాల కోసం రూ.2,540 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించడంతో, అక్కడ భవనాల నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు ఏకంగా రూ.18,500కు చేరింది. నిజానికి దేశ రాజధాని ఢిల్లీలో సైతం ఇంత భారీ నిర్మాణ వ్యయం లేదు.

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా, కేవలం పబ్లిసిటీ స్టంట్లు తప్ప ఒక్క పథకమూ సక్రమంగా అమలు చేయలేదు సరికదా... ఒక్క కొత్త పెన్షన్ సైతం మంజూరు చేయలేదు. ప్రతి నెలా ఒకటో తేదీన ఏదో ఒక గ్రామంలో సెట్టింగ్స్ వేసి, పెన్షన్లు ఇస్తున్నట్లు షూటింగ్‌లు చేయడం చంద్రబాబు మార్క్ డ్రామాలకు నిదర్శనం. వైయస్ జగన్ హయాంలో మంజూరైన 66.35 లక్షల పెన్షన్లలో, ఇప్పటివరకు ఒక్క కొత్త పెన్షన్ ఇవ్వకపోగా.. ఏకంగా 6 లక్షల పెన్షన్లను తొలగించి పేదల కడుపు కొట్టారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ అనే సూపర్ సిక్స్ హామీ పూర్తిగా గాలికి వదిలేసింది. మరోవైపు రైతులు పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. గిట్టుబాటు ధరలేక మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారికి న్యాయం చేయవచ్చు. ఇవన్నీ మీకు ఎందుకు కనిపించడం లేదు చంద్రబాబు గారూ? వీటిని కాదని మీ ఆర్భాటం గురించి మాత్రమే ఎందుకు ఆలోచన చేస్తున్నారు?. ప్రజల ప్రయోజనాల కోసం పని చేయడం లేదు. వారి పట్ల మీకు చిత్తశుద్ధి లేదు. నిజానికి రాష్ట్రంలో హత్యా రాజకీయాలు, గొడ్డలివేటు రాజకీయాలు చేస్తున్నది తెలుగుదేశం పార్టీ. నిజానికి ఆ పార్టీ అసలు పేరు వెన్నుపోటు పార్టీ. ఆ పార్టీని ప్రారంభించిన ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి, ఆయన్నుంచి పార్టీని, పదవిని లాక్కున్న చంద్రబాబు, అప్పటి నుంచి అవే వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారు. మల్లెల బాబ్జీ అనుమానాస్పద మృతి మొదలు, మొన్నటి వినుకొండలో రషీద్ దారుణ హత్య వరకు చంద్రబాబువన్నీ హత్యా రాజకీయాలే అని"మాజీ మంత్రి విడదల రజిని వివరించారు.

# సుప్రీంలో మమతా బెనర్జీకి చుక్కెదురు

టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.ఎస్. నరసింహ, జయమాల్య బాగ్చీలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం తాజాగా విచారించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా తమకు వ్యతిరేకంగా వెళ్తారనే టీఎంసీ వాదన సరికాదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులపై విశ్వాసం ఉంచాలని సూచించింది. పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే నియమిస్తూ ఈసీ జారీ చేసిన సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా లేదని పేర్కొంది. ఓట్ల లెక్కింపు సమయంలో అక్కడ టీఎంసీ ప్రతినిధులు కూడా ఉంటారని వివరించింది. ఓట్ల లెక్కింపు సిబ్బందిని కేవలం ఒకే వర్గం నుంచి ఎంచుకునే వెసులుబాటు ఎలక్షన్ కమిషన్‌కు ఉందని పేర్కొంది. టీఎంసీ పిటిషన్‌పై తదుపరి ఆదేశాలు అవసరం లేదని పేర్కొంది. ఏప్రిల్ 13 నాటి ఆ సర్క్యులరే అమలవుతుందని స్పష్టం చేసింది.




# లోకేశ్ పై వెంకయ్యనాయుడు ప్రశంసలు



నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమూడిలో ఈరోజు పర్యటించిన ఆయన, శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి జీవిత చరిత్ర 'విశ్వంభరుడు'

పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్య, కుటుంబం మరియు సామాజిక విలువలపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర విద్యాశాఖలో వస్తున్న మార్పులను వెంకయ్యనాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాధించిన ఘనతను ఆయన కొనియాడారు. విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని, మంచి పనులు చేసే వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఆయన సూచించారు.ఇక, "నా కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్‌ల వ్యాపారాల్లో నేను జోక్యం చేసుకోను. నా రాజకీయాల్లోకి వారు రావొద్దు అని మా మధ్య ఒక గౌరవ ఒప్పందం ఉంది" అని ఆయన తెలిపారు. నేటి కాలంలో తల్లిదండ్రులు పిల్లలకు సమయాన్ని కేటాయించడం లేదని, టీవీలు, మొబైళ్లకే పరిమితం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలతో గడపడం ద్వారానే మంచి విలువలను అందించగలమని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలోని పరిస్థితులపై వెంకయ్యనాయుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రోజూ పత్రికల్లో వస్తున్న కొన్ని వార్తలను చూస్తుంటే సిగ్గేస్తోందని, పాశ్చాత్య వ్యామోహంలో పడి మన సంస్కృతిని విస్మరిస్తున్నామని మండిపడ్డారు. సమాజం గతితప్పినప్పుడే యోగి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వంటి మహానుభావులు జన్మిస్తారని, ఆధ్యాత్మికత వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు.



### పేలుడు ఘటనలో ముగ్గురు
## జవాన్లు మృతి

ఇన్‌స్పెక్టర్ సుఖ్రామ్ వట్టి, కానిస్టేబుల్ కృష్ణ కొమ్రా, కానిస్టేబుల్ సంజయ్ గఢ్‌పాలేలు పోలీసులు ధృవీకరించారు. ఈ ఘటనలో మరొక కానిస్టేబుల్ పరమానంద్ కోమ్రా తీవ్ర గాయాలపాలయ్యారు. ఆయన ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు.



### కర్ణాటకలో
## బర్డ్ ఫ్లూ కలకలం

పరిస్థితిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.జిల్లా డిప్యూటీ కమిషనర్ శోభా కళ్యాణ్ మాట్లాడుతూ.... చనిపోయిన పక్షుల నమూనాలను పరీక్షలకు పంపినట్లు తెలిపారు. ల్యాబ్ నివేదికల్లో ఎ5చీ1 నిర్ధారణ కావడంతో అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు.

ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బాగా ఉడికించిన మాంసాన్ని మాత్రమే వినియోగించాలని సూచించారు. ఈ ప్రాంతంలో ఉన్న సుమారు 31 పౌల్ట్రీ దుకాణాలు, 10 ఫారాలను అధికారుల నిఘాలో ఉంచినట్లు తెలిపారు. రాపిడ్ రెస్పాన్స్ టీమ్ నిరంతరం పరిస్థితిని గమనిస్తోంది.

ఇదిలా ఉండగా, బర్డ్ ఫ్లూ కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో బిలాస్ పూర్ లో గతంలోనే 10 కిలోమీటర్ల పరిధిలో పౌల్ట్రీ ఉత్పత్తుల అమ్మకాలపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే సమాచారాన్ని అందించాలని సూచిస్తున్నారు.

### కాంగ్రెస్ మళ్లీ
## అధికారంలోకి రాదు..

రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల అవినీతి బాగా పెరిగిపోయిందని అన్నారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిందని, ఇప్పుడు చేతులెత్తేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలు చూసిన ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. నిన్న మోదీ ప్రభుత్వం వాణిజ్య సిలిండర్‌పై సుమారు రూ.993 పెంచిందని, ప్రజా వ్యతిరేక విధానాలకు ఇదే నిదర్శనమని అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఎక్కడికక్కడ నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.



# ప్రజాభూమి

ఎన్టీఆర్, కృష్ణా
ఆదివారం, మే 03, 2026



## కౌనకళ్ళ పట్టాభిషేకం.. కృష్ణా జిల్లామార్కెట్ యార్డ్ చైర్మన్ల ఘన సన్మానం

మచిలీపట్నం/ప్రజా భూమి ప్రతినిధి
తెలుగుదేశం పార్టీ అగ్రనాయకత్వం, పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ మాజీ ఎంపీ, టీడీపీ జాతీయ కోశాధికారి కరిగా పార్టీ నియమించినందుకు కొనకల్ల నారాయణకు అభినందనల వెల్లువ కొనసాగుతోంది. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను, క్రమశిక్షణను గుర్తించి ఈ పదవిని అప్పగించడం పట్ల కృష్ణా జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.ఘనంగా సన్మానించిన మార్కెట్ కమిటీ చైర్మన్లుశనివారం మచిలీపట్నంలో వారి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన మార్కెట్ యార్డ్ చైర్మన్లు, సీనియర్ నాయకులు కలిసి కొనకల్ల నారాయణను, ఆయన సోదరుడు కొనకల్ల బుల్లయ్యను ఘనంగా సత్కరించారు. చంద్రబాబు నాయుడు తనపై ఉన్న మమ కారంతో ఈ బాధ్యతలు అప్పగించారని, పార్టీ బలోపేతానికి తామం తా సైనికుల్లా పనిచేస్తామని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొని కొనకల్ల సోదరులకు శాలువాలు కప్పి, పూలమాలలతో అభినందించిన పలు నియోజకవర్గాల చైర్మన్లు కుంచె నాని (దుర్గాప్రసాద్) మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్గూడవల్లి నరసింహారావు గన్న వరం మార్కెట్ కమిటీ చైర్మన్ధన కోటేశ్వరరావు, కంకిపాడు మార్కెట్ కమిటీ చైర్మన్,ప్రవీణ్ కుమార్ ఉయ్యూరు మార్కెట్ కమిటీ చైర్మన్తులసి రావు బంటుమిల్లి మార్కెట్ కమిటీ చైర్మన్,తోట కనకదుర్గ ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్, శోభన్ బాబు పామర్రు మార్కెట్ కమిటీ చైర్మన్, బాబు రావు తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులుపార్టీ కోసం నిరంతరం కృషి నేతల ప్రశంసలుఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్లు మాట్లాడుతూ.. కొనకల్ల నారాయణ జిల్లా రాజకీయాల్లో ఒక అజాతశత్రువు అని, కష్టకాలంలో కూడా పార్టీ వెన్నంటే ఉండి కార్యకర్తలకు అండగా నిలిచారని కొనియాడారు. ఆర్టీసీ చైర్మన్గా ఆయన అనుభవం సంస్థ అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కొనకల్ల నారాయణ మాట్లాడుతూ.. ఈ పదవి తనకు దక్కిన గౌరవంగా





భావించడం లేదని, కార్యకర్తలందరి కష్టానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని, చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు.

## ప్రజా దర్బార్ కార్యక్రమంలో కాగిత కృష్ణ ప్రసాద్



ప్రజాభూమి పెడన
పెడన నియోజకవర్గ పరిధిలోని తోటమూల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఈ కార్యక్రమంలో గ్రామాల్లో వేసవికాలంలో తాగు నీటి సమస్య, విద్యుత్ సరఫరా గురించి, రోడ్లు సమస్యలు తదితర అంశాలపై ప్రజలు నుండి వినతులును స్వీకరించారు ప్రజలు ఇస్తున్న వినతులపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేలా జవాబుదారీతనం ఉండటం ముఖ్యమని ఈ సందర్భంగా సూచించడం జరిగింది. ముఖ్యంగా ప్రజలు ఇచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యలు గురించి సమాచారం చేరవేయాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా తాగు నీటి సమస్యలపై తక్షణమే స్పందించాలని తెలిపారు.

## పెడన నియోజకవర్గంలో 32 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరిక



ప్రజాభూమి పెడన
పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సమక్షంలో వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలుఎన్డీఏ కూటమి అభివృద్ధి చూసి అధికార పార్టీ వైపు అడుగులు...పెడన నియోజకవర్గం బంటుమిల్లి మం డలం పెద్ద తుమ్మిడి గ్రామంనుండి 8 కుటుంబాలు మరియు మూలపారు గ్రామంలో 12 కుటుం బాలు పెడన మండలం కొంగంచర్ల పంచాయతీ 7 కుటుంబాలు, కృత్తివెన్ను మండలంలో కొమ లంపూడి గ్రామంలో 5 కుటుంబాలు మొత్తం 32 వైసిపి కుటుంబాలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న అభివృద్ధిని చూ సి టిడిపి వైపు ఆకర్షితులైనట్లు పార్టీలో చేరిన నేతలు చెబుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం లో రాష్ట్రం అభివృద్ధి జరగలేదని కూటమీ ప్రభుత్వం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేగంగా అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు.పెడన నియోజకవర్గాన్ని అందరి సహకారంతో సమిష్టిగా అభివృద్ధి చేసుకుందామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు.



## ఆలోచన నుంచే ఆరంభం... ఆత్మవిశ్వాసమే మూలధనం

**- ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలి**
**- ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి**
**- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
మహిళల సాధికారతకు పారిశ్రామిక రంగం కీలక వేదిక అని.. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధిం చాలని.. మంచి ఆలోచనతో ఆత్మవి శ్వాసమే మూలధనంగా ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం గొల్లపూడిలోని డీఆర్డీఏ కార్యాలయంలో రైజ్ ఆధ్వర్యంలో భారతీయ యువశక్తి ట్రస్ట్ భాగస్వామ్యంతో పారిశ్రామికవేత్తల అభివృద్ధి కార్యక్రమం (ఈడీపీ) జరిగింది. దాదాపు 70 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ట్రస్ట్ ప్రతినిధులు.. పారిశ్రామికవేత్తగా ఎదగాలనుకునే వారికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం అందించే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని పిలుపునిచ్చారు. మహిళల్లో నైపుణ్యాలు, సృజనాత్మకతను ఉపయోగించుకుని చిన్న స్థాయి వ్యాపారాలను పెద్ద స్థాయికి తీసుకెళ్లే సామర్థ్యం ఉన్నదని తెలిపారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పలు పథకాలు, శిక్షణ కార్యక్రమాలు, రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ము ఖ్యంగా స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థి కంగా బలపడటంతో పాటు, పారిశ్రామిక రంగంలో ముం దంజ వేయవచ్చని వివరించారు. మహిళలు వ్యాపార రంగంలో అడుగుపెడితే కుటుంబ ఆర్థిక స్థితి మెరుగు పడటమే కాకుండా సమాజ అభివృద్ధికి దోహదపడు తుందన్నారు. ధైర్యం, పట్టు దలతో ముందుకు సాగితే విజయాన్ని సాధించడం సాధ్యమని మహిళలకు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. భారతీయ యువశక్తి ట్రస్ట్.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతను ఉద్యోగ అన్వేషకులు నుండి ఉద్యోగ సృష్టికర్తలుగా మార్చ డానికి విశేషంగా కృషిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, లావణ్యకుమారి సారథ్యంలోని భారతీయ యువశక్తి ట్రస్ట్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

## పిల్లల సర్వతోముఖాభివృద్ధికి సహాయ హస్తం

**ఉత్సాహంగా ప్రారంభమైన ఉచిత సమ్మర్ కరాటే, డాన్స్ శిక్షణ తరగతులు**
**ముఖ్య అతిథిగా హాజరైన లంకిశెట్టి బాలాజీ..**
**సామాజిక సేవలో సహాయ ఫౌండేషన్ ఆదర్శం**





మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, వారి మానసిక వికాసానికి మరియు శారీరక దృఢత్వానికి తోడ్పడేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, సహాయ ఫౌండేషన్ లీగల్ చైర్మన్ లంకిశెట్టి బాలాజీ పిలుపునిచ్చారు.శనివారం స్థానిక పల్లపోతు వారి సత్రంలో సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత సమ్మర్ కరాటే మరియు డాన్స్ క్లాసులను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు.ఆత్మ రక్షణకు కరాటే.. ఆహ్లాదానికి డాన్స్ఈ సందర్భంగా లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ.. నేటి సమాజం ఉన్నతంగా తీర్చిదిద్దబడాలంటే పిల్లలను నైతిక విలువలతో పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి విద్యార్థికి ఆత్మరక్షణ కోసం కరాటే అవసరమని, అలాగే మానసిక ఉల్లాసానికి డాన్స్ ఎంతో దోహదపడు తుందని పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్లుగా సహాయ ఫౌండేషన్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,000 సేవా కార్యక్రమాలు నిర్వహించి, ప్రభుత్వం నుండి ఉత్తమ సేవా సంస్థగా గుర్తింపు పొందడం అభినందనీయమని కొనియాడారు.నిరంతర సేవే మా లక్ష్యం మొహమ్మద్ ఉస్మాన్ భాషసంస్థ చైర్మన్ మొహమ్మద్ ఉస్మాన్ భాష మాట్లాడుతూ.. పేద విద్యార్థుల కోసం ప్రతి ఏటా సంక్రాంతి, వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రముఖ డాన్సర్ మధు నేతృత్వంలో గత మూడేళ్లుగా ఉచితంగా డాన్స్ శిక్షణ ఇస్తున్నామని వివరించారు. సామాజికవేత్త వరప్రసాదరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఈ సంస్థ జిల్లాలోనే అగ్రగా మిగా నిలవడం గర్వకారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో డాన్స్ మాస్టర్ మధు, తుమ్మల వరప్రసాద్, ఉమాదేవి, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సహాయ ఫౌండేషన్ చేస్తున్న ఈ కృషితో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి వస్తుందని వారు హర్షం వ్యక్తం చేశారు.

## కూటమి ప్రభుత్వంతోనే సామాజిక భద్రత గోపు సత్యనారాయణ

**సారంగిపాలెంలో రెండో రోజు ఘనంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ**
**నెల పారంభంలోనే ఇంటివద్దకే పింఛన్.. ప్రజల్లో హర్షాతిరేకాలు**
**హామీల అమలులో దేశానికే ఆదర్శంగా ఏపీ**
**కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి**



ప్రజాభూమి,మచిలీపట్నం రూరల్
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పేర్కొన్నారు. శని వారం కానూరు పంచాయతీ పరిధిలోని సారంగిపాలెం గ్రా మంలో రెండో రోజు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును స్వయంగా అందజేసి, వారితో ఆత్మీయంగా మాట్లాడారు.అమలవుతున్న హామీలు - అండగా నిలుస్తున్న ప్రభుత్వంఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడు తూ కీలక వ్యాఖ్యలు చేశారుసమయపాలన ప్రతి నెల ఒకటో తారీఖునే పింఛను అందించేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలు అభినందనీయమని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంపిణీ ప్రక్రియ అత్యంత వేగంగా, పారదర్శకంగా జరుగుతోందని చెప్పారు. భారీగా పెంపు మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం వృద్ధాప్య పింఛను ₹4,000, వికలాంగులకు ₹6,000, డయాలసిస్ బాధితులకు ₹10,000, పక్షవాతం లేదా మంచానికే పరిమితమైన వారికి ₹15,000 చొప్పున పెంచిన పింఛన్లను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు.ఎన్టీఆర్ భరోసా దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్టీఆర్ భరోసా పథకాన్ని ముఖ్యమంత్రి గారు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీకి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే లక్ష్యంగా మా పాలన సాగుతోంది అని గోపు సత్యనారాయణ, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారుఈ కార్యక్రమంలో విఆర్ఓ సుబ్బయ్య దాస్, పీత రాము, బొమ్మిడి పెద్ద ఏడుకొండలు, గోపు వెంకటరమణ, విజయ్, మోకా నాగరాజు, కొక్కి లిగడ్డ గోవిందరాజులు, కొక్కిలిగడ్డ పోతురాజు, మోకా రాము, పెదసింగు వెంకట రమణతో పాటు సచివాలయ సిబ్బంది మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నేత వల్లభనేని బాబూరావు కన్నుమూత

**అంతిమ యాత్రలో పాల్గొన్న నేతలు**
**పడి మోసిన కొనకళ్ళ జగన్నాథం (బుల్లయ్య)**

గుడివాడ/ ప్రజభూమి ప్రతినిధి
ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగు దేశం పార్టీ మాజీ అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వల్లభనేని బాబూరావు కన్నుమూశారు. ఆయన మృతి పట్ల రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెల కొంది. శనివారం జరిగిన ఆయన అంతిమ యాత్రలో పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు.

అంతిమ యాత్రలో ప్రముఖులుబాబూరావు భౌతిక కాయానికి నివాళులర్పించిన వారిలో ప్రధానంగాఎమ్మెల్యే గద్దె రామ మోహన్ ఏపీ స్టేట్ వేర్హౌసింగ్ కార్పొ రేషన్ (APSWC) చైర్మన్ రావి వెంకటేశ్వరరావుఏపీఎస్ఆర్టీసీ (APSRTC) చైర్మన్, టీడీపీ జాతీయ కోశాధికారి, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు సోదరుడు, రాష్ట్ర బీసీ నాయకుడు కొనకళ్ల బుల్లయ్యపాడే మోసిన నేతలుబాబూరావుకు కడసారి వీడ్కోలు పలుకుతూ ఎమ్మెల్యే గద్దె రామ మో హన్, రావి వెంకటేశ్వరరావు, కొనకళ్ల బుల్లయ్య మరియు ఇతర టీడీపీ నాయకు లు ఆయన పాడే మోశారు.



పార్టీ కోసం బాబూరావు చేసిన సేవ లను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. అంతిమ యాత్రలో పె ద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు.

## పదవిపై మమకారం.. బాధ్యతలో అంకితభావం


కుంచె నానిని పరామర్శించిన పలు నియోజకవర్గాల మార్కెట్ కమిటీ చైర్మన్లు



మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి
మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని) పనితీరు, బాధ్యత పట్ల ఆయనకున్న నిబద్ధత తోటి చైర్మన్లకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న ఆయన, వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించినప్పటికీ, మార్కెట్ యార్డ్ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి రావడం విశేషంఘనంగా పరామర్శించిన పలువురు మార్కెట్ యార్డ్ చైర్మన్లు శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న కుంచె నాని ని కృష్ణాజిల్లాలోని వివిధ నియోజకవర్గాల మార్కెట్ కమిటీల చైర్మన్లు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్న చైర్మన్లు, త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు.పరామర్శించిన వారిలోగన్నవరం మార్కెట్ కమిటీ చైర్మన్ గూడవల్లి నరసింహారావుకంకిపాడు చైర్మన్ ధన కోటేశ్వరరావుఉయ్యూరు చైర్మన్ ప్రవీణ్ కుమార్బంటుమిల్లి చైర్మన్ తులసి రావు ఘంటసాల చైర్మన్ తోట కనకదుర్గపామర్రు చైర్మన్ శోభన్ బాబుతెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బాబు రావువీరితో పాటు తెలుగుదేశం, జనసేన కూటమి సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని ఆయనను పరామర్శించారు. విశ్రాంతిని వీడి.. ప్రజాసేవలో..ఈ సందర్భంగా తోటి చైర్మన్లు మాట్లాడుతూ, కుంచె నాని తన పదవి పట్ల చూపిస్తున్న మమకారాన్ని కొనియాడారు. శస్త్రచికిత్స జరిగి రెస్ట్ తీసుకోవాల్సిన సమయంలో కూడా, ఆఫీస్ మెట్లు ఎక్కి వచ్చి రైతుల సమస్యలను, మార్కెట్ యార్డ్ ఇబ్బందులను తెలుసుకుంటూ అక్కడికక్కడే పరిష్కరిస్తుండటం ఆయన కార్యదక్షతకు నిదర్శనంbఅని వారు పేర్కొన్నారు.కార్యాలయానికి విచ్చేసి విధులు నిర్వహిస్తున్న ఆయన ఉత్సాహాన్ని చూసి కూటమి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సేవలో ఆయన చూపిస్తున్న చొరవ అభినందనీయమని అందరూ ముక్తకంఠంతో కొనియాడారు.

## దాహం కేక.. మురుగు నీరే దిక్కా?

### కృష్ణారావు పేటలో దయనీయ స్థితి



ప్రజాభూమి , మచిలీపట్నం రూరల్
అభివృద్ధి మంత్రం జపిస్తున్నా, పల్లెల్లో తాగునీటి కష్టాలు తీరడం లేదు. కృష్ణా జిల్లా మచిలీపట్టణం రూరల్ పరిధిలోని రుద్రవరం పంచాయితీ, కృష్ణారావు పేట గ్రామంలో తాగునీటి సమస్య పరాకాష్టకు చేరింది. ప్రజలు గుక్కెడు నీటి కోసం పడుతున్న పాట్లు చూస్తుంటే కళ్లు చెమర్చుతున్నాయి. పైపులైన్ లీకులే ఆధారం.. అవే మాకు తీర్థంగ్రామంలో సరైన తాగునీటి సౌకర్యం లేకపోవడంతో, గ్రామస్థులు రోడ్ల పక్కన ఉన్న ఇంకుడు గుంటల వద్ద లేదా పైపులైన్ల నుంచి కారుతున్న మురుగు నీటిని తోడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రధాన పైపులైన్ల లీకేజీల ద్వారా వచ్చే నీటిని గంటల తరబడి వేచి ఉండి పట్టుకుంటున్నారు.సోషల్ మీడియాలో వైరల్ - అధికారులకు విన్నపంఈ దయనీయ దృశ్యాలను గ్రామస్థులు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, మంత్రి కొల్లు రవీంద్ర కి,ఎంపీ వల్లభనేని బాలసౌరి కి దయచేసి మా గ్రామ సమస్యలను పరిష్కారం చేయగలరు అంటూ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు మా గ్రామంలో నీటి కష్టాలు చూడండి.. మేము మనుషులమేనా? మాకు స్వచ్ఛమైన తాగునీరు అందించే నాథుడే లేడా?" అని కృష్ణారావు పేట గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

## 'పది' లమైన ప్రతిభకు కీర్తి కిరీటం!

**- అధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించిన కలెక్టర్ లక్ష్మీశ**
**- భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచన**
**- విజయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్రను ప్రశంసించిన కలెక్టర్**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాభినందనలు తెలియజేస్తున్నానని, ఈ విజయం స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు.జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని అత్యుత్తమ మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి సత్కరించారు. అధికారులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. గరిష్ఠంగా 595 మార్కులు రాగా.. 31 మంది విద్యార్థులు 580, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారన్నారు. 376 మంది విద్యార్థులకు 550కు పైగా మార్కులు వచ్చాయని అదేవిధంగా 1,557 మంది విద్యార్థులు 500కు పైబడి మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యమైనా సాధించగలరని పేర్కొన్నారు.

పదో తరగతి విజ యాన్ని ఒక మొదటి మెట్టుగా భావించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని సాధించేందుకు కృషిచేయాలని సూచిం చారు. విద్యార్థుల విజయాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని.. వారి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం వల్లే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలిగారని అభినందించారు. జిల్లా అభివృద్ధికి విద్యార్థులే చోదకశక్తులని పేర్కొం టూ, పోటీ ప్రపంచంలో ముందుం డేం దుకు లక్ష్యాలను చేరుకునే వరకు విశ్రమిం చకుండా పట్టుదలతో చదువుకోవాలని సూచిం చారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధా న్యత ఇస్తోందని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, డిప్యూటీ డీఈవో సాంబశివరావు, సమగ్రశిక్ష ఏపీసీ రమేష్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రాం బాబు, జిల్లా కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డ్ సెక్రటరీ ఉమర్ అలీ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పుష్కరాల పనులపై అధికారులకు సూచనలు



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

రానున్న పుష్కరాల దృష్ట్యా కొవ్వూరు నియోజకవర్గంలో చేపట్టాల్సిన అత్యవసర ప్రాధాన్యత పనులపై ప్రతిపాదనల కోసం సంబంధిత అధికారులు, ఇరిగేషన్ మరియు పంచాయతీ రాజ్ విభాగాల అధికారులతో శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా ఘాట్‌ల అభివృద్ధి, రహదారుల మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సదుపాయాలు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేసి, పుష్కరాల సమయానికి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి ఘన సత్కారం



ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా.

ఇంటర్మీడియట్ “2025–26” విద్యాసంవత్సరానికి నిర్వహించిన పరీక్షల్లో పెదపాడు గవర్నమెంట్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థి దేవనమైన ముత్తయ్య 982 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ముత్తయ్యను దుశాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతం నుండి వచ్చి ఇంత గొప్ప విజయాన్ని సాధించడం గర్వకారణమని, ముత్తయ్య పట్టుదల, కృషి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బాల బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంచడానికి కిశోర్ వికాసం.

ప్రజాభూమి ప్రతినిధి–బుట్టాయగూడెం



బాల బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంచడానికి కిషోర్ వికాసం అన్ని విధాల తోడ్పడుతుందని సిడి పిఓ యు వి. పద్మావతి అన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు, బుట్టాయగూడెం పరిధిలోగల రెడ్డి గణప వరం నెం.4 అంగన్వాడి సెంటర్ లో కిషోర్ వికాసం సమ్మర్ స్పెషల్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ ఈ సమ్మర్ సెషన్ యొక్క ఉద్దేశం ప్రతి అంగన్వాడి సెంటర్ పరిధిలో ఉన్న 11 నుండి 18 సంవత్సరాల కిశోర బాల, ( యువ ),బాలికలను( సఖి ) గ్రూపులుగా చేసి, వీరికి మే ఒకటో తేదీ నుండి జూన్ తొమ్మిదో తేదీ వరకు 12 సెషన్స్ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సెషన్స్ యొక్క ఉద్దేశం వేసవి సెలవుల్లో 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు బాల,బాలికలను గ్రూప్స్ గా ఏర్పాటు చేసి, 12 సెషన్స్ లో బోధన జరుగుతుందని చెప్పారు. ఇందులో భాగంగానే రెడ్డి గణపవరం 4వ నెం. అంగన్వాడి సెంటర్ లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. మొదటి సెషన్ లో బాలురు, బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం, అలాగే ఈ గ్రూపు యొక్క లక్ష్యాలు గురించి మాట్లాడుకోవడం జరుగుతుందని చెప్పారు. తర్వాత 11 సెషన్స్ లో ప్రతి ఒక్కరూ వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడం. స్వీయ అవగాహన, రక్తహీనత, ఆరోగ్య సమస్యలపై చర్చలు నిర్వహిస్తామని చెప్పారు. గ్రామంలో పాఠశాలలో లేదా సమాజంలో పిల్లలు ఎదుర్కొనే వ్యక్తిగత, సమూహ అవసరాలు, సవాళ్లు అర్థం చేసుకునే సెషన్స్, హెచ్ఐవి గురించి అవగాహన, వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, చట్టాలపై అవగాహన వాటి యొక్క ప్రాముఖ్యత, బ్యాంకు ఖాతా పొదుపు మరియు సేవింగ్ అలవాట్లు,శారీరక వ్యాయామం ప్రాముఖ్యత క్రీడలు ఆటలు, మరియు యోగా ప్రాముఖ్యత, విద్య మరియు కెరీర్, మార్గదర్శకత్వం మరియు నైపుణ్యాల అభివృద్ధి,సైబర్ భద్రత మరియు ఆన్లైన్ భద్రత అవగాహన, పొగాకు మద్యం డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, బాల్యవివాహాల నిరోధం బాలికల భద్రత విద్యా ప్రోత్సహం మరియు గ్రామస్థాయి నిర్ణయాలు.. ఈ అంశాల పట్ల ఈ 12 సెషన్స్ లో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించబడతాయని వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ అంశాలన్నిటిని గురించి పూర్తిగా అవగాహన కల్పించుకుని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని ఉప యోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ ఝాన్సీ, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలురు (యువ) కిశోర బాలికలు (సఖి) హాజరైనారు.

## యోగాసనాలతో ఏకాగ్రత, మానసిక ప్రశాంతత పెంపు

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



యోగాసనాల ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత, మానసిక ప్రశాంతత పెంపొందుతాయని గ్రంథాలయ అధికారి కుమార్ తెలిపారు. ఆగిరిపల్లి శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులలో భాగంగా శనివారం విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా రీడింగ్ క్లాసులు నిర్వహించి, పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించడంతో పాటు వాటిలోని సారాంశాన్ని విద్యార్థులతో చెప్పించారు. అనంతరం విద్యార్థుల శారీరక దృఢత్వం కోసం యోగా తరగతులు నిర్వహించి వివిధ యోగాసనాలు చేయించారు. యోగాసనాల వల్ల ఏకాగ్రతతో పాటు మానసిక ప్రశాంతత కూడా పెరుగుతుందని వివరించారు. విద్యార్థుల్లో సమన్వయ నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి లెమన్ అండ్ స్పూన్ ఆటలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని కుమార్ తెలిపారు.

ఆర్ ఎం సి లో సెక్యూరిటీ గార్డ్స్‌కు

# పనివేళల పెంపును విరమించి యధావిధిగా అమలు చేయాలి

## నోడల్ అధికారి సెక్యూరిటీ గార్డ్స్‌పై కక్ష సాధింపు మానుకోవాలి

ప్రజాభూమి ప్రతినిధి – కాకినాడ





ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ సెక్యూరిటీ గార్డ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆర్.ఎంసి కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ప్రిన్సిపల్ కార్యాలయం ఎదుట సెక్యూరిటీ గార్డ్స్ విధులు పెంపుదల విరమించుకోవాలని, యధావిధిగా విధులను అమలు చేయాలని నిరసనలు చేయడం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా కార్మికులకు మేలు చేయకుండా కీడు చేసే విధంగా రంగరాయ మెడికల్ కాలేజీల్లో సెక్యూరిటీ గార్డ్స్ గా పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, మరియు ఆర్.ఎంసి నోడల్ అధికారి పని విధులు పెంచి పని చేయాలని, ఉదయం 7 గంటలకు నుండి డ్యూటీ చేస్తుంటే 6 గంటలకే రావాలని ఆదేశాలిస్తూ కార్మికులను కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందిస్తున్న సందర్భాల్లో ఇన్ని సంవత్సరాలుగా సెక్యూరిటీ గార్డ్స్ కు పనివేళలో మార్పు చేయలేదని, సెక్యూరిటీ గార్డ్స్ ను కేవలం కక్ష సాధింపు చర్యగానే చేస్తున్నారని,పని వేళల్లో మార్పులు తక్షణమే విరమించుకోవాలని, లేదంటే సెక్యూరిటీ గార్డ్స్ ఆధ్వర్యంలో నిరసనలు తెలియజేస్తామని ఆయన అన్నారు. నోడల్ అధికారి , కాంట్రాక్టర్ కి మధ్య సెక్యూరిటీ గార్డ్స్ ను ఇబ్బంది పెట్టేందుకు రెండు నెలలు బకాయి జీతాలు నిలుపుదల చేశారని, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ గారిని బకాయి జీతాలు విషయమే సంప్రదించగా కాంట్రాక్టర్ తో మాట్లాడి బకాయి జీతాలు వేయించారని, జీతాలు వేయించినందుకు ప్రిన్సిపాల్ కు ధన్యవాదాలు తెలియజేశారు. కానీ సెక్యూరిటీ గార్డ్స్ కాంట్రాక్టర్ కి నోడల్ అధికారి మధ్య ఏ విభేదాలు ఉన్నాయో గాని కార్మికులను కక్ష సాధింపుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కార్మికులను ఇబ్బందులు గురిచేస్తే కార్మిక సంఘాలుగా ఉద్యమాలు చేపడతామని, కొన్ని విధులలో మార్పును తక్షణమే విరమించుకుని యధావిధిగా విధులను అమలు చేయాలని ఆయన అన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ పని విధుల్లో మార్పు విషయంపై మాట్లాడగా ఈ విషయంపై నోడల్ అధికారిని సంప్రదించాలని ఆయన బదులు చెప్పారని, సోమవారం లోపు పని వేళల్లో మార్పు చేయకపోతే నిరసనలు ప్రారంభిస్తామని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లాడి లక్ష్మీ, ఆనందరావు, దేవి, భారతి, సునీల్, సత్తిబాబు, శ్రీదేవి, సత్యవేణి, పార్వతి, సత్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్యార్థులు, యువత బంగారు భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం అండ

ప్రజా భూమి ప్రతినిధి–పెదవేగి



పెదవేగి మండలం విజయరాయి జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన పదో తరగతి టాపర్లను శాలువాలతో సత్కరించి అభినందించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ ప్రక్షాళన – మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పెరిగిన విద్యా ప్రమాణాలు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందిఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో దెందులూరు నియోజకవర్గం లోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలు నియోజకవర్గానికి గర్వకారణమని దెందులూరు శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్ కొనియాడారు. శనివారం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పలువురు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “సాధారణ మధ్యతరగతి, పేద కుటుంబాల నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా చిన్నారులు మార్కులు సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. “ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాల వల్లే నేడు ప్రభుత్వ విద్యార్థులు ఇంతటి ఘనవిజయాలు సాధిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు, యువతకు బంగారు భవిష్యత్తును అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలియజేశారు.

# వాట్సాప్ వేదికగా వైద్య సేవలు: ఏపీ ప్రభుత్వ సరికొత్త అడుగు.

- మనమిత్ర సేవలను అందుబాటులోకి తెచ్చిన ఏపీ ప్రభుత్వం
- డిజిటల్ సేవల విస్తరణలో భాగంగా కీలక నిర్ణయం
- వాట్సాప్ ద్వారా వైద్య సేవలను, సమాచారాన్ని సులభంగా పొందే అవకాశం

ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా.

ప్రజలకు, వైద్యులకు ఆరోగ్య సేవలను మరింత సులభతరం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. డిజిటల్ సేవల విస్తరణలో భాగంగా... ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ( ఏఎంసి) సేవలను 'మనమిత్ర' వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తెచ్చింది. ఇకపై ప్రజలు మరియు వైద్యులు తమ మొబైల్ నుంచి 9552300009 వాట్సాప్ నంబర్‌కు “హాయ్” ఇంగ్లీషులో మెసేజ్ పంపి.. తదనంతరం వచ్చే మెనూలో 'ఆరోగ్య శాఖ' ఆప్షన్‌ను ఎంచుకుని ఈ సేవలను సులభంగా పొందవచ్చు. ఈ సరికొత్త విధానం ద్వారా వైద్యులు తమ రిజిస్ట్రేషన్ వివరాలు, దరఖాస్తుల స్థితిగతులు, రాబోయే సీఎమ్ఈ (సీఎంఈ) కార్యక్రమాలు, క్రెడిట్ పాయింట్ల సమాచారాన్ని అరచేతిలోనే తెలుసుకోవచ్చు. అలాగే, సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ఓపీ సేవలు, బ్లడ్ బ్యాంక్ లలో రక్త లభ్యతతో పాటు ఆసుపత్రులలో మందులు, శస్త్రచికిత్సకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉందో లేదో ఇట్టే ఆరా తీయవచ్చు. వైద్యులకు, రోగులకు ఒకే వేదికపై అత్యవసర సమాచారాన్ని అందిస్తూ, పౌరసేవలను మరింత చేరువ చేసే దిశగా ఏపీ ప్రభుత్వం వేసిన ఈ అడుగు పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## ముగ్గురు పాలకొల్లు ప్రముఖులకు దాసరి లెజెండరీ ఫిలిం అవార్డ్స్ 2026 ప్రధానం



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

హైదరాబాద్ ప్రసాద్ ఫిలిం ల్యాబ్ నందు ఘనంగా దాసరి లెజెండరీ ఫిలిం అవార్డ్స్ 2026 కార్యక్రమం నిర్వహించారు., ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామ్ సత్యనారాయణ వారి మిత్ర బృందం సారధ్యంలో అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. సాంస్కృతిక, జర్నలిజం, నాటక సినీ, ఇతర రంగాల్లో సేవలు అందిస్తున్న వారిని గుర్తించి ఈ అవార్డు అందజేశారు. దీనిలో భాగంగా పాలకొల్లు కు చెందిన కళాకారుడు సీనియర్ జర్నలిస్ట్ నటుడు మండెల అప్పలరాజు కు, ప్రజల కు పలు సేవా కార్యక్రమాలు అందిస్తున్న కళానాధ బట్ల సుధీర్ కుమార్, చావాకుల సురేష్ బాబు లకు ప్రముఖ దర్శకులు బోయపాటి శ్రీను చేతుల మీదుగా అందజేశారు., ఈ కార్యక్ర మంలో సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, తమ్మారెడ్డి భరద్వాజ, ప్రముఖ హీరోలు మురళీ మోహన్, సుమన్, దర్శకుడు గుణశేఖర్, వి ఎన్ ఆదిత్య, సినీనటి రోజారమణి, హీరోయిన్ లయ, ప్రముఖ నిర్మాత కొణిదెల సుస్మిత, గారపాటి సాహు, ఇంకా అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు.



# వైసీపీకి.. ఒక్క ఓటు వేసిన శాపమే

## రూ. 7.60 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి నిమ్మల



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

అభివృద్ధిలో పాలకొల్లు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేలా పెద్ద ఎత్తున కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చేందుకు కష్టపడి పనిచేస్తున్నానని భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగిన ఏకగ్రీవంగా కూటమి అభ్యర్థులకు వేసే ఓటే కూలి అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. గొడ్డలి పార్టీ వైసీపీకి ఒక్క ఓటు వేసిన శాపంగా మారుతుందని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. యలమంచిలి మండలం పెనుమర్రు, కట్టుపాలెం, శిరగారపల్లి, వడ్డీలంక, గంగడపాలెం, మట్లపాలెం గ్రామాల్లో మొత్తం 10 అభివృద్ధి పనులకు రూ. 7.60 కోట్లతో కూటమి నాయకులతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ముఖ్యంగా మహిళలు స్వాగతం పలికారు. తీన్మార్ డప్పులతో సందడి చేసి బాణాసంచా కాల్చారు. మంత్రి నిమ్మలపై పూల వర్షం కురిపించారు. అన్ని కార్యక్రమాల్లో మోటార్ సైకిల్ పై పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని, మళ్లీ ఓటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని వివరిస్తూ గత వైసిపి ఐదేళ్లలో అభివృద్ధి సున్నా అని తెలిపారు. పనిచేసే ప్రభుత్వాన్ని, నాయకుడ్ని ఆశీర్వదించాలి గాని ఏ పని చేయని వైసీపీకి ఓట్లు వేయడం దండగని, వేసిన వారు ఎందుకు వేసామోనని ఆలోచన చేయాలన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించడంతోపాటు మంత్రిగా అవకాశం కల్పించిన ప్రజల రుణం తీర్చుకునేలా ప్రభుత్వ నిధులే కాకుండా వివిధ సంస్థలు దాతల నుంచి సిఎస్ఆర్ నిధులను సేకరించి అభివృద్ధికి ఉపయోగిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఎటువంటి అభివృద్ధి చేయకుండా హింసను ప్రేరేపించే అడపాదడపా వచ్చే గొడ్డలి పార్టీ నాయకులు మాటలు నమ్మితే నష్టపోవాల్సిందేనన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసి 14 లక్షల కోట్లు అప్పు భారం పడిందన్నారు. ప్రతి మనిషికి లెక్కిస్తే రెండు లక్షల 40 వేలు భారం పడిందన్నారు. ఈ కార్యక్రమంలో పెన్మెత్స రాంభద్రరాజు,యు కబర్ది,సొసైటీ అధ్యక్షులు బోనం శ్రీరామ కృష్ణ, చిలుకూరి భాలాజీ, రుద్ర రాజు సత్యనారాయణ రాజు, దేగల సత్యనారాయణ,మామిడి శెట్టి పెద్దిరాజు, కడలి గోపి,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధిలో అధికారుల పనితీరు ప్రతిబింబించాలి

## స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులతో ఎమ్మెల్యే సుదీర్ఘ సమావేశం



ప్రజాభూమి ప్రతినిధి–దెందులూరు

దెందులూరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని, ఆ దిశగా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ఆదేశించారు. శనివారం దెందులూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ (డి ఆర్ డి ఏ పిడి )విజయలక్ష్మి , నియోజకవర్గ కూటమి నాయకులు, నియోజకవర్గ పరిధిలోని ఇతర స్పెషల్ ఆఫీసర్లు మరియు పంచాయతీ కార్యదర్శులతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా మార్చడానికి అంకితభావంతో చర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రత్యామ్నాయ మార్గాలను ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అత్యంత ముఖ్యమని, చెత్త సేకరణ మరియు డ్రైనేజీల క్లీనింగ్ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. “ప్రతి స్పెషల్ ఆఫీసర్ తనదైన మార్కు కనిపించే విధంగా పని చేయాలి. గ్రామాల్లోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి మెరుగైన సలహాలు, సూచనలు రూపొందించి అమలు చేయాలి” అని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన మరియు అభివృద్ధి పనుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడానికి అధికారులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో దెందులూరు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గారపాటి రామసీత, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ డిఆర్డిఏ పిడి విజయలక్ష్మి, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బొప్పన సుధా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్, పెదవేగి సొసైటీ చైర్మన్ తాత సత్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షులు మోత్కూరి నాని, సహా పలువురు మండల పార్టీల అధ్యక్షులు , క్లస్టర్ ఇంచార్జి లు, సొసైటీల చైర్మన్లు, వివిధ హోదాల్లోని కూటమి నాయకులు, నియోజకవర్గ స్థాయి అధికారు లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది,ఎంపీడీవోలు, పంచాయతీల స్పెషల్ ఆఫీ సర్లు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలు - 2027.. విస్తృత సమీక్షలు

- క్షేత్రస్థాయి పరిశీలనలతో ఏర్పాట్ల వేగవంతం అధికారుల పర్యటన
- ఎస్డిసి ఏ మహేష్

**ప్రజా భూమి ప్రతినిధి - రాజమహేంద్రవరం**
గత వారం రోజులుగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గోదావరి పుష్కరాలు--2027 ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో విస్తృత స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తూ, శాఖల వారీగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించడం జరిగిందని, క్షేత్ర స్థాయిలో పరిశీలనలు నిర్వహించి, వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదికలను సమర్పించాలని కూడా అధికారులను దిశా నిర్దేశం చేసినట్లు పుష్కరాల సహాయక ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డా. ఏ. మహేష్ తెలిపారు. శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించిన ఆయన, ముందుగా స్థానిక పుష్కర్ ఘాట్ వద్ద అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పుష్కర్ ఘాట్ , గౌతమి ఘాట్ , సరస్వతి ఘాట్, తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో గోదావరి పుష్కరాలు-2027ను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలను వేగవంతం చేసిందన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డా. ఏ. మహేష్ ఆధ్వర్యంలో ట్రాఫిక్, పోలీస్, ఆర్టీఓ, ఏపీఎస్ఆర్టీసీ, ఇరిగేషన్, ఫిషరీస్, ఆర్ఎంసీ, రెవెన్యూ, మెడికల్, పీఆర్, ఆర్డీ, శానిటేషన్, ఆర్డబ్ల్యూఎస్, ఎలక్ట్రికల్ తదితర శాఖల



అధికారులకు శాఖల వారీగా అవసరమైన సూచనలు తెలియ చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు మరియు రవాణా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేసిన విషయం అధికారులకు తెలిపారు. ఘాట్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను నిరంతరం నిర్వహించడం, అత్యవసర సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచడం, ప్రమాద నివారణ చర్యలను ముందుగానే చేపట్టడం వంటి అంశాలపై శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని డా. ఏ. మహేష్ పేర్కొన్నారు. అలాగే పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖ ముందస్తు ప్రణాళికతో పని చేయాలని సూచించారు. అన్ని శాఖలు సమిష్టిగా పని చేసి గోదావరి పుష్కరాలు - 2027ను విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భన కార్యక్రమంలో ఏపీ ఈపిడిసిఎల్ ఎస్.ఈ కె. తిలక్ కుమార్, ఎంవిఐ సిహెచ్. సంపత్ కుమార్, డీఈఎన్ శ్యామిల్ ఆనంద్, ఆర్ఎంసీ మేనేజర్ అబ్దుల్ మాలిక్, డీఈ లోవరాజు పాల్గొన్నారు.

## వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావుకు దాసరి లెజెండరీ అవార్డ్



**ప్రజాభూమి ప్రతినిధి - పాలకొల్లు**
గత పది సంవత్సరాలుగా వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షునిగా బహుముఖంగా లక్షల రూపాయిల విలువైన సమాజక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తటవర్తి సుధాకరరావుకు ఆయన సేవలను గుర్తించి హైదరాబాద్ ప్రసాద్ లాబ్స్ ఆడిటోరియం లో శుక్రవారం సాయంత్రం సినీ ప్రముఖుల సమక్షంలో దాసరి లెజెండరీ సేవా అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సినీ హీరో సుమన్, ప్రఖ్యాత సినీ దర్శకుడు బోయపాటి శ్రీను చేతుల మీదుగా అందించారు అని తటవర్తి తెలిపారు.కార్యక్రమంలో సినీ నటులు మురళీ మోహన్, లయ, దర్శకుడు వి. ఎన్ ఆదిత్య, తుమ్మలపల్లి రామ సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తటవర్తి సుధాకరరావు ను రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు మరియు క్లబ్ సభ్యులు అభినందించారు.

## స్నేహితుని జ్ఞాపకార్థం క్రికెట్ కిట్లు పంపిణీ



**ప్రజాభూమి ప్రతినిధి - వేలేరుపాడు**
తన ప్రాణ స్నేహితుడు గాదే అనిల్ కుమార్ జ్ఞాపకార్థం రాయల రవికుమార్ శనివారం రుద్రంకోట యూత్ కి క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. తన స్నేహితుడు గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందటం జరిగిందని అతని జ్ఞాపకార్థం అదే గ్రామం రుద్రంకోర్టులోని యూత్ కి తన వంతుగా క్రికెట్ కిట్లను పంపిణీ చేయడం జరిగిందని రాయల రవికుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కిట్లు సైతం అనిల్ కుమార్ తండ్రి రవిబాబు చేతులమీదుగా యువతకు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు.

## కుంజా నోక్షిత ప్రతిభకు ప్రశంసలు అభినందించిన చింతూరు ఐటీడీఏ పీవో శుభమ్ నోఖ్వాల్



**ప్రజాభూమి ప్రతినిధి - ఏటపాక**
ఇటీవల విడుదలైన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన ఏటపాక మండలం గన్నవరం గ్రామానికి చెందిన కుంజా శ్రీనివాస రావు సమ్మక్క దంపతుల కుమార్తె అయిన కుంజా నోక్షితను చింతూరు ఐ.టి.డి.ఎ ప్రాజెక్ట్ అధికారి శుభమ్ నోఖ్వాల్ ప్రత్యేకంగా అభినందించారు. గవర్నమెంట్ స్కూల్ లో చదివి ఈ ఘనత సాధించడం రాష్ట్రానికే గర్వకారణం అని చిన్నారిని శాలువాతో సత్కరించారు, ఈ కార్యక్రమంలో మడివి నెహ్రూ , నూప పవన్ కళ్యాణ్ , తల్లి దండ్రులు పాల్గొన్నారు

# పెండింగ్ ఉపాధి కూలీల డబ్బులు తక్షణమే చెల్లించాలి

- 30% సమ్మర్ అలవెన్స్ చెల్లించాలి
- రెండు పూటల పేస్ యాప్ రద్దు చేయాలి
- ప్లే స్లిప్పులు ఇచ్చే విధానం అమలు చేయాలి
- పని ప్రదేశాల లో కూలీలకు మజ్జిగ, మంచినీరు, టెంట్లు ఏర్పాటు చేసి, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలి
- పెరుగుతున్న ధరలు కనుగుణంగా ఉపాధి కార్మికుడికి రోజు కూలి 600 రూపాయలు పెంచాలి
- లేట్ పేమెంట్ చేసేటప్పుడు వడ్డీతో కలిపి ఇవ్వాలి


**ప్రజాభూమి ప్రతినిధి - కూనవరం**
ఉపాధి కూలీలను ఉద్దేశించి సిఐటియు



మండల కన్వీనర్ పాయం సీతారామయ్య మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గత ఉపాధి హామీ పథకాన్ని మార్చటం కారణంగా కూలీలకు కనీస వసతి సౌకర్యాలు కల్పించటం లేదని అన్నారు. రోజు రోజుకు నిత్యావసర సరుకులు ధరలు పెరుగుతున్న ఉపాధికూలీలకు డబ్బులు ప్రభుత్వాలు పెంచడం లేదని విమర్శించారు. నెలలు తరబడి కూలి డబ్బులు ఇవ్వకపోవడం వల్ల చేసిన పనిదినాలు మొత్తం డబ్బులు వస్తాయని నమ్మకం లేదని కూలీల అవేదన చెందుతున్నారు అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ కూలీ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోడే. శ్రీరాములు నారాయణ, వెంకటేష్, చిచ్చడి సరిత, రాజ్యలక్ష్మి, వీరయ్య, పాయం. భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు...

# చేసిన పనికి డబ్బులు సకాలంలో రాక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు

**ప్రజాభూమి ప్రతినిధి - వి.ఆర్.పురం.**
నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో, కనీస వేతనం పెంపు లేకపోగా చేసిన పనికి డబ్బులు సకాలంలో రాక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ నిలిచిపోయిన ఉపాధి కూలీ డబ్బులను తక్షణమే పూర్తిస్థాయిలో చెల్లించాలనీ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారీ వేతనాన్ని రూ.



600లకు పెంచాలనీ, ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలకు 30% సమ్మర్ అలవెన్స్ వెంటనే అందించాలనీ, పని ప్రదేశాల్లో సాంకేతిక ఇబ్బందులకు కారణమవుతున్న 'రెండు పూటల పేస్ యాప్' విధానాన్ని వెంటనే రద్దు చేయాలనీ, కూలీలకు పనికి సంబంధించిన 'పే స్లిప్పులు' ఇచ్చే విధానాన్ని పక్కాగా అమలు చేయాలనీ, పని ప్రదేశాల్లో మజ్జిగ, మంచినీరు, టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలనీ, వేతనాల చెల్లింపులో జాప్యం జరిగితే, అపరాధ రుసుముతో (వడ్డీతో) కలిపి చెల్లించాలనీ, ఈ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే, రాబోయే రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని అన్నారు.

# పది పరీక్షా ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు

**ప్రజాభూమి ప్రతినిధి - వి.ఆర్.పురం.**
మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం రేఖపల్లి టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ విద్యాశాఖ మంత్రి వర్యులకు విఆర్‌పురం మండల తెలుగుదేశం పార్టీ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొర్ర. నరేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాయం రామారావు, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, ఎంపీటీసీ వాళ్ళ వెంకటేశ్వర రెడ్డి, వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్యప్రకాశరావు, శ్రీరామగిరి ఆలయ చైర్మన్. పెందుర్తి సుదర్శన్ రావు, వడ్డీ గూడెం శివాలయం చైర్మన్ బొర్రా. ఆదినారాయణ, ఎస్ టి సెల్ రాష్ట్ర కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షులు. కోట్ల శ్రీనివాస్, గ్రామశాఖ కార్యదర్శి బొర్రా.సూరి ఎస్సీ సెల్ అధ్యక్షులు. అల్లాడి అచ్చిరాజు, మైనారిటీ



సెల్ అధ్యక్షులు పులి సాహెబ్, సీనియర్ నాయకులు కోట్ల బాలయ్య, జెడ్ పి పి ఎస్ హై స్కూల్ చైర్మన్. ముత్యాల శంకర్ రావు, బూత్ కన్వీనర్. ఈర్ల శ్రీను పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ సత్కారం

**ప్రజాభూమి ప్రతినిధి - వి.ఆర్.పురం.**
పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఘనంగా



సత్కరించారు. శనివారం రంపచోడవరంలో జరిగిన కార్యక్రమంలో సోములగూడెం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన పంతాల శరణ్య ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల విభాగంలో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించి, సోములగూడెం పాఠశాలకు మరియు జిల్లాకు శరణ్య మంచి పేరు తీసుకువచ్చిందని కలెక్టర్ కొనియాడారు. ఈ సందర్భంగా ఆమెకు మెమెంటో అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు పండా సునీత చేసిన కృషి , ప్రోత్సాహన్నీ అభినందిస్తూ సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నత నం నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశిం చుకోవాలని, వాటిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని ఆకాంక్షించారు. గిరిజన ప్రాంత విద్యార్థులు చదువులో రాణించడం గర్వకారణ మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు పండా సునీత, శరణ్య తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎస్పీ నక్క సూర్యచంద్రరావుకి ఘన సన్మానం

**ప్రజాభూమి - ఏలూరు**
స్నేహానికి ప్రాధాన్యతతో పాటు మానవతా విలువలు కలిగిన నాయకులు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అని సీనియర్ పోలీస్ అధికారి, రిటైర్డ్ ఎస్పీ నక్కా సూర్య చంద్రరావు ప్రశంసించారు.ఏలూరులో



నిర్వహించిన నక్కా సూర్యచంద్రరావు పదవీ విరమణ అభినందన సభలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన చింతమనేని ప్రభాకర్, సుదీర్ఘకాలం పోలీస్ అధికారిగా సేవలందించిన సూర్యచంద్రరావు అనుభవం, జ్ఞానం రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు.అలాగే, ఆయన పదవీ విరమణ అనంతరం జీవితాన్ని ఆనందంగా గడపాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమం ముగింపులో రిటైర్డ్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు దంపతులను శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అభినందనలు తెలిపారు.

## పాపికొండ వన్యప్రాణి సంరక్షణకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించి సమర్పించాలి : కలెక్టర్ కె.వెట్రి సెల్వి



**ప్రజాభూమి ప్రతినిధి - ఏలూరు జిల్లా**
పోలవరం ప్రాజెక్ట్ పరిధిలోని పాపికొండ వన్యప్రాణి సంరక్షణా ప్రాంతంలోని 21 గ్రామాలకు సంబంధించిన సర్వే పనులను ఆ గ్రామాలలోని నిర్వాసితులకు పునరావాస ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ శనివారం రాష్ట్ర సచివాలయం నుండి ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లు, పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్, రాష్ట్ర ఆర్ అండ్ ఆర్ కమిషనర్లతో రాష్ట్ర సచివాలయం నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ పాపికొండ వన్యప్రాణి సంరక్షణా ప్రాంతంలోని 21 గ్రామాలకు సంబంధించిన సర్వే పనులను ఆ గ్రామాలలోని నిర్వాసితులకు పునరావాస ప్రణాళికను రూపొందించి వెంటనే సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను సీఎస్ సాయిప్రసాద్ ఆదేశించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత: ఎమ్మెల్యే బడేటి చంటి

**ప్రజాభూమి - ఏలూరు**
అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను సమాంతరంగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ప్రజా సమస్యల



పరిష్కారాన్ని ప్రాధాన్యతాక్రమంలో తీసుకుని పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను సవివరంగా తెలుసుకుని, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవ్యాంధ్రను అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కృషి చేస్తున్నారని చెప్పారు. అదే లక్ష్యంతో తాను కూడా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాణిజ్య సిలిండర్ ధర తగ్గించాలి : సిపిఐ డిమాండ్



**ప్రజాభూమి - ఏలూరు**
కేంద్ర ప్రభుత్వం పెంచిన వాణిజ్య సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దేగా ప్రభాకర్ మాట్లాడుతూ, వాణిజ్య సిలిండర్ ధరను భారీగా పెంచడం పేద, మధ్యతరగతి ప్రజలపై భారంగా మారిందని విమర్శించారు. ఇప్పటికే పలుమార్లు ధరలు పెంచడం వల్ల హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత హక్కుల పోరాట సమితి నాయకుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సిపిఐ నాయకులు ఉప్పులూరి హేమ శంకర్ తదితరులు కూడా ధరల పెరుగుదలను ఖండిస్తూ, వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సిపిఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారులు, ఆర్.వో.బీ, ఆర్.యు.పీ ల భూసేకరణలోని అడ్డంకులు తొలగించాలి

- జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచాలి
- అధికారులతో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి - కాకినాడ
జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు(ఆర్.వో.బీ), రైల్వే అండర్ పాస్ (ఆర్.యూ.పీ)ల నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి భూసేకరణలోని అడ్డంకులు తొలగించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా పరిధిలోని జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ పాస్ లకు అవసరమైన భూ సేకరణ పనులు పురోగతిపై శనివారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరెంధిర ప్రసాద్.. జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి రెవెన్యూ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ అధికారులతో జిల్లా కలెక్టర్.. సమీక్ష నిర్వహించారు. వివిధ మండలాల తహశీల్దార్లు, ఎన్.హెచ్ఏఐ, రైల్వే అధికారు ఈ సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. భూ సేకరణలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అధికారులతో విస్తృత చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి కీలకమైన జాతీయ రహదారులు, రైల్వే మౌలిక వసతుల నిమిత్తం చేపట్టిన పనులకు సంబంధించిన భూ సేకరణలోని అడ్డంకులను తొలగించాలన్నారు. ప్రతి ప్రాజెక్టు వారీగా పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ అంశాలపై, భూ యజమానులతో మాట్లాడి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. భారత్ మాల (వాకలపూడి నుంచి అన్నవరం), రైల్వే గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్ట్ (కేజీపీఎల్ నుంచి అన్నవరం) వరకు చేపట్టనున్న పనులకు సంబంధించి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పనులపై సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించి, నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో



కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, ఎన్.శ్రీధర్, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణి, ఆర్ అండ్ బి ఎస్ఈ జీ.కార్తు, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎవీఎస్ శ్రీనివాసరావు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

ఆదివారం 03 మే 2026


# నీట్ పరీక్షకు సర్వం సిద్ధం..

- ఈనెల 3వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నీట్ పరీక్ష..
- పరీక్ష కేంద్రంలోకి మధ్యాహ్నం 01:30 గంటలలోపు చేరుకోవాలి.. అనంతరం పరీక్ష కేంద్రంలోకి ఎవరిని అనుమతించడం జరగదు..
- జిల్లాలో 08 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు.. హాజరుకానున్న 3,616 మంది అభ్యర్థులు..
- అభ్యర్థులు ఈ-అడ్మిట్ కార్డ్ తో పాటు ప్రభుత్వంచే గుర్తింపబడిన ఏదో ఒక గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరు

**కావాలి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం జిల్లాలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, న్యూఢిల్లీ వారు ఈనెల 03వ తేదీన నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ ఫర్ అండర్ గ్రాడ్యుయేషన్ (యుజి) పరీక్షలకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసే సర్వం సిద్ధం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఈనెల 3వ తేదీన ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నీట్ పరీక్షలను నిర్వహించడం జరుగుతోందని, జిల్లాలో 08 పరీక్షా కేంద్రాలలో నిర్వహించబడుతుందని, అందులో అనంతపురములో 6, గుత్తిలో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పరీక్షకు 3,616 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. ఈ పరీక్షకు జిల్లా యంత్రాంగం తరుపున జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోలని నోడల్ ఆఫీసర్ గా నియమించడం జరిగిందని తెలిపారు. నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి నిర్దేశించిన సమయంలోపు హాజరు కావాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి మధ్యాహ్నం 01:30 గంటలలోపు చేరుకోవాలని, అనంతరం పరీక్ష కేంద్రంలోకి



ఎవరిని అనుమతించడం జరగదన్నారు. అభ్యర్థులు ఈ-అడ్మిట్ కార్డ్ తో పాటు ప్రభుత్వంచే గుర్తింపబడిన ఏదో ఒక గుర్తింపు కార్డుతో ఒరిజినల్ పరీక్షకు హాజరు అవ్వాలన్నారు. ఈ పరీక్షకి మొబైల్ పోన్లు/ ఐ టీగాడ్జెట్లు/బ్లూ టూత్/ఏదైనా ఇతర కమ్యూనికేషన్ పరికరాలు పరీక్ష కేంద్రములోనికి అనుమతించబడవని గమనించాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలను సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక్కో కేంద్రానికి ఒక్కో తహసీల్దార్లను డ్యూటీ మేజిస్ట్రేట్ లుగా నియమించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ విభాగమైన నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ పరీక్ష అత్యంత కీలకమైనదని, ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ఈ పరీక్షను విజయవంతం చేయాలని, సజావుగా నిర్వహించాలని అన్ని రకాల చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

# గుప్త నిధుల వేటగాడు అరెస్టు

### -ద్విచక్ర వాహనంతో పాటు వస్తు సామాగ్రి స్వాధీనం -వివరాలు వెల్లడించిన డిఎస్పీ

ప్రజాభూమి, హిందూపురం టౌన్





చిలమత్తూరు మండలం ముచ్చలగుట్టలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతుండగా మంకు నాయుడు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు డిఎస్పీ కేవీ మహేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు గుప్తనిధుల త్రవ్వకాలపై ప్రత్యేకంగా ఉంచి మంకు నాయుడుని అరెస్టు చేయడం జరిగిందన్నారు. అనకాపల్లి జిల్లాకు చెందిన మంకునాయుడు అనే వ్యక్తి గత పది సంవత్సరాలుగా తిరుపతిలో నివాసం ఉంటున్నాడు. నెలరోజుల కిందట కొడికొండ చెక్ పోస్ట్ వద్ద ఒక గది అద్దెకి తీసుకొని గుప్తనిధుల కోసం అన్వేషణ చేస్తుండేవాడు. చిలమత్తూరు మండలం ముచ్చలగుట్టలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతుండగా స్థానికుల సమాచారంతో నిందితుని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టామన్నారు. నిందితుని వద్ద నుంచి రెండు డ్రిల్లింగ్ మిషన్లు, ఆరు బ్యాటరీలు, మూడు చార్జర్లు, ఒక పవర్ సప్లై బాక్స్, 25 జిలిటిన్ స్టిక్స్, ఏడు డ్రిల్లింగ్ బిట్స్, రెండు టార్చ్ లైట్లు, ఒక ఇనుప గడ్డపార, ద్విచక్ర వాహనం ఒక సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. నిందితునిపై తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ లో కూడా ఒక కేసు ఉందని, ప్రస్తుతం నిందితున్ని కోర్టుకు హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు. నిందితున్ని కస్టడీలోకి తీసుకొని ఎక్కడి నుంచి తీసుకువచ్చాడో విచారణ జరుపుతామన్నారు. గుప్త నిధులు ఉన్నాయని ఎవరైనా చెబితే ఇటువంటివి నమ్మి ప్రజలు మోసపోవద్దని, పోలీసుల కంటపడి సమాజంలో వెలివేయబడ్డ వారిగా మారద్దని సూచించారు. ఎక్కడైనా గుప్త నిధులు ఉన్నట్లు తెలిస్తే అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో సిఐ జనార్ధన్, ఎస్సైలు మునీర్ అహ్మద్, లింగన్న పాల్గొన్నారు.

# ముగిసిన జ్ఞన జ్యోతి డి ఆర్ పి ల శిక్షణా కార్యక్రమం

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



గత 6 రోజులుగా వివేకానంద జూనియర్ కళాశాలలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న జ్ఞనజ్యోతి డి ఆర్ పి శిక్షణా కార్యక్రమం దిగ్విజయంగా శనివారం ముగిసింది. ముగింపు సమావేశం కు ముఖ్య అతిథిలుగా సమగ్ర శిక్ష ఏ పి సి టి. శైలజ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ శశికళ విచ్చేసారు. ఈ సమావేశం



లో సమగ్ర శిక్ష ఏపీ సి శైలజ మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభ్యసనకు ప్రీ ప్రైమరీ స్థాయి చాలా ముఖ్యమైనదని అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ స్థాయి పిల్లలకు బోధించే టీచర్లు కూడా అత్యంత సమర్థవంతంగా ఉండవలసిన అవసరం ఉందని భావించిన ప్రభుత్వం వారికోసం అత్యద్భుతమైనటువంటి శిక్షణను ఏర్పాటు చేసిందని అలాంటి టీచర్లకు శిక్షణ ఇవ్వడానికి వచ్చిన డిఆర్పీలు అందరూ సమర్థవంతంగా శిక్షణ పొందారని తెలియచేశారు. కార్పొరేట్ పాఠశాలల లో ప్రీ ప్రైమరీ స్థాయిలో బోధించేటువంటి బోధనా పద్ధతులు ఇప్పుడు అంగన్వాడీల లో కూడా బోధించేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ శశికళ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో డిఆర్పి లకు అత్యంత ఉత్తమమైన శిక్షణను రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన కె ఆర్ పి ల ద్వారా ఇప్పించామని జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన డిఆర్పిలు అందరూ మండల స్థాయిలో అత్యుత్తమమైన శిక్షణను ఇచ్చి ప్రీ ప్రైమరీ స్థాయిలో పిల్లల అభ్యసనను మరింత పటిష్టం చేయడానికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతపురం సమగ్ర శిక్ష ఏ ఎం ఓ శ్రీ వేణుగోపాల్ సత్యసాయి జిల్లా సమగ్ర శిక్ష ఏ ఎం ఓ శ్రీ కె చంద్రశేఖర్, కె ఆర్ పి లు, డి.ఆర్ పి పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరిటెండెంట్ గా డాక్టర్ రాజగోపాల్


ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ గా సీనియర్ వైద్యులు రాజగోపాల్ ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం సూపరిటెండెంట్ గా రాజగోపాల్ బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన మెడికల్ సూపరింటెండెంట్ జనార్ధన్ ఇతని కన్నా జూనియర్ కావడంతో ఇతన్ని విధుల నుంచి తప్పించి, సీనియర్ వైద్యులు ఆయన రాజగోపాల్ ను నియమించారు. బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకొని ఆసుపత్రికి వచ్చే రోగులందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందే విధంగా చూస్తానన్నారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తానన్నారు. సూపరింటెండెంట్ గా బాధ్యతలు స్వీకరించిన రాజగోపాల్ ను వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# తప్పులు లేని, రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసిన జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి కలెక్టరేట్.



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాలలో 1వ తేదీ నుండి 8వ తేది వరకు నుండి వ తేది వరకు రైతులకు పాత భూహక్కు పత్రాల స్థానంలో రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. శనివారం ఓజిలి మండలం మానవాలీ గ్రామంలో తాసిల్దార్ మధుసూదన్ రాజు తో కలిసి రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే పూర్తి అయిన గ్రామాలలో ప్రతి నెల 01 నుండి 8 వ తేదీ వరకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. సర్వే నెంబర్, తండ్రి పేరు, ఇంటి పేరు, గ్రామం పేరు, ఫోటో, ఫోన్ నెంబర్ లేదా ఆధార నెంబర్ వంటి వివరాలు తప్పులు లేకుండా ఉండే విధంగా పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందించిన పట్టాదారు పాసుపుస్తకాలను భూ యజమానులు భద్రపరచుకోవాలని, భవిష్యత్తులో క్రయ, విక్రయాల సమయంలో ఇబ్బందులు తలెత్తవని సూచించారు. ఈ కార్యక్రమం లో వి ఆర్ ఓ లు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ముగిసిన శ్రీ పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు



ప్రజా భూమి ప్రతినిధి తిరుచానూరు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన వార్షిక వసంతోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. చివరి రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా శుక్రవారపు తోటకు వేంచేపు చేశారు. మధ్యాహ్నం 2.30 నుండి 4.30 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనె, చందనం, పలురకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం మహాపూర్ణాహుతితో వసంతోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీహరినాథ్, ఏఈవో దేవరాజులు, అర్చకుడు బాబుస్వామి, సూపరింటెండెంట్లు సురేష్, ముని చెంగల్రాయులు, రమేష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ చలపతి తదితరులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# తిరుమలలో ఆపరేషన్ వజ్రపహార్

### ప్రత్యేక నాఖాబందీ తనిఖీలు, 18 మంది అదుపులోకి

ప్రజాభూమి ప్రతినిధి తిరుమల



తిరుమలలో భద్రతా చర్యలను మరింత పటిష్ఠం చేయడానికి తిరుపతి జిల్లా పోలీస్ శాఖ శనివారం ఉదయం విస్తృత స్థాయిలో ప్రత్యేక నాఖాబందీ తనిఖీలు నిర్వహించింది. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి మురళీకృష్ణ పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టగా, తిరుమల అదనపు ఎస్పీ సూచనలతో డి.ఎస్.పి ప్రత్యక్ష ఆధ్వర్యంలో ఆపరేషన్ వజ్రపహార్ కొనసాగింది. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఆకాశగంగ, వేణుగోపాలస్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లోని షాపుల వద్ద ఈ తనిఖీలు జరిగాయి. పోలీస్ శాఖతో పాటు టీటీడీ విజిలెన్స్, అటవీ, ఫైర్, రెవెన్యూ, ఎక్సైజ్, ఆరోగ్య శాఖలు మరియు బాంబ్ డిస్పోజల్ బృందాలకు చెందిన సుమారు 45 మంది సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో భాగంగా మొత్తం 44 షాపులను పరిశీలించిన అధికారులు, సరైన గుర్తింపు కార్డులు లేని 18 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే గుర్తింపు లేని మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు 66 మంది వ్యక్తుల వేలిముద్రలను సేకరించి పరిశీలించారు. వాణిజ్య ప్రాంతాల్లో లైసెన్సులు, సిబ్బంది వివరాలు, సబ్‌లీజ్ అంశాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. గంజాయి, మద్యం, పొగాకు వంటి నిషేధిత పదార్థాల వినియోగంపై హెచ్చరికలు జారీ చేస్తూ, అపరిచితులకు షాపులు అద్దెకు ఇవ్వరాదని సూచించారు. కొత్తగా పనిలో చేరే వారి వివరాలను స్థానిక పోలీసులకు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతి షాపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా అత్యవసర సేవల కోసం 1972, 112 నంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# తూమకుంట పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమకుంట పంచాయతీలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పంచాయతీలోని వివిధ గ్రామాల్లో చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు మురికి కాలువలను శుభ్రం చేయించారు. మురికి కాలువల వద్ద దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇళ్లలో ఉత్పత్తి అయ్యే తడి, పొడి చెత్తలుగా విభజించి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. అలాగే చెత్తాచెదారాలను ఎట్టి పరిస్థితిలోనూ మురికి కాలువల్లో వేయవద్దని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పంచాయతీ ప్రత్యేక అధికారి దామోదరమ్మ తెలిపారు. ఆయా పనులను డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శివ కుమార్, గ్రామీణ రక్షిత నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ వేణు తదితరులు పర్యవేక్షించారు.

# వికలాంగుడికి మూడు చక్రాల సైకిల్ పంపిణీ

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మున్సిపల్ పరిధిలోని తొమ్మిదవ వార్డుకు చెందిన వికలాంగుడు మంజునాథ్ కు ఎమ్మెల్యే కార్యాలయం మూడు చక్రాల సైకిల్ అందజేసి మానవత్వం చాటుకుంది. మంజునాథ్ వికలాంగుడు కావడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు ఎమ్మెల్యే కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ ఈ మేరకు వికలాంగుడికి మూడు చక్రాల సైకిల్ అందజేశారు. మూడు చక్రాల సైకిల్ ఇవ్వడం పట్ల మంజునాథ్ తో పాటు ఆయన తల్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి దుర్గా నవీన్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి దుర్గా నాని తదితరులు పాల్గొన్నారు.

# పుట్లూరు మండల కేంద్రంలో ఉన్న హెచ్ ఎల్ సి బ్రిడ్జిని నిర్మించండి

### భారతీయ జనతా పార్టీ, శింగనమల నియోజకవర్గం కో కన్వీనర్ కుందు శ్రీనివాసులు రెడ్డి



ప్రజాభూమి, పుట్లూరు. పుట్లూరు మండల కేంద్రంలో అత్యంత రద్దీగా ఉండే హెచ్ ఎల్ సి కాలువ మీద ఉన్న బ్రిడ్జిని శింగనమల నియోజకవర్గం కో కన్వీనర్ కుందూ శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ నాయకులు పరిశీలించడం జరిగింది. ఈ బ్రిడ్జి మీద వాహనాలు ప్రయాణించడానికి ప్రమాదకరముగా ఉన్నది. ఈ బ్రిడ్జి రోడ్డులో కార్లు ,ట్రాక్టర్లు మలుపు తిరగడం కష్టంగా ఉంది ,స్కూల్ పిల్లల బస్సులు మరియు టిప్పర్లు, లారీలు మలుపు తిరగడానికి చాలా ఇబ్బంది కరంగా, ప్రమాదకరంగా మలుపు తిరగడం జరుగుతున్నది. ఈ బ్రిడ్జి రోడ్డులో మోడల్ స్కూల్, కస్తూర్బా స్కూల్, హైస్కూల్ పోయె పిల్లల బస్సులు తిరగడం మరియు ఈ దారిలో తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ , అగ్రికల్చర్ ల ఆఫీసులు ఉన్నాయి. ఇంత రద్దీ ఉన్న హెచ్ ఎల్ సి కాలువ మీద ఉన్న బ్రిడ్జి నీ స్కూళ్లు తెరిచేలోపు నిర్మాణము చేపట్టాలని స్థానిక ఎంఎల్ఏ బండారు శ్రావణి శ్రీ , హెచ్ ఎల్ సి అధికారులకు భారతీయ జనతా పార్టీ నాయకులు కోరడం జరుగుతున్నది. ఈ కార్యక్రమములో బిజెపి నాయకులు రామ్మోహన్, శ్రీనాథ్ యాదవ్, మధుసూధన్ రెడ్డి, ఉత్తం రెడ్డి, రాజశేఖర్ రెడ్డి , కార్యకర్తలు పాల్గొన్నారు.



# జాతీయ మెగా లోక్ అదాలత్ వాయిదా

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీన నిర్వహించాల్సిన జాతీయ మెగా లోక్ అదాలత్ వాయిదా పడినట్లు స్థానిక న్యాయాధికారులు తెలిపారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించే నిమిత్తం నిర్వహిస్తున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను తిరిగి జూలై 11వ తేదీన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

# బీఎస్పీ నాయకుడిని అడ్డుకున్న పోలీసులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఛలో ఆకివీడు కార్యక్రమానికి వెళుతున్న బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములును కదిరి పోలీసులు అడ్డుకున్నారు. అతన్ని అక్కడ నుండి పోలీస్ ఎస్కార్ట్ తో హిందూ పురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. కాగా చలో ఆకివీడు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని శ్రీరాములు ఆందోళన వ్యక్తం చేశారు. ఆకువీడులో దళితులకో న్యాయం, అధికారం ఉన్న వర్గాలకు ఓ న్యాయం అని, ఇది చాల దారుణమని బిఎస్పీ నాయకులు తీవ్రంగా ఖండించారు. బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు అడ్డగించి అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ నాయకులు చౌళూరు రామాంజనప్ప, శ్రీనివాసులు, చిరంజీవి, తిరుమలేష్, రవికుమార్ తదితరులు ఖండించారు.



ప్రజాభూమి

వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7

ఆదివారం 03 మే 2026


# మదనపల్లి బుద్ధ పున్నమి వేడుకలకు అనుమతి ఇవ్వని కలెక్టర్

## ఎస్సీ, ఎస్టీల ఆధ్యాత్మిక స్వేచ్ఛకు కలెక్టర్ భంగం కలిగించారన్న బాస్ అధినేత పిటియం శివప్రసాద్

### రోడ్డు ప్రక్కనే దీక్ష విరమించిన ఉపాసకులు



మదనపల్లి, ప్రజాభూమి ప్రతినిధి :- ఇరవై ఒక్క సంవత్సరాలుగా మదనపల్లెలో వైభవోపేతంగా నిర్వహిస్తూ వచ్చిన పవిత్ర బుద్ధ పున్నమి వేడుకలకు, ఈ ఏడాది జిల్లా కలెక్టర్ అనుమతి ఇవ్వకపోవడంతో బ్రేక్ పడిందని, మానవ వికాసం కోసం ఎంతో ఉపయుక్తంగా ఉండే పవిత్ర బుద్ధ పున్నమి వేడుకలకు అనుమతి నిరాకరించడం జిల్లా కలెక్టర్ కు ఎంతమాత్రం తగదని, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) జాతీయ కన్వీనర్ ఉపాసక పి.టి.యం. శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా జరుగుతున్నట్లే ఈ ఏడాది కూడా బుద్ధునికొండపై పవిత్ర బుద్ధ పున్నమి వేడుకలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్, ఎఎస్పీలను కలిసి దరఖాస్తు చేసుకున్నా, వారు పట్టించుకోలేదని, అనుమతి ఇస్తున్నామని గానీ, ఇవ్వడం లేదని గానీ చెప్పలేదని, తీరా నిన్న ఉదయం నుండి బుద్ధునికొండ వద్ద పోలీస్ సిబ్బందిని పెట్టి బుద్ధునికొండపైకి ఎవరూ వెళ్ళరాదని అడ్డుకున్నారని, రాజ్యాంగం ప్రసాధించిన ఎస్సీ, ఎస్టీల ఆధ్యాత్మిక స్వేచ్ఛకు భంగం కలిగించిన జిల్లా కలెక్టర్ మరియు ఎఎస్పీ చర్యల్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఏటా చైత్ర మాసంలో వచ్చే అష్టమి నుండి వైశాఖ బుద్ధ పున్నమి వరకూ బౌద్ధ ఉపాసకులు పంచశీల దీక్ష చేపట్టడం జరుగుతుందని, వీరంతా బుద్ధునికొండపై జరిగే పవిత్ర బుద్ధ పున్నమి వేడుకల్లో పాల్గొని, పూజలు నిర్వహించి, అక్కడే దీక్ష విరమిస్తారని, అయితే ఈ సంవత్సరం బుద్ధునికొండపైకి అనుమతి ఇవ్వకపోవడంతో బెంగళూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు ప్రక్కనే ఉపాసకులు దీక్ష విరమించడం జరిగిందని, బౌద్ధ ఉపాసకుల్ని ఇలా అవమానించడం కూటమి ప్రభుత్వానికి మంచిది కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం అన్నమయ్య జిల్లా పూర్వ ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ప్రస్తుత కలెక్టర్ నిశాంత్ కుమార్ ల నియంతృత్వ పోకడలకు అడ్డుకట్ట వేయాలని, లేకుంటే కూటమి ప్రభుత్వం పేద, మధ్యతరగతి వర్గాలకు వ్యతిరేకమన్న అపవాదు మూటకట్టుకోక తప్పదని హెచ్చరించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన పంచశీల దీక్ష విరమణ కార్యక్రమంలో బౌద్ధ ఉపాసకులు తెట్టు శ్రీనివాసులు, గంపల రమణ తదితరుల తోపాటు భారతీయ అంబేద్కర్ సేన నాయకులు నీరుగట్టి రమణ, ఎస్. రెడ్డెప్ప, తలారి కృష్ణ, బురుజు జనార్ధన్, వై. గంగాధర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగిసినవెంటనే పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలు

- కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపైన రేటు పెంచిన కేంద్ర ప్రభుత్వం...
- పన్నులు ప్రజల పైన మోపి సంపద కార్పోరేట్ వర్గానికి అప్పగిస్తున్న బిజెపి ప్రభుత్వం.....
- బిజెపి ఆర్థిక విధానాలు దేశ ప్రజానీకానికి ప్రమాదకరం.....
- మదనపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆందోళన....

మదనపల్లి, ప్రజాభూమి ప్రతినిధి



పెంచిన కమర్షియల్ గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఐ మదనపల్లి పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసిన సిపిఐ నాయకులు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి కృష్ణప్ప నియోజకవర్గ కార్యదర్శి కె మురళి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగిసిన వెంటనే కమర్షియల్ సిలిండర్లపైన 15 కేజీలు సిలిండర్ పైన 993 రూపాయలు 5 కేజీల సిలిండర్ పైన 600 రూపాయలు పెంచిందని అన్నారు. కమర్షియల్ సిలిండర్లపైన ధరలు పెంచడం వల్ల అది సామాన్య ప్రజల పైన భారం అవుతుందని కమర్షియల్ సిలిండర్లు రెస్టారెంట్లు, హోటల్స్,ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్ చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేటువంటి ప్రజలు ఎక్కువగా ఉపయోగిస్తారని, గ్యాస్ ధర పెరగడం వల్ల వీరందరూ కూడా ధరలు పెంచే అవకాశం ఉందని, ఈ ధరలు కారణంగా ప్రత్యక్షంగా పరోక్షంగా సామాన్య ప్రజల పైన ఆర్థిక భారం పడుతుందని అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు తర్వాత పెట్రోల్,డీజిల్ ధరలు కూడా పెంచడానికి రంగం సిద్ధం చేశారని,గత కొద్ది రోజులుగా పెట్రోల్,డీజిల్ కంపెనీలు ప్రభుత్వం రేట్లు పెంచుతాధని ఉద్దేశంతో పెట్రోల్ బంకు డీలర్లకు సరిగా సరఫరా అందించలేదని, పెట్రోల్,డీజిల్ నిల్వలు పెంచుతున్నారని,తన లాభాల దృష్టిలో ఉంచుకొని కుత్రిమ కొరత సృష్టిస్తున్నారని, ఇది ఎన్నికల ఫలితాల వెలువడిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతారని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టి హిందుత్వం పేరుతో రాజకీయ లబ్ధి పొందుతూ ప్రజా సంపదను కార్పొరేట్ వర్గానికి అప్పగిస్తుందన్నారు. బిజెపి ఆర్థిక విధానాలు దేశ సాధారణ ప్రజా నీకానికి ప్రమాదకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి హరికుమార్,సిపిఐ మదనపల్లి పట్టణ కార్యదర్శి మాధవ్ కుమార్,మండల కార్యదర్శి రెడ్డి శేఖర్, నియోజకవర్గం కార్యవర్గ సభ్యులు సూరి,దేవ మరియు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# మాధవరం చేనేత క్లస్టర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్





ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ, యస్. కె.ఆర్ నగర్ చేనేత క్లస్టర్ భవనాన్ని శనివారం కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సందర్శించి నేత కార్మికుల సమస్యలపై వినతులు స్వీకరించారు. క్లస్టర్‌లో ఫ్యాషన్ డిజైన్లు ఎలా తయారు చేస్తారని కలెక్టర్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఒరిజినల్ మగ్గాలపై వస్త్రాలు తయారు చేసి, డిజైన్లు రూపొందించి ఇక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీనికి అవసరమైన మిషన్లను తెప్పించి రెండు నెలల్లో ఫ్యాషన్ డిజైన్ల శిక్షణ ప్రారంభిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం డైయింగ్ హౌస్‌ను పరిశీలించిన కలెక్టర్, డైయింగ్ హాల్ మరమ్మతుల కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. డైయింగ్ హౌస్ వెనుకభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో కొత్త భవన నిర్మాణం, మగ్గాల మిషన్ల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. క్లస్టర్ అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నిబంధనలు రూపొందించాలని కూడా తెలిపారు. చేనేత క్లస్టర్ భవనానికి సంబంధించిన స్థలానికి సరిహద్దులు ఏర్పాటు చేయాలని నేత కార్మికులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనితోపాటు మాధవరం హ్యాండ్ లూమ్ పార్క్, ఏర్పాటు, మరియు చేనేత కాలనీలోకి బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని వినతులు అందచేశారు. అనంతరం కొత్త మాధవరం ప్రాథమిక వైద్యశాల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో చేనేత క్లస్టర్‌కు సంబంధించి సేల్స్ భవనం నిర్మించి వ్యాపారాలు చేపడితే నేతన్నల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అధికారులతో కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ ఏడి పిచ్చేశ్వరావు, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, హౌసింగ్ పీడీ రాజారత్నం, ఏడీవోలు రవి ప్రకాష్ రెడ్డి, శేశగిరి రావు, మండల ప్రత్యేక అధికారి జయసింహ, తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు, ఆర్ఐ ప్రసాద్, క్లస్టర్ గుత్తేదారు శ్రీకాంత్, చేనేత సొసైటీ అధ్యక్షుడు శ్రీరామదాసు వెంకట్, చైర్మన్ గంజి సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్ అవ్వారు జానకి రామయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసయ్య, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, మునగపాటి సుబ్బరాయుడు, వీఆర్వోలు శివశంకర్, కేశవులు, సామ శ్రీనివాసులు, మామిళ్ళ శ్రీహరి, బోడిచెర్ల శ్రీనివాసులు, జయరామయ్య, పుత్తా రవి, జొన్నాదుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఒంటిమిట్ట శ్రీ కోదండరాముడిని దర్శించుకున్న నిర్మలానంద స్వామీజీ



ప్రజాభూమి, ఒంటిమిట్ట: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీ శ్రీ రవిశంకర్ గురూజీ 70వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన ప్రధాన శిష్యులు శ్రీ నిర్మలానంద స్వామీజీ శనివారం ఒంటిమిట్టలోని చారిత్రక శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. రవిశంకర్ స్వామీజీ పేరుమీద ప్రత్యేక అర్చన నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన నిర్మలానంద స్వామీజీకి అర్చకులు, అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం సీతా సమేత లక్ష్మణ కోదండరామ స్వామి వార్లకు నిర్వహించిన ప్రత్యేక పూజలు, అర్చనల్లో స్వామీజీ పాల్గొన్నారు. దర్శనం అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ విశిష్టత, చారిత్రక నేపథ్యాన్ని అర్చకులు స్వామీజీకి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వరూప రాణి, డాక్టర్ ఆర్.జివి రెడ్డి, చంద్ర స్వామి, మామిళ్ళ శ్రీహరి, యోగా శిక్షకుడు వీరభద్రా రెడ్డి, మేరువ లక్షుమయ్య తదితర భక్తులు పాల్గొన్నారు. స్వామీజీ రాకతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది.

# మాచుపల్లిలో వైభవంగా శ్రీ రేణుక ఎల్లమాంబ - జమదగ్ని మహర్షి కళ్యాణ మహోత్సవం





ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమాంబ తిరుణాల వేడుకలు కన్నుల పండువగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ జగజ్జనని రేణుక ఎల్లమాంబ సమేత జమదగ్ని మహారాజు ఉత్సవ మూర్తులకు కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం వంటి కార్యక్రమాలతో కళ్యాణ ఘుట్టం ప్రారంభమైంది. వేద పండితులు రంగసముద్రం మల్లికార్జున శర్మ, సుబ్రమణ్యం శర్మ, ప్రదీప్ శర్మల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా పూజలు జరిగాయి. యజ్ఞోపవీత ధారణ, కంకణ ధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, మరియు ముత్యాల తలంబ్రాల వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించేందుకు మాచుపల్లి గ్రామం నుండే కాక చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కళ్యాణం అనంతరం భక్తులు రేణుక ఎల్లమాంబ మూలవిరాట్‌ను దర్శించుకుని కాయాకర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.


# గురప్పగారిపల్లిలో జనగణన గృహాలెక్కింపు కార్యక్రమానికి శ్రీకారం



ప్రజాభూమి పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గురప్పగారిపల్లి గ్రామంలో 2027 జనగణన కార్యక్రమంలో భాగంగా గృహగణన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గ్రామ మ్యాప్ ఆధారంగా గృహాల లెక్కింపును ఎలా నిర్వహించాలనే అంశంపై అధికారులతో కలిసి చర్చించారు. ఈ కార్యక్రమాన్ని పంచాయత్ కార్యదర్శి ప్రసాద్ రెడ్డి మరియు సెన్సస్ అధికారి కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు గృహగణన ప్రాముఖ్యతను వివరించి, అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుప్రజ, గురప్ప , స్వామి చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి, తిరుమల శెట్టి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి ఖచ్చితమైన సమాచారం అంది, అభివృద్ధి కార్యక్రమాలకు దోహదం అవుతుందని అధికారులు తెలిపారు.

# వాణిజ్య సిలిండర్ ధర పెంపుదలను ఉపసంహరించుకోవాలి

## - సిపియం జిల్లా కమిటీ డిమాండ్



మదనపల్లి, ప్రజాభూమి ప్రతినిధి

19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై పెంచిన 993.50 రూపాయల అదనపు ఛార్జీని తక్షణం ఉపసంహరించుకోవాలని సిపియం అన్నమయ్య జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణ దాడి నేపథ్యంలో ఇప్పటికే ఒకసారి గ్యాస్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల నడ్డి విరగ్గొట్టిందని పేర్కొన్నారు. ఇపుడు మరలా అమాంతం దాదాపు మరో వెయ్యి రూపాయలు పెంచి చిన్న వ్యాపారస్తులను, టిఫిన్ సెంటర్లు, చిన్న హోటళ్లను కోలుకోలేని దెబ్బతీస్తుందన్నారు. గ్యాస్ కొరత వలన ఇప్పటికే అనేక హోటళ్లు, టిఫిన్ సెంటర్లు మూతపడ్డమో లేక పాక్షికంగా నడవడమో జరుగుతోందని తెలిపారు. ఫలితంగా జిల్లాలో వందలాది మంది ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటివరకు ఆగిన కేంద్ర ప్రభుత్వం మరలా గ్యాస్ రేటు పెంచి వెన్నుపోటు పొడిచిందన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఉపాధి కోల్పోయిన చిన్న చిన్న వ్యాపారస్తులకు, టిఫిన్ సెంటర్లకు ఆర్థికంగా సహాయం చేసి ఆదుకోవాలని, కేజీ బేసిన్‌లోని గ్యాస్, చమురులో 50% రాష్ట్రానికి ఇవ్వాలని, గ్యాస్, ఆయిల్ బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని డిమాండ్ చేశారు. గ్యాస్ రేట్ల పెంపుదలపై ఎక్కడికక్కడ నిరసనలు తెలియజేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

## సుగవాసి ప్రసాద్ బాబుతో టిడిపి నేతల భేటీ



ప్రజాభూమి, సిద్దవటం: భాకరాపేట గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకుడు మాజీ రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు శనివారం రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి కడితం రామమోహన్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి శ్రేణులన్నీ అండగా నిలవాలని ఈ సందర్భంగా సుగవాసి పిలుపునిచ్చారు. అలాగే, రాజంపేట నియోజకవర్గంలోని సమస్యలను, ముఖ్యంగా సిద్దవటం మండల అభివృద్ధి అంశాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో మాధవరం టిడిపి యూనిట్ ఇంచార్జి గూండ్ల నాగేంద్ర బాబు, సిద్దవటం నేత పుత్తా శివానంద తదితరులు పాల్గొన్నారు.

# "మాధవరం హ్యాండ్లూమ్ పార్క్" ఏర్పాటుకు నేత కార్మికుల విజ్ఞప్తి



ప్రజాభూమి, సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని నేత కార్మికుల జీవనోపాధి అభివృద్ధి కోసం "మాధవరం హ్యాండ్లూమ్ పార్క్" ఏర్పాటుకు ప్రభుత్వ భూ మిని కేటాయించాలని నేత కార్మి కులు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కు వినతి పత్రం సమర్పించారు. శనివారం యస్.కె.ఆర్ నగర్ లోని చేనేత క్లస్టర్ ని సందర్శించడానికి వచ్చిన కలెక్టర్ గారికి స్దానిక చేనేత కార్మికులు సిద్ధవటం మండలం పెద్దపల్లి రెవెన్యూ పంచాయతీ, యస్.కె.ఆర్ నగర్ గ్రామంలోని సర్వే నెం. 1069/3లో 1.27 ఎకరాలు, సర్వే నెం. 1069/5లో 1.07 ఎకరాలు, మొత్తం 2.34 ఎకరాల ప్రభుత్వ భూమిలో హ్యాండ్లూమ్ పార్క్ నిర్మించాలని కోరారు. అలాగే సర్వే నెం. 905లో 0.35 సెంట్లలో ఇప్పటికే ప్రభుత్వ నిధులతో నిర్మించిన చేనేత క్లస్టర్ భవనాన్ని కూడా ఈ పార్క్‌లో భాగం చేయాలని విజ్ఞప్తి చేశారు. నేత కార్మికుల సంక్షేమం, ఉపాధి భద్రత, ఆర్థికాభివృద్ధి కోసం మైలవరం ప్రాంతంలో ఏర్పాటు చేసిన టెక్స్టైల్ పార్క్ తరహాలోనే మాధవరం హ్యాండ్లూమ్ పార్క్‌ను అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు. ఈ పార్క్ ఏర్పాటు వల్ల మాధవరం-1 పరిధిలోని అన్ని గ్రామాల నేత కార్మికులకు శాశ్వత ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు యువతకు స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో పరిశ్రమల అభివృద్ధికి ఇది దోహదపడటంతో పాటు నేత కార్మికుల కుటుంబాల ఆర్థిక భద్రతకు బాటలు వేస్తుందని వినతి పత్రంలో తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల చేనేత రంగం అభివృద్ధి చెందడంతో పాటు స్థానికంగా ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందని వారు అభిప్రాయపడ్డారు. సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని నేత కార్మికులు తమ కుటుంబాల భవిష్యత్తు కోసం ఈ భూమిని మాధవరం హండ్లూమ్ పార్క్ అభివృద్ధికి కేటాయించి అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్దానిక చేనేత సొసైటీ అధ్యక్షులు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# అరటి తోటలను పరిశీలించిన పులివెందుల ఇంచార్జ్ ఉద్యాన అధికారి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మండలం నల్లపురెడ్డి పల్లె గ్రామం లో గురువారం రాత్రి వీచినా పెనుగాలులకు నష్టపోయి న రైతుల అరటి తోటలను పులివెందుల ఇంచార్జ్ ఉద్యాన అధికారి రాఘవేంద్ర రెడ్డి రైతులతో కలిసి పరిశీలించారు. నష్టపోయిన రైతు ఆ గ్రామంలోని రైతు సేవా కేంద్ర సహాయకులకు తెలియపరచి వారి యొక్క పొలాలను నష్టపరిహార నివేదికల యందు పొందుపరచుకోవాలని రైతు యొక్క పట్టాదారు పాసు బుక్కు ,బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను సంబంధిత రైతు సేవ కేంద్రాల్లో అందజేయాలని తెలియజేశారు. పులివెందుల మండల వ్యాప్తంగా 205 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా నివేది కలను ప్రభుత్వం వారికి పంపించడం జరిగిందని పులివెందుల ఉద్యాన అధికారి తెలియజేశారు.

# 35 ఏళ్ల నిర్లక్ష్యానికి ముగింపు

## మదనపల్లె షాదీ మహల్ పునర్జన్మ చేసి ప్రజలకు అంకితం చేస్తాం

### రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ ఱ రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, పఠాన్ ఖాదర్ ఖాన్



మదనపల్లి, ప్రజాభూమి ప్రతినిధి :- అన్నమయ్య జిల్లా, మదనపల్లె పట్టణం ఇందిరానగర్‌లో గత 35 సంవత్సరాలుగా నిరుపయోగంగా, ప్రజలకు ఉపయోగం లేకుండా నిలిచిపోయిన షాదీ మహల్ సమస్యను ఇక మేము అజెండాగా తీసుకుని ముందుకు సాగుతున్నమని రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ - రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, పఠాన్ ఖాదర్ ఖాన్ అన్నారు. శనివారం జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి హిదాయతుల్లా తో పఠాన్ ఖాదర్ ఖాన్ ప్రత్యేక భేటీ అయ్యారు. ఈ సమస్యపై క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయి సమీక్ష చేపట్టితమన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిన ?56 లక్షలు పూర్తిగా వినియోగం అయ్యాయిని మిగిలిన పనులు పూర్తి చేయడానికి ?90 లక్షల అదనపు నిధుల ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వానికి పంపబడడం జరిగిందన్నారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలనలో ఉందిని మా సంకల్పం స్పష్టంగా ఉందన్నారు. మైనార్టీ సమాజానికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఇకపై ఆలస్యం కాకూడదుని షాదీ మహల్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే మా బాధ్యతగా భావిస్తున్నమన్నారు. పఠాన్ ఖాదర్ ఖాన్ నిరంతర కృషి, పట్టుదలతో ఈ ప్రాజెక్ట్ త్వరలోనే కార్యరూపం దాల్చబోతోందని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్లు నిర్లక్ష్యానికి గురైన ఈ సమస్యకు ఇప్పుడు పరిష్కారం దిశగా బలమైన అడుగులు పడుతున్నాయి. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు వేగవంతం చేసి, మదనపల్లె ఇందిరా నగర్ షాదీ మహల్‌నుప్రజలకు అంకితం చేయనున్నారు .

# తిరుమల ఘాట్ రోడ్డుపై ప్రమాద ఘంటికలు

- నిబంధనలకు పంగనామాలు పెడుతున్న వాహనదారులు.
- అలిపిరి తనిఖీల వద్దే హెల్మెట్లు.. ఆపై అంతా నిర్లక్ష్యమే!
- ద్విచక్ర వాహనాలపై ముగ్గురు, నలుగురి ప్రయాణం.. ప్రాణాలకు ముప్పు.
- ఘాట్ రోడ్డులో భద్రతా సిబ్బంది పర్యవేక్షణ కరువుపై భక్తుల ఆవేదన.



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



ఏడుకొండల స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల భద్రతే ధ్యేయంగా టీటీడీ మరియు పోలీస్ యంత్రాంగం నిబంధనలు విధిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అవి అమలు కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా తిరుమల ఘాట్ రోడ్లలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను బేఖాతరు చేస్తూ తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు.ప్రస్తుతం అలిపిరి చెక్‌పాయింట్ వద్ద భద్రతా సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. అక్కడ తనిఖీ చేసే సమయంలో మాత్రమే వాహనదారులు తమ హెల్మెట్లను చూపిస్తున్నారు లేదా ధరిస్తున్నారు. అయితే, చెక్‌పాయింట్ దాటి ఘాట్ రోడ్డులోకి ప్రవేశించిన కొద్దిసేపటికే హెల్మెట్లను తొలగించి వాహనాలు నడుపుతున్నారు. అత్యంత ప్రమాదకరమైన మలుపులు ఉండే ఘాట్ రోడ్డులో హెల్మెట్ లేకపోవడం ప్రమాదం జరిగితే ప్రాణాపాయానికి దారితీస్తుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ద్విచక్ర వాహనాలపై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలనే నిబంధన ఉన్నప్పటికీ, ఘాట్ రోడ్డులో ముగ్గురు, నలుగురు ప్రయాణించడం సర్వసాధారణంగా మారింది. కుటుంబ సభ్యులతో కలిసి ఒకే బైక్‌పై ప్రమాదకరంగా ప్రయాణిస్తూ ఇతర వాహనదారులను కూడా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇటువంటి నిర్లక్ష్య వైఖరి వల్ల తరచూ ఘాట్ రోడ్డులో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.అలిపిరి వద్ద తనిఖీలు చేస్తున్నప్పటికీ, ఘాట్ రోడ్డు మధ్యలో ఎక్కడా టీటీడీ భద్రతా సిబ్బంది లేదా పోలీసులు వాహనాలను తనిఖీ చేయడం లేదని యాత్రికులు ఫిర్యాదు చేస్తున్నారు. తగిన డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు కూడా సులభంగా కొండపైకి ప్రయాణిస్తున్నారు. నిరంతర తనిఖీలు లేకపోవడంతోనే వాహనదారులు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని తెలుస్తోంది.భక్తుల ప్రాణ భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని యాత్రికులు కోరుతున్నారు. ఘాట్ రోడ్డు పొడవునా అక్కడక్కడా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. హెల్మెట్ ధరించని వారు, నిబంధనలు ఉల్లంఘించే వారిపై భారీ జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేయాలి. ఘాట్ రోడ్డు నందు పెట్రోలింగ్ పెంచి, ఎప్పటికప్పుడు వాహనదారులను హెచ్చరించాలి.శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు క్షేమంగా వెళ్లి రావాలనే సంకల్పంతో టీటీడీ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సర్వత్రా విజ్ఞప్తి వెల్లువెత్తుతోంది.

## తిరుమల ఆనంద నిలయం -- చరిత్ర, శిల్పకళ, ఆధ్యాత్మిక మహిమాన్వితం


1953లో శ్రీవారి ఆనందనిలయం

ప్రజాభూమి ప్రతినిధి తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గర్భగుడి పైన ఉన్న గోపురాన్ని "ఆనంద నిలయం"గా పిలుస్తారు. బంగారు పూతతో వెలుగొందే ఈ విమానం భక్తులకు కనుల పండువగా దర్శనమిస్తూ, తిరుమల ఆలయానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది. శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఇది అత్యంత పవిత్రమైన నిర్మాణంగా భావించబడుతుంది.ఆనంద నిలయం మూడంతస్తుల చతురస్రాకార నిర్మాణం. గర్భగుడి పైన ఉండే భాగాన్ని "విమానం"గా పిలుస్తారు. తిరుమల ఆలయం తొలి ఏకబేర ఆలయంగా ప్రసిద్ధి చెందింది. పురాణాల ప్రకారం శ్రీనివాసుడు వైకుంఠం నుండి దివ్య విమానంలో తిరుమలకు వేంచేసాడని, ఆ రూపాన్ని భక్తులకు కనుపించేలా తొండమానుడు ఈ నిర్మాణాన్ని నిర్మించాడని విశ్వాసం. చరిత్ర పరంగా చూస్తే, 12వ--13వ శతాబ్దాల్లో ఆలయ నిర్మాణంలో విమానం ప్రాధాన్యం పెరిగింది. పల్లవులు, విజయనగర రాజులు కాలంలో బంగారు పూతలు, మరమ్మతులు జరిగాయి. ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయలు కాలంలో విమానానికి బంగారం తాపడం చేయడం విశేషం.1950లలో విమానం దెబ్బతినడంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో భారీ మరమ్మతులు చేపట్టి, ఆధునిక సాంకేతికతతో పునర్నిర్మాణం చేశారు. 1964లో అష్టబంధన మహాసంప్రోక్షణం నిర్వహించి కొత్త రూపంలో ఆనంద నిలయాన్ని ఆవిష్కరించారు. అప్పటి నుంచి ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి మరమ్మతులు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.ఆనంద నిలయం సుదర్శన చక్ర ఆకృతిని తలపిస్తూ నిర్మించబడింది. విమానంపై నలువైపులా సింహ విగ్రహాలు, శిల్పకళా నైపుణ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. భక్తులు శ్రీవారి దర్శనం అనంతరం విమాన వెంకటేశ్వర స్వామిని దర్శించడం కూడా సంప్రదాయంగా కొనసాగుతోంది. బంగారు పూతతో ప్రకాశించే ఆనంద నిలయం తిరుమల ఆలయ మహిమాన్వితాన్ని ప్రతిబింబిస్తూ, భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతున్న దివ్య నిర్మాణంగా నిలిచింది.

## మేనకూరు సచివాలయాన్ని ప్రైవేట్ వ్యక్తుల నుంచి కాపాడండి

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

తిరుపతి జిల్లా మేనకూరు గ్రామ సచివాలయం ప్రైవేటు వ్యక్తుల కబంధహస్తాల్లో చిక్కుకొని...




ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అవుతున్నా మామూళ్ళ మత్తులో సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోక పోవడం లేదని ఆవేదన చెందుతున్న ప్రజానీకం. ప్రభుత్వ సొమ్మును లక్షల రూపాయల్లో ప్రైవేటు వ్యక్తులు స్వాహా చేసారనే ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అధికారులు కనీస విచారణ చేపట్టకపోవడంపై అధికారుల వైఖరిపై వెల్లువెత్తుతున్న విమర్శలు. ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్న మేనకూరు గ్రామపంచాయతీలో ప్రైవేటు వ్యక్తులు అనధికారిక వసూళ్ళకు పాల్పడుతూ... ఆ అక్రమ సంపాదనలో అధికారులను కూడా భాగస్వామ్యలను చేస్తున్నారని... తద్వారానే అధికారులు ప్రైవేటు వ్యక్తుల విషయంలో పట్టించుకోవడంలేదని చర్చించుకుంటున్న ప్రజానీకం. గ్రామస్థాయి అధికారుల నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు ప్రైవేటు వ్యక్తులు ఇచ్చే మామూళ్ళలో జోగుతూ ప్రభుత్వ సొమ్మును ప్రైవేటు వ్యక్తులు దుర్వినియోగం చేస్తున్నా... చర్యలు సంగతి దేవుడు కెరుక కనీస విచారణ చేపట్టకపోవడంపై అధికారుల వ్యవహార శైలిపై పెదవి విరుస్తున్న ప్రజానీకం. జిల్లా కలెక్టర్ మేనకూరు గ్రామపంచాయతీలో ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశారని ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి... ప్రైవేటు వ్యక్తులను కాపాడుతున్న ప్రభుత్వ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న ప్రజలు.

## ఐఎంఏ మెంబర్‌షిప్‌కు చివరి అవకాశం -- వైద్యులు నమోదు చేసుకోవాలి. డాక్టర్ పి రెడ్డప్ప పిలుపు.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి




తిరుపతి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సభ్యత్వ నమోదు చివరి రోజు కావడంతో, ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐఎంఏ తిరుపతి బ్రాంచ్ కోశాధికారి డాక్టర్ రెడ్డప్ప సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎంఏ సభ్యత్వం ద్వారా వైద్యులకు అనేక రకాల ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. ప్రొఫెషనల్ అభివృద్ధి, నూతన వైద్య పరిజ్ఞానం, శిక్షణ కార్యక్రమాలు, వైద్యుల సంక్షేమ పథకాలు వంటి అనేక అంశాలలో ఐఎంఏ కీలకంగా సహకరిస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ప్రతి వైద్యుడు ఐఎంఏలో సభ్యత్వం పొందడం ద్వారా సంఘం అందించే వివిధ ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వదులుకోకుండా వెంటనే సభ్యత్వం నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సభ్యత్వం పొందిన ప్రతి వైద్యుడు ఐఎంఏ అందించే సేవలు, సౌకర్యాలు, సంక్షేమ పథకాలను సమర్థంగా వినియోగించుకోవచ్చని తెలిపారు.

## గంగమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి




తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర నిర్వహణ ఏర్పాట్లను నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి, ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, అధికారులతో కలసి శనివారం ఉదయం పరిశీలించారు. ఆలయంలోపల, పరిసర ప్రాంతాల్లోను, మార్కెట్ లో పొంగళ్ళు పెట్టె ప్రాంతాల్లో చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయ పరిసరాల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించి శుభ్రంగా ఉంచాలని హెల్త్ ఆఫీసర్ కు సూచించారు. భక్తులకు వాహనాల వలన ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. బయో మరుగుదొడ్లు, త్రాగునీటి వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. జంతుబలులు జరిగే ప్రాంతంలో శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులకు ఇబ్బంది కలిగించే దుకాణాలు లేకుండా చర్యలు చేపట్టాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. సిసి కెమెరాలు, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇంచార్జి కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసికుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, అలయ ఈ.ఓ.జయకుమార్, డి.ఈ. రాజు, ఏసీపి లు పార్వతి ప్రియ, మూర్తి, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

## నాయుడుపేట సబ్ డివిజన్‌లో 'పోలీస్ యాక్ట్ 30' అమలు: నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

**-నెల రోజుల పాటు ఆంక్షలు విధిస్తూ డీఎస్పీ జి. చెంచు బాబు ఉత్తర్వులు.**
**-సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి.**

(ప్రజాభూమి ప్రతినిధి నాయుడుపేట టౌన్ )



నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజా ప్రశాంతతకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు 1861 పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం ఆంక్షలు విధిస్తూ నాయుడుపేట డీఎస్పీ జి. చెంచు బాబు శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆంక్షలు మే 1వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు నెల రోజుల పాటు అమల్లో ఉంటాయి.రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు లేదా గ్రూపులు బహిరంగ ప్రదేశాల్లో ర్యాలీలు, ధర్నాలు, సభలు నిర్వహించాలంటే తప్పనిసరిగా డీఎస్పీ గారి నుండి ముందస్తు రాతపూర్వక అనుమతి పొందాలి. అనుమతి కోరుతూ దరఖాస్తు చేసే సమయంలో కార్యక్రమ స్థలం, సమయం వంటి పూర్తి వివరాలను పోలీసులకు అందజేయాలి. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ఏ సమయంలోనైనా మంజూరు చేసిన అనుమతిని రద్దు చేసే అధికారం కలిగి ఉంటారు. ఈ ఉత్తర్వులు వివాహ వేడుకలకు మరియు అంత్యక్రియల ఊరేగింపులకు వర్తించవని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీస్ యాక్ట్ ప్రకారం కఠినమైన ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు, నాయకులు పోలీస్ యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

## అన్నమయ్య జయంతి ఉత్సవాలకు ఘనారంభం - సంకీర్తనలతో భక్తిరస పరవశం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



శ్రీ వేంకటేశ్వర స్వామి పరమభక్తుడు తాళ్లపాక అన్నమాచార్యుల 618వ జయంతి ఉత్సవాలు శనివారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, స్థానిక కళాకారులు కలిసి ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం భక్తులను భక్తిరసంలో ముంచెత్తింది. "బ్రహ్మకడిగిన పాదము...కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు...నారాయణతే నవెూ నవెూ ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన...హరి అవతారమితడు అన్నమయ్య..." వంటి కీర్తనలు ఆలపించగా సభా వేదిక ఆధ్యాత్మిక సౌరభంతో నిండిపోయింది. అనంతరం హారతి, మహానివేదనం నిర్వహించారు.సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా తిరుపతికి చెందిన అన్నపూర్ణ బృందం సంగీత సభ, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారిణి విజయలక్ష్మీ బృందం హరికథ గానం నిర్వహించనున్నారు.మహతి కళాక్షేత్రంలో కూడా గాత్ర సంగీతం, నృత్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కుమారి వేదవ్యాస రంగరాజశ్రీ బృందం సంగీత సభ, ధనశ్రీ శ్రీనివాస్ బృందం నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించనున్నాయి.ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డా. మేడసాని మోహన్, సంచాలకులు డా. లత, కళాకారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## కలం వీరుడు... నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం -- రిపోర్టర్లకు నారద మహర్షి జయంతి శుభాకాంక్షలు

ప్రజభూమి ప్రతినిధి తిరుపతి



సకల లోక సంచారి, బ్రహ్మ కుమారుడు, విష్ణుభక్తి తత్పరుడు, దేవర్షి నారద మహర్షి జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీడియా ప్రతినిధులందరికీ సామాజిక సేవకుడు పొన్నా రవికుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నారద మహర్షి అంటే కేవలం పురాణాల్లో కనిపించే ఋషి మాత్రమే కాకుండా, సత్యాన్ని సమాజానికి చేరవేసే మొదటి "సందేశ వాహకుడు", నిజానికి ఆధునిక మీడియా ప్రతినిధుల ఆద్యుడని పేర్కొన్నారు. లోకాల మధ్య సంచరిస్తూ, దేవతల నుంచి మనుషుల వరకు సమాచారం చేరవేసిన నారదుని పాత్ర, నేటి రిపోర్టర్ల బాధ్యతను గుర్తు చేస్తుందని అన్నారు. "నారాయణ... నారాయణ..." అనే నామస్మరణతో భక్తి, సేవ, జ్ఞానం, వినయం అనే నాలుగు విలువలను జీవన విధానంగా మార్చుకున్న నారద మహర్షి బోధనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని తెలిపారు. సమాజానికి నిజాన్ని తెలియజేయడం, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, న్యాయపరంగా నిలబడడం వంటి విలువలను మీడియా ప్రతినిధులు కొనసాగించాలని ఆకాంక్షించారు. ప్రస్తుత కాలంలో రిపోర్టర్లు కలం పట్టిన వీరులుగా, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనాలుగా నిలుస్తూ ప్రజాస్వామ్యానికి బలమైన స్తంభాలుగా మారారని కొనియాడారు. చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పని చేస్తున్న ప్రతి మీడియా ప్రతినిధి సమాజానికి సేవ చేస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల మీడియా సోదర సోదరీమణులందరికీ నారద మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి సేవా భావం మరింత విస్తరించాలని, సమాజంలో శాంతి, శ్రేయస్సు, ఆనందం నెలకొనాలని పొన్నా రవికుమార్ ఆకాంక్షించారు.

## తుమ్మలగుంటలో వైభవంగా గంగమ్మకు పొంగళ్లు

**-ప్రత్యేకంగా పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి**
**-తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సందడి**

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్



తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి గంగమ్మ తల్లికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులను 'చల్లగా చూడమ్మా.. గంగమ్మ' అంటూ ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంకు అనుబంధమైన వేద పాఠశాల ముందున్న గంగమ్మకు మహిళలు ప్రత్యేకంగా అభిషేకం చేసి పాల పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం గంగమ్మ ఆలయం ముందు కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు తీర్చకున్నారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులతో పాటు తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు గ్రామస్తులతో కలసి గంగమ్మకు ప్రత్యేకంగా పూజలు చేశారు. చంద్రగిరి నియోజక వర్గం ప్రజలు అందరికీ మంచి జరగాలని, సకాలంలో వర్షాలు కురిపించి రైతులు సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని గంగమ్మను ప్రార్థించారు.

## టీటీడీ ఈఓతో తుడా ఛైర్మన్ భేటీ - అభివృద్ధి అంశాలపై చర్చ

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ముద్దాడ రవిచంద్రను తుడా ఛైర్మన్, టీటీడీ ఎక్స్ అఫిషియో మెంబర్, తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.తిరుపతి దేవస్థానం పరిపాలన భవనంలోని ఈఓ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో దివాకర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తిరుపతి అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల మెరుగుదల, మౌలిక వసతుల విస్తరణ వంటి పలు అంశాలపై ఈఓతో చర్చించారు.

## రక్తదానం చేయండి ఆపదలో ఉన్న వారిని రక్షించండి

**ఎం వి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాకాడులో రక్తదాన శిబిరం**

ప్రజాభూమి ప్రతినిధి వాకాడు.



రక్తదానం చేయండి ఆపదలో ఉన్న వారిని రక్షించండి అంటూ ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ కోరారు.శనివారం మండల కేంద్రమైన వాకాడులో కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం.వి. రావు ఫౌండేషన్ 18 వ వార్షికోత్సవ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ప్రస్తుతం రక్త నిల్వలు అత్యధిక స్వల్పంగా ఉన్నందున ప్రతి ఒక్కరూ రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు వీలవుతుందని కావున స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు.ముందుగా స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు ఆదిలక్ష్మి చిత్రపటాలకు పూలమాలవేసి జ్యోతి ప్రజలవన చేశారు. నెల్లూరు నోవా బ్లడ్ బ్యాంకు వారు రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు.ఈ కార్యక్రమంలో ఎం.వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ కార్యదర్శి ఎం. విజయలక్ష్మి, వాకాడు పంచాయతీ కార్యాలయ సూపర్వైజర్ భీమయ్య నేతృత్వంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది తదితరులు రక్త సేకరణలో పాల్గొన్నారు. నోవా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది దళితుల ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు.

## జనగణనలో సమాచారాన్ని పక్కాగా నమోదు చేయండి.ఇంచార్జి కమిషనర్ శారదా దేవి

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



జనగణన 2027 భాగంగా సేకరించే సమాచారం పక్కాగా ఉండేలా చూడాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులు, సిబ్బందికి సూచించారు. జనన గణన 2027 లో బాగంగా ఇంటింటి నుండి సమాచారాన్ని సేకరించే విధానాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఆప్ ద్వారా ఏయే వివరాలను ఎలా నమోదు చేస్తున్నారనే విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జనన గణన ను పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలుపారు. జననగనణ చేసేందుకు 625 మంది ఎన్యుమరేటర్లు, 71 మంది సూపర్ వైజర్లు, 21 మంది ఫీల్డ్ ట్రైనర్లు ఉన్నారని తెలిపారు. వారందరూ ఈ నెల 1 నుండి 30 వ తేదీ వరకు నగరంలోని ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరిస్తారని తెలిపారు. ఈ జనగణన లో ఎక్కడా పొరపాట్లు జరగకుండా అన్ని వివరాలు యాప్ లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూదన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు నరేష్, మోహన్, తదితరులు ఉన్నారు.

# తిరుమలలో జనతా క్యాంటీన్ల దోపిడీ

- తిరుమలలో భక్తులను దోచుకుంటున్న జనతా క్యాంటీన్లు.
- తక్కువ ధరకే స్థలం కేటాయించిన ఎక్కువ ధరలు వసూలు.
- భక్తులను దోచుకుంటున్న జనతా హోటళ్లు.

ప్రజాభూమి ప్రతినిధి తిరుమల




సామాన్య భక్తులకు తక్కువ ధరకు ఆహారం అందించాలన్న టీటీడీ లక్ష్యం జనతా క్యాంటీన్ల వద్ద నీరుగారుతోంది. తక్కువ అద్దెకే కేటాయించినా నిర్వాహకులు మాత్రం పెద్ద క్యాంటీన్లు, ఏపీ టూరిజం హోటళ్లకంటే ఎక్కువ ధరలు వసూలు చేస్తూ భక్తులను దోచుకుంటున్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ ఆధ్వర్యంలో ఉచిత అన్నప్రసాదాలు పెద్దఎత్తున అందిస్తోంది. అయితే నచ్చిన ఆహారం కోసం కొందరు బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలకు వెళ్తుంటారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల హోటళ్లలో ధరలు భారీగా పెంచడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీటీడీ ధర్మకర్తల మండలి సదుద్దేశంతో బిగ్, జనతా క్యాంటీన్ల అద్దెలను తగ్గించింది. నాణ్యమైన ఆహారాన్ని తక్కువ ధరకు అందించాలని నిర్దేశించింది. ఇందులో భాగంగా 5 జనతా క్యాంటీన్లకు అనుమతించి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల లోపు అద్దెను ఖరారు చేసింది. ఎస్ఎంసీ ఏరియాలోని ఓ జనతా హోటల్ ధరలు చూస్తే భక్తులు హడలిపోవాల్సిందే. 2 ఇడ్లీలు రూ.40, 2 వడలు రూ.70, పన్నీర్ దోశ రూ.110, సాధారణ దోశ రూ.60 నుంచి రూ.110, సౌత్ ఇండియన్ భోజనం రూ.220, పిల్లలకు రూ.160, వెజ్ బిర్యానీ రూ.200, పెరుగన్నం రూ.95, స్టార్టర్స్ రూ.150 నుంచి రూ.250 వరకు వసూలు చేస్తున్నారు. మిల్క్ షేక్స్ రూ.100 తక్కువ లేవు. వీటిపై పన్నులు అదనం.శ్రీఅన్నమయ్య భవనంలోని ఏపీ టూరిజం హోటల్ నెలకు రూ.5 లక్షల వరకు అద్దె చెల్లిస్తోంది. అక్కడ రెండు ఇడ్లీలు రూ.25, వడ రూ.40, దోశ రూ.50 నుంచి రూ.120, సౌత్ ఇండియన్ భోజనం రూ.150, పిల్లలకు రూ.95, వెజ్ బిర్యానీ రూ.150గా ఉంది. ఎక్కువ అద్దె చెల్లించే పెద్ద క్యాంటీన్‌కంటే తక్కువ అద్దెకు నడుస్తున్న జనతా హోటళ్లలో ధరలు అధికంగా ఉండడంపై భక్తులు మండిపడుతున్నారు.త్వరలో ధరలు ఖరారు: జనతా క్యాంటీన్లలో ధరల పట్టికను ఇంకా ఖరారు చేయలేదని టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. తిరుపతిలోని ఇండియన్ కలినరి అకాడమీ ద్వారా అధ్యయనం చేయించి ధరలు నిర్ణయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే వారు ధరలు నిర్ణయిస్తారని అన్నారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి క్యాంటీన్ల యజమానులతో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. నిబంధనల మేరకు హోటళ్లు నడపాలని, అప్పటివరకు ధరలు తగ్గించాలని సూచించినట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

# సద్విచారణ జ్ఞాన సాధన సదస్సు

ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి






శ్రీకాళహస్తి పట్టణంలోని సుఖ బ్రహ్మాశ్రమం సమీపంలోని శ్రీ చైతన్య క్షేత్రం శ్రీ స్వరాజ్య సంఘమునందు మే 1 2 3 తేదీలలో సద్విచారణ జ్ఞాన సాధన సదస్సు నిర్వహించడం జరుగుతున్నది. రెండవ రోజు శనివారం అధ్యక్షులు శ్రీరామ చైతన్య స్వామి అధ్యక్షతన స్థానిక రామలింగ ఆశ్రమం అధ్యక్షులు మౌన స్వామి, పరబ్రహ్మ ఆశ్రమం పరమాత్మ నందగిరి స్వామి ప్రొద్దుటూరు శ్రీ స్వరాజ్య సంఘం అధ్యక్షులు శ్రీ వద్ది నరసింహులు ముఖ్య అతిథులుగా విచ్చేసి తమ తమ ఉపన్యాసములు భక్తులందరికీ తెలిపారు. శ్రీ వద్ది నరసింహులు మాట్లాడుతూ శ్రీ చైతన్య క్షేత్రం శ్రీ స్వరాజ్య సంఘం అధ్యక్షులు శ్రీరామ చైతన్య స్వామి చేసిన నిర్విరామ కృషి గురించి తెలియజేశారు. శ్రీరామ చైతన్య స్వామి 15 సంవత్సరాల వయసు నుండి బ్రహ్మజ్ఞాన సాధనకై అన్వేషిస్తూ 1986లో శ్రీకాళహస్తి సుఖ బ్రహ్మ ఆశ్రమం వార్షికోత్సవ నిమిత్తమై విచ్చేసి అక్కడ బ్రహ్మ విద్యా పాఠశాలలో బ్రహ్మవిద్య అధ్యయనం చేసి దాదాపు 12 సంవత్సరములు సుఖ బ్రహ్మ ఆశ్రమంలో గీతా అధ్యాపకులుగా పనిచేసి తదుపరి 1998లో శ్రీ చైతన్య క్షేత్రం నెలకొల్పాలనే సంకల్పంతో దగ్గరలో ఒక చిన్న కుటీరంలో ఆశ్రమం నిర్మించుకొని నివాసం ఏర్పరచుకొని ఆశ్రమంలో చిన్నచిన్న మొక్కలు నాటి దాదాపు 28 సంవత్సరములు వాటిని పెంచి పోషించి పెద్దపెద్ద వృక్షాలయ్యే వరకు వాటిని సంరక్షిస్తూ శిష్యుల ప్రోత్సాహంతో ఆశ్రమాన్ని దినదిన ప్రవర్తమానంగా అభివృద్ధి చేస్తూ శిష్యులకు జ్ఞాన బోధ చేస్తూ జ్ఞానానికి అనువైన ప్రదేశంగా ఆశ్రమాన్ని తీర్చిదిద్దారు. సభలు ,సమావేశాలు ,సదస్సులు నిర్వహించాలని సదుద్దేశంతో ఈ కార్యక్రమం భక్తులు, శిష్యుల సహకారంతో మూడు రోజులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంతటి మహోన్నతమైన వ్యక్తి గురించి ఎంత చెప్పినా అతిశయోక్తి కాదని, వీరి కృషి అభినందనీయం ఆనిర్వచనీయమైనదనీ వద్ది నరసింహులు ప్రసంగించారు. శ్రీ మౌన స్వామి మాట్లాడుతూ అందరికీ గురువైన జగద్గురు వేదాంతం లక్ష్మీనాచార్యులు శ్రీ స్వరాజ్య సంఘం అభివృద్ధి ఎంత గొప్పగా చేశారో దాన్ని అంతే ప్రమాణాలతో ప్రొద్దుటూరు, మదనపల్లి, కోటబైలు, బెంగళూరు ,తెనాలి, సోలాపూర్ ప్రాంతాలలో అనేక మంది శిష్యులను బ్రహ్మ విద్యా పాఠకులుగా గురువులుగా శ్రీరామ చైతన్య స్వామి తీర్చిదిద్దారని చాలా గొప్పగా తెలియజేశారు. శ్రీ పరమాత్మ నంద స్వామి వేదాంత రహస్యములు గురించి ధ్యానం మరియు మెలకువలు గురించి చక్కగా భక్తులకు వివరించారు.తమ ఉపన్యాసంతో వచ్చిన భక్తులను విశేషంగా అలరించారు.చివరిగా శ్రీరామ్ చైతన్య స్వామి ఈ ఆశ్రమం నిర్మించడానికి అభివృద్ధి చేయడానికి ఆహోరాత్రులు కృషిచేసి భక్తులందరి సహాయ సహకారాలు ఇచ్చారని దీనిని భవిష్యత్తులో ఒక ధ్యాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని భక్తులకు విన్నవించారు. బెంగళూరు మదనపల్లి మదనపల్లి ప్రొద్దుటూరు నుండి విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాదం అందజేశారు

# ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఫలితాలు -మండుటెండలోనూ ఉత్సాహంగా సాగిన బడి పిలుస్తోంది ర్యాలీ

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగినేని చెంచయ్య నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురవారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ లు సంయుక్తంగా అన్నారు. 36 మండలాలు 36 రోజులు – బడి పిలుస్తోంది ఇంటింటికీ ప్రచార రథం ఎన్రోల్మెంట్ డ్రైవ్ 8వ రోజు శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో అనుభవం అర్హత కలిగిన ఉపాధ్యాయులు బోధన అందించడంతో పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్యా బోధనతో పాటు పాఠ్యపుస్తకాలు సమవస్త్రాలు స్కూల్ బ్యాగ్, షూ, సాక్స్, నోట్ పుస్తకాలు, డిక్షనరీ, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం, ఐ ఎఫ్ పి ప్యానెల్స్ ద్వారా డిజిటల్ విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. మానసిక ఒత్తిడి లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన అందాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ర్యాలీని పట్టణంలోని నాలుగు మాడవీధులతో పాటు అల్లిమడుగు, చిన్న మిట్టకండ్రిగ, వేడం, అబ్బాబట్లపల్లి, రామలింగాపురం, తొండమనాడు, ఎగువ వీధి, అక్కుర్తి, మంగళపురి, ముచ్చివోలు, వేలవేడు, వాంపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు చంద్రశేఖర్ నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, పుష్ప, మండల విద్యాశాఖ అధికారులు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, సుచరిత, జ్ఞానప్ప, రూపేష్, కృష్ణయ్య, ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, సి ఆర్ ఎం టి లు ముని మోహన్, గాంధీ, కృష్ణయ్య, ప్రదీప్, సునీత, స్వప్న, శాంతి, లలిత, ఐఈఆర్టీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, నాయకులు ప్రతాప్ రెడ్డి, బాబురెడ్డి, మురళి, హరి, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖకు విశిష్ట సేవలు అందించిన శునకం “సింధు” మృతి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి





తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా పోలీస్ శునక దళంలో విశిష్ట సేవలు అందించిన ఎక్స్‌ప్లోసివ్ డిటెక్షన్ శునకం “సింధు” సహజ కారణాలతో మృతి చెందిన సందర్భంగా పోలీస్ అధికారులు నివాళులు అర్పించారు. లాబ్రడార్ రిట్రీవర్ జాతికి చెందిన ఆడ శునకం “సింధు” 28.12.2013న జన్మించింది. 2014 సంవత్సరంలో హైదరాబాద్‌లోని ఐఐటీఏ, మొయినాబాద్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన అనంతరం తిరుమల––తిరుపతి ప్రాంతాల్లో శునక దళంలో సేవలందించింది. ఎక్స్‌ప్లోసివ్ డిటెక్షన్ విభాగంలో పనిచేసిన “సింధు” తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి పోలీస్ శాఖ సంయుక్త భద్రతా విధుల్లో కీలక పాత్ర పోషించింది. తిరుమలలో జరిగే విఐపీ, వీవీఐపీ పర్యటనలు, యాంటీ సబోటాజ్ తనిఖీలు, భద్రతాపరమైన సున్నిత ఆపరేషన్లలో “సింధు” అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించి శాఖకు విశేష సేవలు అందించింది. తన సేవా కాలంలో శిక్షణా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకుంది. 2021లో మంగళగిరిలో నిర్వహించిన రిఫ్రెషర్ కోర్సులో మూడో బహుమతి సాధించడం ద్వారా తన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది. వయోభార కారణాల రీత్యా 02.09.2023న విధుల నుంచి విరమణ చేసిన “సింధు” 01.05.2026న సాయంత్రం 7.10 గంటలకు సహజ కారణాలతో మృతి చెందింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ, పోలీస్ శాఖకు సేవలందించిన శునక దళ సభ్యులు కూడా పోలీస్ కుటుంబంలో అంతర్భాగమేనని, “సింధు” అందించిన సేవలు శాఖ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం నిబద్ధతతో పనిచేసిన “సింధు” సేవలను తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ గౌరవంగా స్మరించుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. రామకృష్ణ, డీఎస్పీ గారు, డీఎస్‌డబ్ల్యూ, తిరుపతి శ్రీనివాసరావు, ఏవీ – ఎస్వో, టీటీడీ, తిరుపతి డాగ్ స్క్వాడ్ మరియు బాంబ్ డిస్పోజల్ టీమ్ సిబ్బంది హాజరయ్యారు.

# తహశీల్దార్ కార్యాలయ పి జి ఆర్ ఎస్ ను సద్వినియోగం చేసుకోండి

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం



ప్రజా సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ యు మధుసూదన్ రావు కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండల ప్రజలు తమ సమస్యలను తహశీల్దార్ కార్యాలయంలోనే పి జి ఆర్ ఎస్ లో లిఖిత పూర్వకంగా అర్జీని సమర్పించుకోవాలన్నారు. అర్జీతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్ కచ్చితంగా ఫిర్యాదులో పొందుపరచాలన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో అర్జీదారుల సమర్పించే ఫిర్యాదుకు కచ్చితంగా దరఖాస్తు స్వీకరించినట్లు రిసిప్ట్ అందజేస్తామన్నారు. వేసవి తాపం ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళనవసరం లేదన్నారు. మండల స్థాయిలోనే రికార్డులను పరిశీలించి రెవిన్యూ సమస్యలను తక్షణం పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

# నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేసిన వెంకట రమేష్ దంపతులు

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి



దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి విశాఖపట్నం జిల్లా చోడవరం వాస్తవ్యులు ఎన్. వెంకట రమేష్ దంపతులు శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానముచే నిర్వహించబడుచున్న నిత్యాన్నదాన పథకానికి రూ. 1,25,000/– లు దేవస్థానం అధికారులకు విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు వారికి అంతరాల దర్శనము, వేద ఆశీర్వచనము ఏర్పాటుచేసి తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఏఈఓ మోహన్. ఏపీ పి ఆర్ ఓ రవి ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి కి సాదర ఆహ్వానం

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డిని గంగమ్మ దేవస్థానం ఛైర్మన్ మహేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ జాతర ఆహ్వాన పత్రికను అందజేసి, అమ్మవారి జాతర విశిష్టతను వివరించారు. నెలలో అత్యంత వైభవంగా జరగనున్న ఈ జాతర మహోత్సవానికి విచ్చేసి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఈ ఆహ్వానాన్ని సంతోషంగా స్వీకరిస్తూ, జాతర ఏర్పాట్లపై ఆరా తీశారు.తిరుపతి ప్రజల ఆరాధ్య దైవమైన గంగమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబు, సీపిఓ దేవికుమారి,దేవస్థాన పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

# నిత్య అన్నదానానికి ఉదార విరాళం -- పాలకమండలి సభ్యుడు ఎస్. కృష్ణయ్య నుంచి రూ.50 వేల అందజేత

ప్రజాభూమి ప్రతినిధి నాగలాపురం



నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం నందు ప్రతిరోజూ నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి పాలక మండలి సభ్యుడు ఎస్. కృష్ణయ్య రూ.50,000/– (అక్షరాలా యాభై వేలు) విరాళంగా అందించారు.సత్యవేడు వాస్తవ్యుడైన కృష్ణయ్య అందించిన చెక్కును సత్యవేడు నియోజకవర్గ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి చేతుల మీదుగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లత, ఆలయ చైర్మన్ డి. పద్మనాభ రాజుకు అందజేశారు.ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ... తాను ఆలయానికి విచ్చేసి స్వామివారి దర్శనం అనంతరం అన్నదానంలో పాల్గొన్నానని తెలిపారు. ఈ దేవస్థానంలో భక్తులకు నిర్వహిస్తున్న అన్నదానం ఎంతో సంతృప్తికరంగా, శ్రద్ధతో జరుగుతోందని, నాణ్యమైన ప్రసాదాలు అందించడంలో ఆలయ అధికారులు తీసుకుంటున్న కృషిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, సత్యవేడు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అర్జీలతో ప్రజా ఫిర్యాదుల వేదిక బి ఎమ్మార్వో శ్యాం ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట పట్టణంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించడం జరుగుతుందని తాసిల్దార్ శ్యాంప్రసాద్ వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలిపారు. ప్రజల సమస్యలన్నింటినీ ఒకే చోట పరిష్కరించాలనే ఉద్దేశంతో అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ ప్రజా పరిష్కార వేదికలో మండల స్థాయి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు మొదటగా రేణిగుంట తహసిల్దార్ వారి కార్యాలయం ను సంప్రదించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఒకే చోట ఉండి అన్ని రకాల ఫిర్యాదులను సేకరించి పరిష్కరించడానికి వీలుగా మండల స్థాయి అధికారులు అందరూ ఒకే చోట అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఫిర్యాదు అందజేసిన ప్రతి ఒక్కరికి రసీదు ఇవ్వబడుతుందని చెప్పారు. కేటాయించిన సమయం లోపల మీ సమస్య పరిష్కారం కాకపోతే సంబంధిత కార్యాలయాన్ని సంప్రదించడానికి ఈ రసీదు ఉపయోగపడుతుందని తెలిపారు. రేణిగుంట మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొనే ప్రజలందరూ తమ ఫిర్యాదులకు సంబంధించిన ధ్రువపత్రాలతో హాజరై సమస్యలను త్వరగా పరిష్కరించుకోవాల్సిందిగా ఎమ్మార్వో శ్యాం ప్రసాద్ తెలిపారు.

# సహజ వ్యవసాయంపై విద్యార్థులకు ప్రాయోగిక అవగాహన -- వేమూరులో క్షేత్ర సందర్శన

ప్రజాభూమి తిరుపతి రూరల్ ప్రతినిధి





తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం ఆదేశాల మేరకు వేమూరు గ్రామంలో ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ దామా అయ్యప్ప నాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని వి బి ఆర్ కళాశాల వ్యవసాయ విద్యార్థులు సందర్శించారు.ఈ సందర్భంగా సహజ వ్యవసాయం మరియు అందులో అనుసరిస్తున్న వివిధ పద్ధతులపై విద్యార్థులు అవగాహన పొందారు. క్షేత్ర సందర్శనలో భాగంగా ఏటీఎం, ఏ గ్రేడ్, పి ఎం డి ఎస్ మోడళ్లను, అలాగే వినూత్న సాగు విధానంలో చెరుకు పంటను ప్రత్యక్షంగా పరిశీలించారు.బి ఆర్ సి కేంద్రంలో తయారు చేస్తున్న వివిధ రకాల కషాయాలు, గ్రోత్ ప్రమోటర్లు, బయో స్టిమ్యులెంట్ల తయారీ విధానంపై కూడా విద్యార్థులకు వివరణ ఇచ్చారు. సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రసాయన వ్యవసాయాన్ని తగ్గించడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునంద రెడ్డి, లావణ్య, ఐ సి ఆర్ పి సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మండేఎండల నుంచి ఊరటబిబిరేణిగుంటలో ఆకస్మిక వర్షం

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.



శనివారం ఉదయం నుంచే మండుతున్న ఎండలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉక్కపోతతో అలసిపోయిన ప్రజలకు శనివారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారింది.ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురవడంతో పట్టణ ప్రాంతాలు,చల్లబడ్డాయి. సుమారు గంటకు పైగా కొనసాగిన ఈ వర్షంతో ఎండలతో అల్లాడిన జనంకు కొంత ఊరట లభించింది.అయితే భారీ ఈదురు గాలుల కారణంగా రహదారులపై ప్రయాణిస్తున్న వాహనదారులు, తీవ్ర ఇబ్బందులు పడ్డారు.పుత్తూరు,కడప,శ్రీకాళహస్తి బైపాస్ రోడ్లలో కొన్ని ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండడంతో వాహనాలు స్వల్పంగా నిలిచిపోయాయి.దీంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది. మొత్తానికి ఆకస్మిక వర్షం ప్రజలకు ఉపశమనం కలిగించగా,కొంత అసౌకర్యాన్ని కూడా మిగిల్చింది.

# గ్రామాలలో మౌలిక వసతుల కల్పనే..... అభివృద్ధికి సూచికలు - ఎమ్మెల్యే పులివర్తి నాని

- రైతన్నల అభీష్టం మేరకే రాజ ముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు.
- ప్రజల సహకారంతోనే సమగ్ర గ్రామాభివృద్ధి సాధ్యం



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో ప్రజలకు మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా పనిచేసి, అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించినప్పుడే అభివృద్ధికి సూచికలు చిరుస్థాయిగా నిలుస్తాయని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం మండలంలోని బ్రాహ్మణ కాల్వ గ్రామంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవం, రైతన్నలకు రాజముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ కార్యక్రమం హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నానికి గ్రామస్తులు కర్పూర హారతులతో ఘన స్వాగతం పలికారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని కాగితాలలో చూపించడం కాదు...... ప్రజల కళ్ళకు కనిపించేలా గ్రామాల అభివృద్ధి చేయడమే నా ప్రధాన లక్ష్యమన్నారు. బ్రాహ్మణ కాల్వ గ్రామంలో వర్షాలు వచ్చినప్పుడు వర్షపు నీరు నిండిపోయి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. ఆ సమస్యను స్వయంగా పరిశీలించి రూ. కోటి రూపాయల తో సిమెంటు రోడ్డు, కల్వర్టులు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపా మన్నారు . గ్రామాలలో ప్రజలందరి సహకారంతోనే సమగ్ర గ్రామీణా భివృద్ధిని సాధించవచ్చున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తూ ఇది మంచి ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్నదని కొనియాడారు. మంచి ప్రభుత్వానికి ప్రజలందరూ అందగా నిలచి స్థానిక ఎన్నికలలో ఆశీర్వదించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు అవినీతి, అరాచకాలు సాగించారని ..... కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, ప్రజా పాలన సాగిస్తున్నదని పేర్కొన్నారు. మీ భూమి... మీ హక్కు కార్యక్రమంలో రైతన్నలకు రాజు ముద్ర తో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలోని రైతన్నల అభీష్టం మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దు చేసి గ్రామాలలో సమగ్ర రీ సర్వేన నిర్వహించి రైతులకు క్యూఆర్ కోడ్ తో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాన్ని పంపిణీ అందిస్తున్నదని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యే పులివర్తి నానిని గ్రామస్తులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ ఎం ఈ డైరెక్టర్ ఎన్ చిన్నబాబు సింగల్ విండో చైర్మన్ చేకూరు జనార్ధన్ చౌదరి, రావిళ్ళ గిరినాయుడు, ఆర్ నీలకంఠ చౌదరి, జయచంద్ర నాయుడు, బండి విజయ్ కుమార్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సి వెంకట ప్రసాద్, ముని చంద్ర నాయుడు, నాగభూషణం, రామ్మోహన్ నాయుడు, వీరరాఘవుల నాయుడు డి ఈ ఈ మురళి, ఎంపీడీవో గిడ్డయ్య, తహశీల్దార్ మధుసూదన్ రావు, మండల స్థాయి అధికారులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# చింతవరంలో ఉచిత ఖత్నా కార్యక్రమం

## 20మంది చిన్నారులకు సున్తీ...

## ముతవల్లి కమిటీ నియోజకవర్గ అధ్యక్షులు ఎండీ. అబ్దుల్ రహీమ్

## ముతవల్లీ కమిటీ సేవలు స్ఫూర్తిదాయకం

## రేస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరెస్పాండంట్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు



చిల్లకూరు మండలం చింతవరం గ్రామంలో నిరుపేద ముస్లిం చిన్నారులకు ఉచిత ఖత్నా (ఒడుగులు) కార్యక్రమాన్ని శనివారం ముతవల్లీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గూడూరు నియోజకవర్గ ముతవల్లి కమిటీ అధ్యక్షులు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ అబ్దుల్ రహీమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అధికంగా నిరుపేద ముస్లిం సోదరులు ఉన్నారని, వారి పిల్లలకు ఖత్నా చేయించాలంటే కనీసం ఐదు నుండి పదివేల రూపాయల వరకూ ఖర్చవుతుందాన్నారు. ఈ మొత్తాన్ని ముస్లిం పేద కుటుంబాలు ఖర్చు పెట్టే స్థితిలో లేరన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గత మూడేళ్లుగా చింతవరంలో ముతవల్లి కమిటీ ఆధ్వర్యంలో పేద పిల్లలకు ఉచితంగా ఒడుగులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రేస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఖత్నా కార్యక్రమం నిర్వహించేందుకు అవకాశం కల్పించడం పట్ల ఆ స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. రేస్ స్కూల్ కరస్పాండంట్ బాల చెన్నయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని ముస్లిం పిల్లలకు తమ స్కూల్లో ఉచితంగా విద్యనందిస్తామని ప్రకటించారు. అలాగే లాభాపేక్ష కు చోటులేకుండా పేద కుటుంబాల పిల్లలకు తక్కువ ఫీజులతో విద్య అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. అనంతరం నెల్లూరు నుండి విచ్చేసిన వైద్యులు లతీఫ్ 20 మంది చిన్నారులకు ఖత్నా చేశారు. ఈ కార్యక్రమంలో ముతవల్లి కమిటీ నియోజకవర్గ అధ్యక్షులు ఎండీ. అబ్దుల్ రహీమ్, జీలాని బాషా, మౌలా, అమీరుద్దీన్, షబ్బీర్, చినిగిషా, సుబహాన్, డాక్టర్ లతిఫ్ చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# జన గణనకు ప్రజలు సహకరించాలి

## -మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,




దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన 2027 లో భాగంగా ఇంటి వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సరైన సమాధానం ఇచ్చి సహకరించాలని గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సూచించారు శనివారం గూడూరు మున్సిపల్ కార్యాలయం లోని కమిషనర్ చాంబర్ లో కమిషనర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనగణన 2027 ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు స్వీయ ఘటన కార్యక్రమం ముగిసిందని మే ఒకటి నుండి ఇంటింటికి వచ్చి ప్రభుత్వం నియమించిన ఎన్యూమరేటర్లు 33 అంశాలతో తో కూడిన సమాచారాన్ని సేకరిస్తారని ఆ సమాచారం కూడా గోప్యంగా ఉంచుతారని ఆయన తెలిపారు అందుకు ప్రజలు సహకరించి సమాచారం అందించాలని కమిషనర్ తెలిపారు.

# వెలుగు సిబ్బందికి మొబైల్ ఫోన్ అందించిన ఎమ్మెల్యే




ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వెలుగు ప్రాజెక్టును ప్రవేశపెట్టారని దీని ద్వారా రాష్ట్రంలో ఎంతో మంది మహిళలు ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదిగారని పనిచేసే ముఖ్యమంత్రిని ప్రజలు గుర్తుంచుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెలుగు ప్రాజెక్టులోని వివో ఏ లకు 5 జి మొబైల్స్ ను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందజేశారు పలు అంశాల గురించి చర్చించారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ వెలుగు ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించి మహిళలకు రుణాలు మంజూరు చేసి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు గత వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి లేదని అన్నారు అలాగే వెలుగు ప్రాజెక్టులో ఎంతోమంది ఉద్యోగాలు పొంది జీవనం సాగిస్తున్నారని మహిళల అభివృద్ధికి టిడిపి పార్టీ ముందుంటుందని అన్నారు ఆస్తిలో సమాన హక్కు ఉచిత గ్యాస్ మరియు బస్సు ప్రయాణం కూటమి ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు రహీం కిషోర్ నాయుడు మధుసూదన్ రెడ్డి ,నరసింహులు ,లీలావతి ,మట్టం శ్రావణి ,వెలుగు సిబ్బంది పాల్గొన్నారు

# కిశోరి వికాసం పోస్టర్ల ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి కలెక్టరేట్.

శనివారం స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ ఛాంబర్ నందు కిశోరి వికాసం పోస్టర్ల ను ఆవిష్కరించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మే 1 నుంచి జూన్ 11 వరకు జరిగే కిశోరి వికాసం ప్రత్యేక వేసవి శిబిరాన్ని బాల బాలికలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.



కౌమార బాలల వికాసమే లక్ష్యంగా కిశోరీ వికాసం కార్యక్రమం రూపొందించారని తెలిపారు. వివిధ శాఖల సమన్వయం తో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ తెలిపారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధిలో ఈ శిబిరాల్ని నిర్వహించాలన్నారు. మహిళా హక్కులు-సమానత్వం, ఆరోగ్య సంరక్షణ, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, విద్యావకాశాలు, సైబర్/ ఆన్లైన్ భద్రత, ఆర్థిక నిర్వహణ- స్వావలంభన తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి శ్రీమతి ఎస్. వసంత బాయి పాల్గొన్నారు.

# చంద్రగిరిలో ఎమ్మెల్యే నాని అండతోనే భౌతిక దాడులు..!

- మీడియా ముందు ప్రశ్నిస్తే హత్యాయత్నంకు పాల్పడతారా..?
- మాధవ నాయుడుపై దాడిచేసిన టీడీపీ గుండాలను అరెస్టు చేయాలి
- అలా చేయకుంటే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతాం
- ప్రశాంతతను కోరుకునే చంద్రగిరిలో రౌడీలు రాజ్యమేలుతున్నారు
- భౌతిక దాడులపై మండిపడ్డ రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ నేత చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి..



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:



ప్రశాంతంగా వుండాల్సిన చంద్రగిరిలో రౌడీలు రాజ్యమేలుతున్నారు. ఎమ్మెల్యే నాని అండతో భౌతిక దాడులకు పాల్పడతూ రాక్షసానందం పొందుతున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పాలన సాగిస్తున్నారనడానికి తమ పార్టీ నేత మాధవ నాయుడుపై జరిగిన హత్యాయత్నం ఒక ఉదాహరణగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పేర్కొన్నారు. పాకాల మండలం ఆదెనపల్లి పంచాయతీ శ్రీనివాసపురంకు చెందిన జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి మాధవ నాయుడుపై శుక్రవారం మండల పరిధిలోని తొండవాడ సమీపంలో హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆ విషయంపై పోలీసులను కలసి ఫిర్యాదు చేయడానికి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డితో పాటు పార్టీ నేతలు శనివారం చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. తమ పార్టీ రైతు నాయకునిపై హత్యాయత్నానికి పాల్పడిన ఎమ్మెల్యే అనుచరులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆపై బాధితుడు, పార్టీ శ్రేణులతో కలసి సీఐ సురేష్ కుమార్ కు ఫిర్యాదు అందజేశారు.

**- ప్రెస్‌మీట్లు పెడితే అంతు చూస్తారా..? చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి**

చంద్రగిరి పోలీస్ స్టేషన్ ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడితే అంతు చూస్తాం అంటూ గుర్తు తెలియని వ్యక్తులు దాడులు చేసి హత్యాయత్నానికి పాల్పడుతుండటం దుర్మార్గమన్నారు. తమ పార్టీ నాయకులు మాదవ నాయుడును తొండవాడ సాయిబాబా ఆలయం వద్ద కొందరు వ్యక్తులు చుట్టుముట్టి దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. మాధవనాయుడు నోటి నుంచి రక్తం కారుతున్నా వదలకుండా దాడికి తెగబడ్డారని, నానీ అన్నపై ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడుతావా..? నీ అంతు చూస్తాం.. అంటూ దుండగులు పళ్లు రాలగొట్టడం ఎంత వరకు న్యాయమన్నారు. ఇలాంటి దుశ్చర్యలు ప్రజాస్వామ్యంలో హేయమైనవిగా పరిగణించాలన్నారు. రక్తంతో తడిసిన బట్టలతో చంద్రగిరి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న మాధవ నాయుడు, పోలీసుల సూచన మేరకు చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే నాని అవినీతిపై మీడియా సమావేశంలో మాట్లాడినందుకే అతనిపై దాడి చేశారన్నారు. ఎమ్మెల్యే తప్పులను ప్రశ్నించినందుకు మాధవ నాయుడుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పాలన సాగిస్తున్నారనడానికి ఇదే ఒక్కటే నిదర్శనమని మండిపడ్డారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయకుంటే సోమవారం చంద్రగిరి పోలీస్ స్టేషన్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. చంద్రగిరి చరిత్రలో ఇలాంటి సంస్కృతి ఎన్నడూ లేదని, పులివర్తి నానీ ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. చంద్రగిరి ప్రజలు ఎప్పుడూ ప్రశాంతతను కోరుకుంటారని, ఇప్పుడు రౌడీలు రాజ్యమేలుతున్నట్టుగా వుందని ఆరోపించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను కాపాడుకోవడానికి ఎంత దూరమైనా వెళతామని, ఇలాంటి దాడులు ఎవ్వరికీ మంచిది కాదన్న విషయం ఎమ్మెల్యే నానీ, ఆయన అనుచరులు గుర్తుంచుకోవాలని సూచించారు.

**వైఎస్సార్‌సీపీకు ఏజెంట్‌గా ఉన్నందుకే...**

గత ఎన్నికల్లో ఎమ్మెల్యే నాని స్వగ్రామంలోని పోలింగ్ బూతులో వైఎస్సార్‌సీపీకి బూత్ ఏజెంట్‌గా, ఎన్నికల్లో కౌంటింగ్ ఏజెంటుగా కూర్చున్నందుకే తనపై ఎమ్మెల్యే నాని, ఆయన అనుచరులు కక్ష కట్టి దాడికి పాల్పడ్డారని బాధితుడు మాధవ నాయుడు మీడియాకు చెప్పారు. గతంలోనే తనపై రెండు సార్లు దాడికి యాత్నించారని, ఇప్పుడు పక్క వ్యూహంతో చంపేందుకు తెగబడ్డారన్నారు. ఇదంతా ఎమ్మెల్యే నానీ పనేనని, ఆయన అనుచరుడు రామిరెడ్డి అనే వ్యక్తి తనపై దాడి చేయించాడని స్పష్టం చేశాడు. ఇలా వెనుక నుంచి వచ్చి కొట్టడం నాయకత్వ లక్షణం కాదని, తమ నాయకుడు చెవిరెడ్డి అణచిపెడుతున్నాడు కాబట్టే.. టీడీపీ వాళ్లు ప్రశాంతంగా ఉన్నారంటూ మండిపడ్డాడు. ఇలాగే దాడులు చేస్తుంటే ప్రతిదాడులు చేయక తప్పదని, అదే విషయం పోలీసులకు కూడా చెప్పడం జరిగిందన్నారు. చంద్రగిరి సీఐ తప్పకుండా దాడి చేసిన వారిని అరెస్టు చేస్తామని తెలిపినట్లు ఆయన వివరించారు. చట్టం అధికారానికిభానిసైతే.. తాము ఏమిటో కూడా చూపిస్తామని హెచ్చరించారు.

# ముఖ్యమంత్రి సహాయానిధి 23వ విడత 32 చెక్కులను లబ్దిదారులకు క్యాంప్ కార్యాలయం నందు పంపిణీ చేసిన ఎమ్మెల్యే- డాక్టర్ పాశిం సునీల్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,




అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 15 లక్షల 69 వేల 932 రూపాయుల- 32 చెక్కులను పంపిణీ చేసిన గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు మరియు రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి పాశిం సునీల్ కుమార్.

చిట్టమూరు మండలం లబ్దిదారుని వివరాలు...

చెను వెంకటయ్య,మల్లం,35030

సన్నారెడ్డి మంజుల,గుణపాటిపాలెం,129476

వాకాడు మండలం లబ్దిదారుని వివరాలు...

రంగమగారి రణెమ్మ,అంజలపురం,125307

అట్లా మెనెమ్మా,కొండపురం,65061

కుక్కతోట్టి మునిరత్నం,నలగమల,41658

డంపాల సులోచనమ్మ,గంగన్న పాలెం,30028,

షేక్ జబీనా,కల్లూరు,23920

కోట మండలం లబ్దిదారుని వివరాలు...

మరుబోయిన రమేష్, నెల్లూరు పల్లి కొత్తపాలెం, 54896

గుడపాకల రాజేశ్వరి,ఎ.ఎస్. పురం,30028

బండి చెంచయ్య,రాఘవపురం,47375

బట్ట వెంకటేశ్వర్లు,రుద్రవరం,43795

షేక్ చందిని,కోట,34501

చెవురు మస్థానమ్మ,కర్లపూడి,30028

సుల్లూరు రాజయ్య,లక్ష్మక్క కండ్రిగా,91138

చిల్లకూరు మండలం లబ్దిదారుని వివరాలు...

కందల లక్ష్మీ నరసమ,కలవకొండ,40975

జక్కంరెడ్డి రాధమ్మ,కడివేడు, 67779

పెల్లెటి వెంకట కృష్ణ రెడ్డి,బల్ల వోలు,71758

కలగుంట వెంకట సుబ్బయ్య, ముత్యాలపాడు,40896

ఎదురు రక్షిత చైల్డ్ జ/శీ నళిని,తిమ్మన్న గారి పాలెం, 41195

కల్లూరు సంతమ్మ,తోనుగుమల,20688

గోసుల కార్తికేయ (బాల) జ/శీ గోసుల శ్రావణి, వల్లిపెడు,43084

గూడూరు మండలం లబ్దిదారుని వివరాలు.

మోలకల శిశువు చెంద్ర కల,తుంగ పాలెం, 40000

నోసినా మధురవాణి,నెర్నూరు,20460

దేవల్ల వెంకటమ్మ,చెన్నూరు,20524

కట్టాసుబ్రమణ్యం,చెన్నూరు,48341

మోడిబోయిన వెంకట రత్నమ్మ,విందురు,81363

శ్రీహరి కోట శివయ్య,వెండోడు,41084

గూడూరు పట్టణం లబ్దిదారుని వివరాలు...

షేక్ హసీనా బీగం (మరణం) షేక్ మసూద్, నరసింగరావు పేట,21000

పటాన్ మస్తాన్,ఇందిరా నగర్,30000

కొండూరు బాల వెంకట మోహన్ రాజు,జన కిరామ్ పేట,20101


మంగిలిపుడి ఉమామహేశ్వరి,ఎన్.జె.ఆర్ కాలనీ, 113443

బట్టా ప్రభాకర్,అరుంధతి పాలెం,25000

ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఎంతో ఖర్చుతో కూడిన చికిత్స చేయించుకోవటం కోసం ఎమ్మెల్యే ని సహాయం కోసం అడిగితే అడిగిన వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తమకు ఆర్థిక సహాయం అందజేశారని, వారు చేసిన సహాయం ఎప్పటికీ మర్చిపోమని ఈ సందర్భంగా సునీల్ కుమార్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# బడి పిలుస్తోంది ప్రచార రథాన్ని శ్రీకాళహస్తి బాలుర ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.



శ్రీకాళహస్తిలో ఘనంగా బడి పిలుస్తుంది ఇంటింటికి ప్రచార రథం ఎన్రోల్మెంట్ డ్రైవ్ శ్రీకాళహస్తి బాలురు ఉన్నత పాఠశాల నుండి ప్రారంభం ఈ కార్యక్రమాని శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు ఉమ్మడి జిల్లా చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె వి ఎన్ కుమార్ ప్రభుత్వ బడుల బలోపేతం కొరకు ప్రచార రథాన్ని ర్యాలీని ప్రారంభించారు వారి సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోనే పిల్లలందరినీ చేర్చడమే లక్ష్యంగా వారు తెలిపారు ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు గురించి వివరించారు ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ బ్యాగ్ యూనిఫామ్ మూడు జతలు టెక్స్ట్ బుక్స్ నోట్ బుక్స్ షూ స్కూల్ బ్యాక్ ఉచితంగా అందిస్తారు ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో తల్లికి వందనం ప్రతి విద్యార్థికి పాఠశాలలో మధ్యాహ్నం డొక్కా సీతమ్మ నాణ్యమైన భోజనం వారానికి ఐదు కోడిగుడ్లు వేరుశనగ చిక్కెలు రాగి జావా అందిస్తారని స్మార్ట్ టీవీలు ద్వారా డిజిటల్ విద్యా బోధన దూరప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం ప్రతి శనివారం నో బ్యాగ్ డే విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించే కార్యక్రమాలు ఆటపాటలు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు ఒకేషనల్ కోర్సులు విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు యోగా కెరియర్ గైడెన్స్ హెల్త్ కౌన్సిలింగ్ బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు ప్రచార రథం పట్టణంలో పలు ప్రాంతాల పాఠశాలలో ప్రచార రథం ద్వారా ప్రచారం నిర్వహించి గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిరుపేద విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్చేందుకు అల్లిమడుగు చిన్నమెట్ట కండ్రిగ వేదం ఎగువ వీధి తొండమనాడు అక్కుర్తి గిరిజన కాలనీ మన్నవరం వేలం పాడు తదితర పాఠశాల ప్రాంతాల్లో ఇంటింటికి ప్రచార రథం ద్వారా మైక్ లో ప్రచారం నిర్వహించారు చైతన్య గీతాలు పాడుతూ విద్యార్థులను ఆకట్టుకున్నారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు శ్రీమతి భువనేశ్వరి బాలయ్య ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య కృష్ణయ్య శ్రీనివాసులు పట్టణంలోని పలువురు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సిఆర్పిలు మునిమోహన్ ప్రదీప్ కుమార్ గాంధీ కృష్ణయ్య సునీత లలిత శాంతి ప్రగతి స్వచ్చంద సంస్థ కోఆర్డినేటర్లు చంద్రశేఖర్ కో కన్వీనర్ రామచంద్ర పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు తల్లిదండ్రులు, విద్యార్థులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు చేర్పించాలని ప్రచారం నిర్వహించారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

## -- వారి ఆర్థికాభివృద్ధికి ప్రణాళిక - కలెక్టర్ నిశాంత్ కుమార్ - ఎస్సీ ఎస్టీ కేసులు సత్వరమే విచారణ: ఎస్పీ




మదనపల్లె, ప్రజాభూమి ప్రతినిధి :- జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదైన కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో భాగంగా సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. ఎఫ్ఐఆర్ కాగానే బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా అధికారుల దృష్టికి తీసుకురావాలని డివిఎంసి కమిటీ సభ్యులకు సూచించారు. 2025 సెప్టెంబర్ 10 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వరకు జిల్లాలో మొత్తంగా 14 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు అయి విచారణ దశలో ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కేసువారీగా పరిష్కార చర్యలపై చర్చించారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసులతో పాటు సంబంధిత శాఖాధికారులు చొరవ తీసుకోవాలని చెప్పారు. ఎప్పటి కప్పుడు ఛార్జిషీట్ దాఖలు చేయడంతో పాటు నిర్ణీత సమయంలోగా కేసులను పూర్తి చేయాలన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చూడాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో ప్రతినెల క్రమం తప్పకుండా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రాలను సంబంధిత తహశీల్దారులు వెంటనే జారీ చేయాలని, డివిజన్ స్థాయి అధికారులు దీనిని పర్యవేక్షించాలన్నారు. స్పీడ్ కేసులలో త్వరితగతిన జడ్జిమెంట్ వచ్చేలా పోలీస్, న్యాయశాఖ పిపీలు కృషి చేయాలని తెలిపారు. ఎస్సీ ఎస్టీలు ఆర్థికాభివృద్ధి చెందేలా తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జలధార కార్యక్రమం వల్ల జిల్లాలో భూగర్భ జలాలు, నీటి వనరులు పెరిగాయని, ప్రతి గ్రామంలో ఆసక్తి గలవారికి పాలిచ్చే పశువులు పెంచుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఎస్సీ ఎస్టీలను కూడా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. మాన్సూన్ సీజన్ మొదలయ్యేలోపు ఆసక్తి గలవారు ముందుకు వస్తే డిఆర్డిఏ శాఖ ద్వారా ఎస్సీ ఎస్టీల మహిళ సంఘాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎలాంటి జాప్యం లేకుండా విచారణ చేస్తున్నామన్నారు. ఇప్పటికే అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించిన ఎలాంటి సమాచారం అయినా తమ దృష్టికి తీసుకురావాలని సభ్యులను కోరారు. ఇప్పటికే నమోదైన అండర్ ట్రయల్ కేసులు, వాటి పరిష్కారం కొరకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్డిపిఓలు, డీవీఎంసీ సభ్యులతో సమీక్షించారు. ఎస్సీ ఎస్టీ కేసుల ప్రగతి, తీసుకున్న చర్యలపై డివిఎంసి సభ్యులు అడిగిన సందేహాలకు కలెక్టర్, ఎస్పి సందేహ నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.శ్రీరాములు, డీఎస్పీలు, డివిఎంసి సభ్యులు వెంకటరమణ, రామకృష్ణ, శ్రీనివాసులు, రాజశేఖర్, చంద్రశేఖర్ బోడేషావలి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

# ప్రభుత్వ పాఠశాలలో చదివి టెన్త్ టాపర్ల గా నిలిచిన విద్యార్థి కుటుంబాలకు ఎమ్మెల్యే షాజహాన్ భాష అపూర్వ కానుక..

మదనపల్లి, ప్రజాభూమి ప్రతినిధి



మొదటి మూడు ర్యాంకులు సాధించిన వారికి రెండు సెంట్లు భూమి ఇంటి నిర్మాణం కోసం మూడు లక్షల రూపాయలు మంజూరు చేయిస్తానని పదో తరగతి మెరిట్ విద్యార్థుల అభినందన సభలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష టెన్త్ పేపర్లకు కానుకను ప్రకటించారు..మొదట మూడు ర్యాంకులు సాధించిన ఆది విష్ణు, షేక్ హుస్నా, కావ్య, షేక్ సాజియా లకు రెండు సెంట్లు భూమితో పాటు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు మూడు లక్షల రూపాయలు రుణాన్ని ఇప్పిస్తానని ప్రకటించారు..ఇటీవల విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 550 పైగా మార్కులు సాధించిన మదనపల్లి, రామసముద్రం, నిమ్మనపల్లి మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు శనివారం ఉదయం మదనపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది.. నియోజకవర్గ పరిధిలో 70 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే షాజహాన్ భాష దుశ్యాలతో సత్కరించి, స్టడీ మెటీరియల్ బహుమతులుగా అందజేశారు.. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్ భాష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని అన్నారు... రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఆధ్వర్యంలో మన రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని అన్నారు , ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రవేటు పాఠశాలల విద్యార్థులకు పోటీగా మంచి మార్కులు సాధించడం హర్షించదగ్గ పరిణామం అన్నారు.. మదనపల్లి నియోజకవర్గంలోని ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులను కూడా దుశాలుగా సర్టిఫికెట్లతో సత్కరించారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో విద్యా రంగానికి పెద్ద పీట వేయడం జరుగుతుందని, దీనికి నిదర్శనం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన మార్కులే లని అన్నారు.. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కె సుబ్రహ్మణ్యం, మదనపల్లి, నిమ్మనపల్లి, రామసముద్రం, బి.కొత్తకోటలకు చెందిన ఎంఈఓ లు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, తెలుగుదేశం నాయకులు కత్తి లక్ష్మన్న, జెసిబి వేణు, ఎస్సార్ షంషీర్, నాదెండ్ల శివప్రసాద్, ఉర్దూ ఉపాధ్యాయుడు మహమ్మద్ ఖాన్, మల్లికార్జున నాయుడు, జాన్ బాబు, టైగర్ సురేందర్ రెడ్డి, రమేష్ రెడ్డి, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు...

# మోచంపేటలో కార్బన్ చర్చ్ నిర్వహించిన టూ టౌన్ పోలీసులు - జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్

ప్రజా భూమి, కడప సిటీ:



శుక్రవారం కడప జిల్లా ఎస్పీ షెల్కే నచ్చికేత్ ఆదేశాలతో కడప టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనిమోచంపేటలోకార్డన్ అండ్సెర్చ్ఆపరేషన్ తనిఖీ ల్లో సరైన రికార్డులు లేని 24 ద్విచక్ర వాహనాలు,2 ఆటోల స్వాధీనంచేసుకున్నారు. ట్రబుల్ మాంగర్లకు కౌన్సిలింగ్ ఇచ్చినారు. అనుమానితులు, పాతనేరస్థుల ఇళ్లలో తనిఖీలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీస కుంటామని పోలీసుల హెచ్చ రించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా శనివారం తెల్లవారుఝామున కడప టూ టౌన్ పరిధిలోని మోచంపేట రఖీబ్ షా వలి దర్గా సమీపంలో కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించా రు. కడప ఇంచార్జ్ డి.ఎస్.పీ ఇ.బాలస్వామి రెడ్డి నేతృత్వం లో టూ టౌన్ సి.ఐ జి.ప్రసాద రావు ఆధ్వర్యంలో ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా కార్డన్ అండ్సర్చ్ఆపరేషన్నిర్వహించారు. పాతనేరస్తులు, అనుమానితుల ఇళ్లలో, అనుమానిత ప్రాంతాల్లో అణువణువూ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిం చారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. సరైన రికార్డుల లేని 24 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు స్వాధీనం చేసుకు న్నారు. ట్రబుల్ మాంగర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చట్టవ్యతిరేకకార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీస కుంటామని హెచ్చరించారు. ఎవరూ ఎలాంటి గొడవలకు, చట్టవ్యతిరేకకార్యకలాపాలకు పాల్పడకుండా మీరు మీ పను లు చేసుకుంటూ ఆర్థికంగా ఎ దిగి పిల్లల బంగారు భవిష్యత్త కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా టూ టౌన్ సి.ఐ జి.ప్రసాద రావు మాట్లాడుతూమాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తి ఆర్థికంగా, కుటుంబపరంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తి తనచర్యలపైనియంత్రణ కోల్పోయి అనేక అనర్థాలకు గురయ్యే ప్రమాదం ఉందని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థా ల అక్రమ రవాణా, విక్రయదా రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశా రు. రోడ్డు ప్రమాదాల నివారణ కు ప్రతి వాహనదారుడు తప్ప నిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం,మైనర్ డ్రైవింగ్, మ ద్యం సేవించి వాహనాలు నడ పకూడదని సూచించారు. సైబ ర్ నేరాలపై అప్రమత్తంగా ఉం డాలని, అపరిచితుల కాల్స్‌కు స్పందించి ఓటీపీలు చెప్పవద్ద ని హెచ్చరించారు. అలాగే ఆన్ లైన్ గేమ్స్,క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, ఆధార్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని తెలిపారు. త క్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పే మోసగాళ్లను నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని సూచిశీ చారు. ఈ సందర్భంగా ప్రజల తో కలిసి మత్తుకు దూరంగా ఉండాలి,మత్తు లేని సమాజా న్ని నిర్మిద్దాం అనే ప్రతిజ్ఞ చేయి శీచారు. అసాంఘికకార్యకలాపాలకు సంబంధించి, హను మానితుల సమాచారాన్ని డయల్ 112 ద్వారా పోలీస్ శాఖకు సమాచారమివ్వాలని సూచించారు. ఎవరూ రికార్డు లు లేని వాహనాలను కొనుగో లు చేయవద్దని కడప టూ టౌన్ సి.ఐ జి.ప్రసాద రావు సూచించారు. కార్డన్ అండ్ సర్చ్ తనిఖీల్లో కడప టూ టౌన్ సి.ఐ జి.ప్రసాద రావు , టూ టౌన్ ఎస్.ఐ రఫీ, ట్రాఫిక్ ఎస్.ఐ నాగరాజు, ఈగల్ టీమ్ గురు కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెంచిన వాణిజ్య గ్యాస్ ధర వెంటనే తగ్గించాలి బిబియూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్వర్ డిమాండ్.

ప్రజాబుది పోరుమామిళ్ల :



ఓట్లకోసం వేషం కట్టి ఓట్లు ముగిశాక జనాల నెత్తిన భారం మోపడం ప్రధాని మోడీజీ కి వెన్నతో పెట్టిన విద్య అని పెంచిన వాణిజ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్వర్ డిమాండ్ చేశారు. 5 రాష్ట్రాల ఎన్నికల తర్వాత గ్యాస్ బండ బాదుడు దేశ ప్రజలకు కేంద్రం ఇచ్చిన అతిపెద్ద గిఫ్ట్ అని ,వాణిజ్య గ్యాస్ సిలిండర్ మీద ఒకేసారి రూ. 993 , 5 కిలోల మినీ సిలిండర్ మీద రూ. 549 పెంచిన ఘనత భారతీయ జనతా పార్టీ మోడీ ప్రభుత్వానికే దక్కిందనీ ఆయనమండిపడ్డారు. ఆరు నెలల్లో రూ.1513 పెంచడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అని ఈ ఏడాదిలోనే ధర 80 శాతం పెంచిన మోడీ ఘనకార్యానికి, వాణిజ్య గ్యాస్ ధర రూ. 3251 చేరిందని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి అద్భుతాలకు గుర్తుగా దేశంలోని ప్రతి మ్యూజియంలో మోడీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలి అని ఆయన అన్నారు. మోడి పెట్టిన వాణిజ్య మంటలు సామాన్య ప్రజలకు బయట తినేవారికి భయం పుట్టిస్తున్నాయని విద్యార్థులు, వలస కార్మికుల నడ్డి విరిచి టీ స్టాల్స్, మినీ హోటల్స్ లాంటి చిన్న వ్యాపారుల జీవితాల తో మోడీ ప్రభుత్వం ఆటలాడుతుందని ఆయన మండిపడ్డారు. ఇంధన ధరలు తక్కువగా ఉన్నప్పుడు లాభాలు దండుకున్న మోదీ ఇప్పుడు చమురు ధరలు పెరిగాయని ధరాభారాన్ని ప్రజల నెత్తిన వేయడం ఎంత వరకు సమంజసం అని ఆయన అన్నారు. కేంద్రం తక్షణమే స్పందించి పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన ఆయన డిమాండ్ చేశారు.

# దేవస్థాన భూములు కబ్జాకు గురికాకుండా రక్షించాలి - ఈవోకు వినతి

## - బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానానికి అనుసంధానమైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూములు కబ్జాకు గురికాకుండా రక్షించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ కోరారు. ఈ మేరకు శనివారం భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులతో కలిసి దేవస్థాన ఈవో కడప సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న దేవస్థాన షాపింగ్ కాంప్లెక్స్ వెనుక వైపు ప్రైవేట్ వ్యక్తులు నిర్మాణాలు చేపడుతూ ఆలయ భూములను ఆక్రమిస్తున్నారని వారు ఆరోపించారు. అలాగే దేవస్థానానికి చెందిన 20 అడుగుల రహదారి కూడా కొంతమేర ఆక్రమణకు గురైందని తెలిపారు. సర్వే నెంబర్ 416లో ఉన్న 70 సెంట్ల స్థలాన్ని కూడా కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ భూములను రక్షించాలని, కంచె ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి విశ్వనాథ రెడ్డి, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ దివాకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.



# జలదార జలహారతి కార్యక్రమంలో భాగంగా సప్లై ఛానల్ పూడికతీత పనులకు ఎమ్మెల్యే షాజహాన్ భాషా చేతుల మీదుగా భూమి పూజ..

మదనపల్లి, ప్రజాభూమి ప్రతినిధి :- మదనపల్లి గ్రామీణ మండలంలో వర్షాకాలంలో చెరువులను నింపేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిన ఇరిగేషన్ శాఖ అధికారులు.. బసిని కొండకు చెందిన తెదేపా నేత కత్తి లక్ష్మన్న సొంత నిధులతో రెండున్నర కిలోమీటర్లు సప్లై ఛానల్ పూర్తిగా పనులకు శనివారం ఎమ్మెల్యే షాజహాన్ భాష భూమి పూజ చేశారు... అందరినీవా కాలవ సమీపం



లోని సద్దలచెరువు, రెడ్డి చెరువు, వడ్డీ చెరువు, తాటి చెరువు, బుచ్చమ్మ చెరువు, పాముల చెరువు మీదగా పెద్ద చెరువు వరకు సప్లై ఛానల్ పూడిక తీత పనులను దాత లక్ష్మన్న జెసిబి పనులను ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ భాషా కత్తి లక్ష్మన్నను శాలవతో సత్కరించి , అభినందించారు, దాతలు ముందుకు వచ్చి చెరువు సప్లై ఛానల్ బాగు చేసుకునేందుకు సహకారం అందించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్ మస్రోర్, ఇరిగేషన్ ఏఈ రాయల్ బాబు రాజేంద్రప్రసాద్, ఏపీఎం, తెలుగుదేశం నాయకులు విజ్జి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు...

# ఇనగలూరు-అగడూరు రోడ్డుపై వాహనదారుల అవస్థలు



ప్రజా భూమి తొండూరు : తొండూరు మండల పరిధిలోని ఇనగలూరు నుండి అగడూరు వెళ్లే రోడ్డు పనులను అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్,రోడ్డుపై కంకర మాత్రమే పరిచి తారు రోడ్డు వేయకుండా వదిలేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో కంకర రాళ్లు లేచిపోయి ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్నారని,కార్లు,ఆటోల టైర్లు పంక్చర్ అవుతున్నాయని వాపోతున్నారు."రోడ్డు వేస్తున్నారని సంబరపడ్డాం. కానీ కంకర పోసి నెల రోజులైనా తారు వేయలేదు. ధూళితో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. పిల్లలు,వృద్ధులు దగ్గుతో బాధపడుతున్నారు. రాత్రివేళ ప్రమాదాలు జరుగుతున్నాయి" అని ఇనగలూరు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

# పులివెందులలో నేడు అమ్మవారికి చల్లబోనం సమర్పణ

## పులివెందుల పట్టణంలో ఎక్కడ జంతుబలి జరగకూడదు

ప్రజాభూమి,పులివెందుల

పట్టణంలో అమ్మవారు ఎక్కువగా ఉన్నందున, అమ్మవారిని చల్లబరిచేందుకు చల్ల బోనం సమర్పించుటకు దేవర కమిటీ నిర్ణయించినది అని కమిటీ సభ్యులు తెలియజేశారు. నేడు ఆదివారం ఉదయం 6 గంటలకు స్థానిక పులివెందుల పట్టణంలోని శ్రీ కృష్ణ దేవరాయ బలిజ సంఘం దగ్గరకు బోనాలు తీసుకుని వస్తె, మేళ తాళాలతో ఊరేగింపుగా వెళ్ళి అమ్మవార్లకు చల్ల బోనాలు సమర్పించి, అమ్మవార్లను శాంత పరచడం జరుగుతుందని, కావున ఆదివారం పట్టణంలో ఎటువంటి జంతు బలి చేయరాదని వారు ప్రజలను కోరారు. అలాగే మాంసాహార విక్రయాలు కూడా చేయరాదని,మాంసం విక్రయించే దుకాణాలు అన్ని మూసివేయాలన్నారు.

**చల్ల బోనం తయారు చేసే విధానం**

కొత్తమట్టి కుండను తీసుకొని, దాన్ని శుభ్రంగా నీటితో కడిగి ఆరబెట్టాలి. తర్వాత ఉప్పు లేకుండా అన్నం వండాలి. అన్నం వండిన తర్వాత మట్టి కుండకు పసుపు పట్టించి, కుంకుమతో 5 బొట్లు పెట్టి, తెల్ల దారంను 5 పోగులు తీసుకుని, పసుపును పట్టించి, దానికి ఒక తమలపాకును , వేపమండ, కొన్ని పూలను తీసుకుని ముడి వేసిన దారంను మట్టి కుండకు అలంకరించాలి. వండిన అన్నం చల్లారిన తర్వాత మట్టి కుండలోకి తీసుకుని, ఉప్పు లేకుండా పెరుగుతో కాస్త జిగటగా ఉండేలా కలిపి, ఒక ఎర్రగడ్డను అందులో ఉంచాలి. కుండపైన ఒక మూకటిని మూసి ఉంచాలి. ఇలా అమ్మవారి చల్ల బోనంను తయారు చేసుకోవాలి.

# రచయిత బొల్లు రామ్మోహన్ కి అరుదైన గౌరవం

ప్రజాభూమి పోరుమామిళ్ల :



పద కవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల వారి 618 వ జయంతి ఉత్సవాలలో పోరుమామిళ్లవాసి బొల్లు రామమోహన్ రచయిత ను ఘనంగా సత్కరించారు. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, తెలుగు భాషా చైతన్య సమితి, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హల్,హైదరాబాద్. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్ర కుమార్ పైడిపాటి ప్రముఖ సినిమా మాటల రచయిత, దర్శకులు. కేశిరాజు రాంప్రసాద్ జాతీయ తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షులు. బైలూరి యోగేశ్వర ప్రభు ప్రముఖ ప్రవచనకర్త. డాక్టర్ ఎన్ బాలా చారి తెలంగాణ సాంస్కృతిక అకాడమీ కార్యదర్శి. ప్రముఖ రచయితలు కవులు పాల్గొన్నారు.

# నాదెండ్ల భాస్కర్ రావు దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న చలపతి

ప్రజాభూమి, వేంపల్లె

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు దశదిన కర్మ కార్యక్రమంలో జనసేన పార్టీ నేత పోతిరెడ్డి చలపతి పాల్గొన్నారు. శనివారం హైదరాబాద్ నగరం, జుబ్లీహిల్స్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వేంపల్లె మండల, ఇడుపులపాయ మాజీ సర్పంచ్, జనసేన పార్టీ నేత పోతిరెడ్డి చలపతి పాల్గొన్నారు. అనంతరం పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలిశారు. అలాగే వీరి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు.



ప్రజాభూమి

జనరల్

ఆదివారం, మే 03, 2026



# సమిష్టిగా పనిచేయాలి... 22 నెలల్లో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**
**పార్టీ నాయకులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం**

నిమ్మాడ ప్రజా భూమి ప్రతినిధి

పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో టెక్కలి మండల తెలుగు దేశం పార్టీ నాయ కులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పలు కీలక అంశా లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత 22 నెలల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఇంటికీ చేరుకుని ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను వివరించడం కార్యకర్తల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పారదర్శకమైన పాలన కొనసాగుతోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడడం లేదని అన్నారు. ఈ విషయాన్ని ప్రతి గడపకూ చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటేనే మంచి నాయకులుగా ఎదగగలరని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. మరింత సమన్వయంతో పని చేస్తూ, అభివృద్ధే అజెండాగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం అని అన్నారు. ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు రూ. 650 కోట్లతో ప్రతి ఇంటికీ తాగునీరు అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి వెల్లడించారు. అంతకుముందు సమావేశంలో కార్యకర్తల అభిప్రాయాలు, ప్రాంతంలో జరిగిన అభివృద్ధి పనులపై నాయకులతో కులంకుషంగా చర్చించారు. ప్రజల మన్ననలు పొందుతూ పార్టీ లక్ష్యాలను సాధించేందుకు అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.





### గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ మంత్రి

గత ఐదేళ్లలో రాష్ట్రంలో పూర్తిగా దుర్మార్గమైన, అవినీతి పాలన నడిచిందని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టి, ప్రజల సమస్యలను విస్మరించిన పాలన సాగిందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక్కటంటే ఒక్క ప్రామాణిక అభివృద్ధి కార్యక్రమం కూడా అమలు కాలేదని, ప్రభుత్వ వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. 2014–2019 మధ్య కాలంలో వేసిన అభివృద్ధి బాటను పూర్తిగా అడ్డగించిన గత ప్రభుత్వం, అనంతర కాలంలో గ్రామాల పరిస్థితిని దయనీయంగా మార్చిందని అన్నారు. కనీస మౌలిక వసతులు అయిన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ వంటి అంశాలపైనా పట్టించుకోలేదని, గ్రామాలను పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేసిందని తీవ్రంగా విమర్శించారు. ప్రజలను మోసం చేసే విధానాలతో కాలం గడిపిన ఆ పాలనను ప్రజలు ఎప్పటికీ క్షమించరని, అభివృద్ధిని అడ్డుకున్న వారిని ప్రజలు తిరస్కరించారని ఘాటుగా వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ బగాది శేషగిరిరావు, మామిడి రాము, పురుషోత్తం, జగదీశ్వరరావు, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ముంగిటకే

# పార్లమెంటు సభ్యుల వినతుల వెల్లువ.. తక్షణ పరిష్కారం

**ఎంపీ కార్యాలయంలో జనవాణి - సమస్యలు విన్న వల్లభనేని బాలశౌరి**
**పార్లమెంట్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజలు**
**అధికారులతో మాట్లాడి అప్పటికక్కడే పరిష్కార మార్గాలకు ఆదేశం**



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

మచిలీపట్టణం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి శనివారం మచిలీపట్టణంలోని తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిలిచారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఆయన స్వయంగా వినతులను స్వీకరించారు. సామాన్యుల సమస్యలకు స్పందిస్తూ, ప్రజా సేవలో తనకు సాటిలేరని మరోసారి నిరూపించుకున్నారు.సమస్య ఏదైనా.. పరిష్కారం ఖాయం ఉదయం నుండి ఎంపీ కార్యాలయానికి పార్ల మెంట్ పరిధిలోని పలు మండ లాల నుండి బాధితులు, విన్నవించుకునేందుకు వచ్చిన ప్రజలతో కార్యాలయం కిక్కిరిసిపోయింది. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలపై వచ్చిన వినతులను ఆయన సావధానంగా విన్నారు. వ్యక్తిగత సమస్యలు మరియు ఆరోగ్య సంబంధిత సహాయం కోరిన వారికి భరోసా కల్పిం చారు. ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి, సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను సత్వ రమే పరిష్కరించాలని ఎంపీ గారు ఆదేశించారు.ప్రజా సేవయే పరమావధిఈ సందర్భంగా ఎంపీ కార్యాలయ ప్రతినిధులు మాట్లాడుతూ, బాలశౌరి అందుబా టులో ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తమ సమస్యలను ఎంపీ దృష్టికి నేరుగా తీసుకెళ్లే అవకాశం కలగడంపై ప్రజలు హర్షం వ్య క్తం చేశారు. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తాను. అభి వృద్ధి, సంక్షేమమే నా బాట అని వల్లభనేని బాలశౌరి, మచిలీపట్టణం పార్లమెంట్ సభ్యులు తెలిపారు.



# రూరల్ పరిధిలో సందడి చేసిన పేర్ని కిట్టు

**పెళ్లి వేడుకల్లో వధూవరులకు ఆశీర్వాదం**
**కరగ్రహారం, పొట్లపాలెం, గొల్లగూడెంలో పర్యటన**
**వరుస వివాహ వేడుకల్లో పాల్గొన్న పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)నాయకులు, కార్యకర్తలతో కలిసి నూతన జంటలకు శుభాకాంక్షలు**



ప్రజాభూమి, మచిలీపట్టణం రూరల్

మచిలీపట్టణం రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పర్య టించారు. పలువురి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు.గ్రామాల వారీగా పర్యటన వివరాలుకరగ్రహారం గ్రామంలో జరిగిన కొల్లాల సుబ్బారావు వివాహ వేడుకకు పేర్ని కృష్ణమూర్తి హాజరయ్యారు. చిలంకుర్తి ఏడుకొండలు, పడమట రమేష్‌తో కలిసి వధూవరులను ఆశీర్వదించారు.పొట్లపాలెంలో మద్దంశెట్టి గంగయ్య కుమారుడి వివాహ వేడుకకు హాజరైన పేర్ని కృష్ణమూర్తి, నూతన జంటకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మట్ట నాంచారయ్య, చందన మస్తాన్, గాజుల నాగరాజు మరియు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.గొల్లగూడెం గ్రామంలో జరిగిన కుంభం వారి వివాహ వేడుకకు కూడా పేర్ని కృష్ణమూర్తి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.ఆయా గ్రామాల్లో కిట్టు పర్యటనతో స్థానిక కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. ఈ వివాహ వేడుకల్లో స్థానిక నాయకులు, అభిమానులు అనుచరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల గొప్ప నాయకుడ్ని కోల్పోయాం : వీరంకి గురుమూర్తి

**వల్లభనేని బాబూరావు మృతి పట్ల ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షుల ప్రగాఢ సంతాపం**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా



ఉమ్మడి కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు, కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వల్లభనేని బాబూరావు మరణం పార్టీకి, జిల్లాకు తీరని లోటు అని ఆంధ్రప్రదేశ్ గౌడ సంక్షేమ & అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ వీరంకి వెంకట గురుమూర్తి పేర్కొన్నారు. బాబూరావు గారి మృతి పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ తన నివాళిని అర్పించారు.ఆ దిశానిర్దేశం మరువలేనిది..ఈ సందర్భంగా వీరంకి గురుమూర్తి గత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. గత మార్చి 2వ తేదీన వారి నివాసంలో బాబూరావు ని కలిసిన క్షణాలు నా కళ్లముందే కదలాడుతున్నాయి. నన్ను ఎంతో ఆప్యాయంగా కూర్చోబెట్టి, కుశల ప్రశ్న లు అడిగి, జిల్లా రాజకీయ పరిస్థితులపై తన అనుభవాలను పంచుకున్నారు. భవిష్యత్తులో ఎలా ముందుకు సాగాలో ఆయన చేసిన దిశానిర్దేశం నా జీవితంలో మరువలేని స్మృతి అని భావోద్వేగానికి లోనయ్యారు.

పార్టీకి వెన్నుముకగా నిలిచారు..గుడ్లవల్లేరు మండల అధ్యక్షు డిగా, మిల్క్ సొసైటీ అధ్యక్షుడిగా బాబూరావు అందించిన సేవలు చిరస్మరణీయమని గురుమూర్తి కొనియాడారు. కార్యకర్తలపై ఆయన చూపిన ప్రేమ, పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం, క్రమశిక్షణ మనందరికీ ఎల్లప్పుడూ మార్గదర్శకమని తెలిపారు. నిన్ననే ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు స్వయంగా వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారని, కానీ ఇంతలోనే ఈ విషాద వార్త వినాల్సి రావడం బాధాకరమన్నారు.కుటుంబానికి ప్రగాఢ సానుభూతి..మహనీయుడైన బాబూరావు ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆశ యాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

# నగరాన్ని పరిశుభ్రంగా ఉంచకపోతే చర్యలు తప్పవు

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హెచ్చరిక**
**ఎలక్ట్రిక్ సైకిల్‌పై వార్డుల్లో కలెక్టర్ సుడిగాలి పర్యటన**
**గ్రీన్ స్పాట్ల అభివృద్ధిపై అసంతృప్తి..**
**అధికారులపై ఆగ్రహం**
**ప్రజలను భాగస్వాములను చేసి 'స్వచ్ఛ మచిలీపట్నం' సాధించాలి**



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

మచిలీపట్నం నగరాన్ని స్వచ్ఛ సుందర నగరంగా తీర్చిదిద్దే వరకు తాను విశ్రమించబోనని, అధికారులు నిర్లక్ష్యం వీడి చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ మరియు నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డీకే బాలాజీ స్పష్టం చేశారు. శనివారం ఉదయం ఆయన తన సిబ్బందితో కలిసి ఎలక్ట్రిక్ సైకిల్‌పై నగరం అంతటా పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా పలు వార్డుల్లో పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వార్డుల్లో సుడిగాలి పర్యటన:ముఖ్యంగా 37, 38, 39 డివిజన్లలోని పరాసుపేట, గాదె వారి వీధి, రుస్తుంబాద, కోనేరు సెంటర్, గొడుగుపేట, సర్వ వారి వీధి వంటి ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించి చెత్తాచెదారాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంపై ఆయన అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహంనగరంలో గ్రీన్ స్పాట్ల అభివృద్ధి నామమాత్రంగా ఉందని, గోడలకు రంగులు వేయడంలోనూ జాప్యం జరుగుతోందని కలెక్టర్ మండిపడ్డారు. వార్డు సచివాలయ సిబ్బందికి పారిశుధ్య పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించినా, వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ప్రతిరోజూ పర్యవేక్షణ ఉండాలి. ఎక్కడా చెత్త కనిపించకూడదు అని కఠిన ఆదేశాలు జారీ చేశారు.డాక్యుమెంటేషన్ తప్పనిసరిపారిశుధ్య పనుల్లో పారదర్శకత ఉండాలని కలెక్టర్ సూచించారు. చెత్త ఉన్న ప్రాంతాన్ని ఫోటో తీయాలని, దానిని శుభ్రం చేసి గ్రీన్ స్పాట్‌గా మార్చిన తర్వాత మళ్ళీ ఫోటో తీసి తప్పనిసరిగా డాక్యుమెంటేషన్ చేయాలని ఆదేశించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అపరిశుభ్రత లేకుండా ఎలక్ట్రికల్ ఎస్ఈతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రజలే భాగస్వాములు కావాలిఈ సందర్భంగా కలెక్టర్ స్థానికులతో ముచ్చటించారు. గ్రీన్ స్పాట్ల వద్ద చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఇంట్లో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మునిసిపల్ కార్మికులకు అందించాలి. ప్రజలు బాధ్యతగా వ్యవహరించినప్పుడే నగరం పరిశుభ్రంగా ఉంటుంది అని పిలుపునిచ్చారు. అధికారులు ప్రజలతో మమేకమై వారిని చైతన్యపరచాలని, అప్పుడే స్వచ్ఛ మచిలీపట్నం సాధ్యమవుతుందని అన్నారు.ఈ పర్యటనలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, స్వచ్ఛ సైనికుల ఇన్చార్జి ఫణి దూర్జటి, మునిసిపల్ ఇంజనీర్ కుబియా నాయక్, మాజీ కార్పొరేటర్ అన్నం ఆనంద్ మరియు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.




# సూర్యలంకలో స్థలంఇస్తే మినీస్టూడియోను నిర్మిస్తా

**మా ఏపి అధ్యక్షుడు దిలీప్ రాజా జిల్లా కలెక్టర్ తో చర్చలు**

అమరావతి ప్రజా భూమి ప్రతినిధి

సూర్యలంక బీచ్ దగ్గర ప్రభుత్వం స్థలం ఇస్తే సినిమాల చిత్రికరణ కోసం మినీ స్టూడియోను నిర్మిస్తానని 'మా- ఏపి'వ్యవస్థాపకులు సినీదర్శకుడు దిలీప్ రాజా తెలిపారు.ఈ మేరకు ఆయన బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ను కలెక్టర్ కార్యాలయంలో శనివారం స్వయంగా కలిసి చర్చించినట్లుగా చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధి జరగాలంటే అందమైన లోకేషన్లు ఉన్న ప్రదేశాల్లో సినిమా చిత్రీకరణకు కావాల్సిన మౌళిక సదుపాయాల కల్పన అవసరమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. సూ ర్య లంక బీచ్ లో ఎన్నో సన్నివేశాలను చిత్రీకరించవచ్చని ఆయన సూచి చారు. బీచ్ దగ్గర మండువాలోగిలి ఇల్లు,పోలీస్ స్టేషన్ సెట్లు నిర్మించడానికి తాను సిద్దంగా ఉన్నానని ఆయన వివరించారు.సముద్రనేపథ్యం ప్రేమికుల సన్నివే శాల చిత్రీకరణకు బ్రాండ్ అంబాసిడర్ గా సెల్యులాయిడ్ పై సినిమా చరిత్ర లో కనిపిస్తుందని దిలీప్ రాజా చెప్పారు.రాష్ట్ర టూరిజం శాఖ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టవలసిందిగా అయన ప్రభుత్వానికీ మనవి చేశారు.బాపట్ల జిల్లాలో పెనుమూడి కృష్ణానదీ తీరం,నిజాంపట్నం హార్బర్, పార్కులు, గార్డెన్స్, రైల్వే ట్రాక్ తదితర లోకేషన్లు సినిమా చిత్రీకరణకు అనుకూలంగా ఉన్నాయని ఆయన సూచించారు.దీనిపై ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తానని జిల్లా కలెక్టర్ చెప్పినట్లుగా ఆయన తెలిపారు.త్వరలో రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ త్వరలో బాపట్ల పర్యటనకు వస్తున్న నేపథ్యంలో సూర్యలంకలో మినీ స్టూడియో నిర్మాణం అంశాన్ని దృష్టికి తీసుకెళతానని జిల్లా కలెక్టర్ చెప్పినట్లు ఆయన తెలిపారు.జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో యుట్యూబర్ స్టైల్ రవి,నటులు చుండూరు రవి కుమార్ ,దానబోయిన అర్జునరావు ఉన్నారు.



# కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**రాష్ట్రవ్యాప్తంగా లేబర్ అడ్డాలు, ఈఎస్ఐ ఆసుపత్రులు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు వేగవంతం**
**20 లక్షల మందికి పైగా కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరిగాయి**
**కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**

అమరావతి ప్రజాభూమి ప్రతినిధి

అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమం, ఉపాధి అవకాశాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. శనివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గత 22 నెలల కాలంలో కార్మికుల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకువచ్చామని పేర్కొన్నారు. కార్మికుల కోసం రాష్ట్రవ్యాప్తంగా అనేక సంక్షేమ, మౌలిక సదుపాయాల కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మేడే సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించిన "లేబర్ అడ్డా" పథకం రాష్ట్రంలోని 15 నగరాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కానుంది. రోజువారీ కూలీలు, జట్టు కార్మికులు రోడ్లపై నిలబడి పనుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితిని తొలగించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడనున్నాయి. మండు టెండల్లో కార్మికులు ఇబ్బందులు పడకుండా విశ్రాంతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆధునిక పరికరాల వినియోగంపై శిక్షణ, ఉపాధి అవకాశాలపై సమాచారం కూడా అందించనున్నట్లు వెల్లడించారు. యాజమాన్యాల నుంచి కార్మిక అవసరాల డేటా సేక రించి, అవసరమైన వారికి పని కల్పించే విధంగా ఈ కేంద్రాలను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే ప్రతి నియోజకవర్గంలో లేబర్ అడ్డాలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పోలవరం, అమరావతి నిర్మాణ పనులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్ రంగాల్లో విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నందున కార్మికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం దెబ్బతిన్నదని, ఇసుక విధానాల కారణంగా పనులు తగ్గిపోయి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తోందని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు వివాహ కానుకగా రూ.40 వేల వరకు, ప్రసూతి సాయంగా రూ.20 వేల వరకు, సహజ మరణానికి రూ.60 వేల వరకు, అంత్యక్రియల ఖర్చులకు రూ.20 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. "మన మిత్ర" యాప్ ద్వారా కేవలం రూ.55తో కార్మికులు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అదే యాప్ ద్వారా ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషన్లు, ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్లు, స్టాట్యుటరీ రిటర్న్స్, సెస్ చెల్లింపులు వంటి సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసినట్లు, అచ్యుతాపురంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తిదశకు చేరుకుందని వివరించారు. గుంటూరులో 100 పడకల ఆసుపత్రికి 6.35 ఎకరాలు, కర్నూలులో 30 పడకల ఆసుపత్రికి 5.23 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. శ్రీ సిటీ, నెల్లూరు ప్రాంతాల్లో కొత్త ఈఎస్ఐ ఆసుపత్రుల కోసం భూములను గుర్తించినట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలో 50 ఎంబీబీఎస్ సీట్లతో ఈఎస్ఐసి మెడికల్ కాలేజీకి కేంద్ర అనుమతులు లభించినట్లు వెల్లడించారు. అమరావతిలో 500 పడకల ఆసుపత్రి, 150 సూపర్ స్పెషాలిటీ పడకలతో కూడిన ఈఎస్ఐసి మెడికల్ కాలేజీ ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. చిత్తూరు, బంగారు పాళ్యం, నగరి, గుంతకల్, అనంతపురం, గంగూరు, మచిలీపట్నం, బావుల పాడు ప్రాంతాల్లో కొత్త ఈఎస్ఐ డిస్పెన్సరీల కోసం భూములను కేటాయించినట్లు వెల్లడించా రు. రాష్ట్రవ్యాప్తంగా మరో 30 కొత్త డిస్పెన్సరీలు, 57 ప్రస్తుత డిస్పెన్సరీల బలోపేతానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో సేఫ్టీ ఆడిట్లు సక్రమంగా నిర్వహించకపోవడంతో అనేక ప్రమాదాలు జరిగాయని విమర్శించారు. ప్రస్తుతం "జీరో యాక్సిడెంట్స్" లక్ష్యంగా యూనివర్సిటీలు, ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్‌తో ఒప్పందాలు కుదుర్చుకుని సేఫ్టీ ఆఫీసర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడల్లో "సేఫ్టీ వాక్" కార్యక్రమాలు నిర్వహించి కార్మికుల్లో అవగాహన పెంచుతున్నట్లు చెప్పారు.భవన నిర్మాణ కార్మికుల పరిధిలో కేవలం మేస్త్రీలు మాత్రమే కాకుండా ఇసుక ర్యాంపుల్లో పని చేసే వారు, ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, డ్రైనేజీ పనివారు, గనుల్లో పని చేసే వారు, రోడ్డు కార్మికులు సహా 57 రకాల వృత్తుల వారు వస్తారని స్పష్టం చేశారు. అందరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే అసంఘటిత రంగ కార్మికులు "ఈ-శ్రమ్" పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డుతో లేబర్ కార్యాలయాలకు వెళ్లి సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రమాద మరణానికి రూ.2 లక్షలు, సహజ మరణానికి రూ.1 లక్ష వరకు బీమా సౌకర్యం లభిస్తుందని వివరించారు. రాష్ట్రంలో పెరుగు తున్న పెట్టుబడులు, అమరావతి, పోలవరం వంటి భారీ ప్రాజెక్టుల కారణంగా నైపుణ్యం కలిగిన కార్మికులకు భారీ డిమాండ్ ఏర్పడిందని తెలిపారు. ఈ ఏడాది 25 వేల మందికి నేరుగా స్కిల్ ట్రైనింగ్, వారి కుటుంబ సభ్యులతో కలిపి సుమారు లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికేషన్ కూడా ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, కార్మిక సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని "సువర్ణాంధ్ర"గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

Printed by MK PUBLICATIONS AND OFFSET PRINTERS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at visakhapatnam and published at D. No.k31-27-31/3,oppsite pavanpublic school,duvvada station road,kurmnnapalem, visakhapatnam, editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1888.cell:9502116677.

# అన్నవరం క్షేత్రంలో వైభవంగా శ్రీ సత్యదేవుని చక్రస్నానం

## పంపా తీరానికి పోటెత్తిన భక్తులు

**ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం రత్నగిరిపై వెలసిన శ్రీ సత్యదేవ స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా అత్యంత కీలకమైన "శ్రీ చక్ర స్నాన" ఘట్టం పంపా నదీ తీరంలో అత్యంత వేడుకగా జరిగింది. నవ దంపతులైన శ్రీ సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల తరపున జరిగిన ఈ పవిత్ర స్నాన కార్యక్రమాన్ని వీక్షించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఘనంగా పల్లకీ ఊరేగింపు ఉదయం రత్నగిరి పీఠంపై స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, పెళ్లి పెద్దలైన సీతారామ చంద్రమూర్తి సమేతంగా ఉత్సవ మూర్తులను పల్లకీలో కొండ కిందకు ఊరేగింపుగా తీసుకు వచ్చారు. మంగళవాయిద్యాలు, వేద పంత్రోచ్చారణల మధ్య సాగిన ఈ ఊరేగింపు ఆద్యంతం భక్తిభావంతో సాగింది. శాస్త్రోక్తంగా వైదిక క్రతువులు పంపా నది తీరాన ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై అర్చక స్వాములు మరియు వేద పండితులు శాస్త్రోక్తమైన క్రతువులను నిర్వహించారు. ఇందులో భాగంగా విఘ్నేశ్వర పూజ: ఎటువంటి విఘ్నాలు కలగకుండా పూజా కార్యక్రమాలు



ప్రారంభించారు. పంచామృత అభిషేకం: స్వామి, అమ్మవార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చక్కెరలతో కూడిన పంచామృతాలతో అభిషేకం చేశారు. మహదాశీర్వచనం: వేద పండితులు మంత్రపుష్పాలు పఠిస్తూ స్వామివారికి నీరాజనాలు సమర్పించారు.
పవిత్ర పంపా నదిలో స్నానమాచరణ కార్యక్రమంలో ప్రధాన ఘట్టమైన చక్రస్నానాన్ని అర్చకులు అత్యంత నిష్ఠతో పూర్తి చేశారు. సుదర్శన చక్రాన్ని, సీతారామచంద్రమూర్తి విగ్రహాలను శిరస్సుపై ధరించి, వేద మంత్రోచ్చారణల మధ్య పంపా నది పవిత్ర జలాల్లో మూడు సార్లు మునిగి స్నానం చేయించారు. ఈ దృశ్యాన్ని తిలకించిన భక్తులు 'గోవిందా.. గోవిందా..' అంటూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. చక్రస్నానం అనంతరం స్వామివారికి తీర్థప్రసాదాలు వినియోగించి, తిరిగి పల్లకీలో రత్నగిరి కోవెలకి సాగనంపారు. ఈ పవిత్ర ఘట్టంతో స్వామివారి కల్యాణోత్సవ వేడుకలు ఒక మధుర ఘట్టానికి చేరుకున్నాయి.

### అన్నవరం రత్నగిరిపై వెల్లివిరిసిన ఆధ్యాత్మిక ఉత్సాహం

# శాస్త్రోక్తంగా 'నాకబలి', కనువిందుగా 'దండియాడింపు'

**ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు**

అన్నవరం రత్నగిరిపై వేంచేసి ఉన్న శ్రీ సత్యదేవుని దివ్యకళ్యాణ మహోత్సవాలు పతాక స్థాయికి చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం అనివేటి మండపంలో నిర్వహించిన నాకబలి, వసంతోత్సవం, మరియు దండియాడింపు కార్యక్రమాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి.

**కన్నుల పండుగగా వసంతోత్సవం**

ప్రధానార్చకులు కోట సుబ్బయ్య, ఇంద్రగంటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఋత్విక్ బృందం స్వామి, అమ్మవార్లను ప్రత్యేక



సింహాసనంపై ఆశీనులను గావించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వసంతోత్సవంలో అర్చకులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను చేతబట్టుకుని, ఒకరిపై ఒకరు వసంతం (రంగు నీళ్లు) చల్లుకుంటూ ఆనంద సాగరంలో మునిగితేలారు. మంగళవాయిద్యాల మధ్య అర్చకులు చేసిన నాట్యం భక్తులకు కనువిందు చేసింది.

**ముగింపు దశకు కళ్యాణోత్సవాలు**

ఈ వేడుకను వీక్షించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దేవస్థానం అధికారులు మాట్లాడుతూ, కళ్యాణోత్సవాలలో నాకబలి కార్యక్రమానికి విశేష ప్రాధాన్యత ఉందని, దీనిని వీక్షించడం వల్ల శుభం కలుగుతుందని పండితులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ: దామోదర కృష్ణారావు సూపరింటెండెంట్: చెక్కల రమణఅర్చక బృందం: శ్రీకాకోళపు గోపాల్, దత్తు శర్మ, విక్రాంత ఉపద్రబ్రహ్మ, నాగభట్ల కామేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

**నేడే చివరి ఘట్టం: శ్రీ పుష్పయాగం**

ఐదు రోజుల పాటు వైభవంగా సాగిన ఈ దివ్య కళ్యాణ మహోత్సవాలు నేడు (శనివారం) జరిగే శ్రీ పుష్పయాగంతో సంపూర్ణం కానున్నాయి. శనివారం రాత్రి స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, విశేష పిండివంటలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ పుష్పయాగంతో ఈ ఏడాది కళ్యాణ వేడుకలు ఘనంగా ముగుస్తాయి.

- **మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు**
- **96 మందికి 38.53 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ.**

# కూటమి ప్రభుత్వంలోనే పేదలకు ఆరోగ్య భరోసా

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో పేదలు, మధ్య తరగతి వర్గాలకు ఆరోగ్య భరోసాగా ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని, లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ జరిగిన మేలును ఇతరులకు తెలపాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం పాలకొల్లు నియోజకవర్గం లో 96 మందికి వైద్య సాయంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 38.53 లక్షల చెక్కులను, సీఎం చంద్రబాబు ఫోటోను కూటమి నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద వర్గాల వైద్య ఖర్చులను భరించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయ నిధిని పునరుద్ధరించి పెద్ద ఎత్తున సాయం అందిస్తూ ఆదుకుంటున్నారని తెలిపారు.

గత వైసిపి ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ ను అమలు చేయకుండా నిర్వీరియం చేసిన జగన్కు మానవత్వం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో మేలు పొందిన ప్రతి ఒక్కరు మరో 10 మందికి



మంచిని చెప్పాలని కోరారు.. ప్రతి ఒక్కరు ఆరోగ్యంతో ఆనందంగా మెలగాలన్నదే కూటమి ప్రభుత్వ ఆశయమన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పెద్ద ఎత్తున వైద్యసాయం అందిస్తున్నామని ఒక్క పాలకొల్లు నియోజకవర్గంలోనే 22 నెలల్లో 13 కోట్లు వరకు సాయం అందించినట్లు మంత్రి రామానాయుడు చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయని అటువంటి మంచి కూటమి ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.



## ముత్యమాంబ అమ్మవారి జాతరలో భక్తి వెల్లువ...

**మంత్రిపాలెంలో అన్నసమారాధన ఘన విజయం!**

**ప్రజా భూమి ప్రతినిధి-అనకాపల్లి**

పరవాడ మండలం, పెందుర్తి నియోజకవర్గంలోని మంత్రిపాలెం గ్రామంలో ముత్యమాంబ అమ్మవారి జాతర సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. గ్రామంలోని భక్తులు, పెద్దలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆలయాన్ని పూలతో అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో వందలాది మంది భక్తులకు ప్రసాద విందు ఏర్పాటు చేశారు. గ్రామస్థుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ సందర్భం గా నిర్వాహకులు మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి సంవత్సరం ఇదే విధంగా జాతరను నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం కార్యక్రమం భక్తి, ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది.

## 7 ఏళ్ల కల నిజం...

**మంత్రి పాలెంలో ఘనంగా శ్రీ సీతారాముల దేవాలయ మహోత్సవాల ఆరంభం!**



**ప్రజాభూమి ప్రతినిధి-అనకాపల్లి జిల్లా**

ఎన్నో సంవత్సరాలుగా గ్రామస్తుల కలగా ఉన్న శ్రీ సీతారాముల దేవాలయం చివరకు సాకారమైంది. 2018లో శంకుస్థాపన చేసిన ఈ ఆలయం నిర్మాణం పూర్తై, ఈరోజు నుంచి మూడు రోజులపాటు ఘనంగా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భాగంగా శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. సంప్రదాయ పూజలు, శంఖనాదాలు, మంగళవాయిద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి భావాన్ని చాటిచెప్పారు. ఈ ఉత్సవాలు ఆదివారం వరకు కొనసాగనున్నాయి. మంత్రి పాలెం గ్రామం మొత్తం భక్తి వాతావరణంలో మునిగిపోయి, పెందుర్తి నియోజకవర్గంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# సంచార జాతుల గౌరవప్రద జీవనమే లక్ష్యం

**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**ప్రజాభూమి ప్రతినిధి-పెనుకొండ/శ్రీసత్యసాయి**

రాష్ట్రంలో ఉన్న సంచార జాతుల వారు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. సంచార జాతులకు గుర్తింపు కార్డులతో పాటు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను పలువురు సంచార జాతులకు చెందిన ప్రతినిధులు శనివారం కలిశారు. తమ జాతులకు కుల ధ్రువీకరణ జారీ సమయంలో డీఎస్టీ అని పేర్కొంటూ నిర్ణయం తీసుకోవడంపై వారు ఆనందం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, మంత్రి సవితకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ



సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీల్లో అన్ని సామాజిక వర్గాల వారికి ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు తీసుకురావడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యంగా సంచార జాతుల వారిని అన్ని విధాలా భరోసానిస్తోందన్నారు. సంచార జాతుల వారికి గుర్తింపు ప్రధాన సమస్యగా మారిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే గుర్తింపు కార్డుల జారీపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీపైనా చర్యలు తీసుకుంటామన్నారు. సంచార జాతుల అభివృద్ధి విద్యతోనే ముడిపడి ఉందన్నారు. సంచార జాతుల వారికి ఇళ్లు సహా పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తమ బిడ్డలను పాఠశాలలకు పంపించాలని సూచించారు. అంతకుముందు మంత్రి సవితను సంచార జాతుల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. మంత్రి సవిత ను కలిసిన వారిలో పూసల రవి, సి ఈశ్వర్ తేవర్, ముత్తు రామన్, మనీ కుమార్ తేవర్, పాండు దేవర్. పాండి తేవర్, శేఖర్ దేవ తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా కూచిపూడి నృత్య ప్రదర్శన

**ప్రజాభూమి ప్రతినిధి-ఇంద్రకీలాద్రి**

ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం సాయంత్రం నిర్వహించిన 'ధర్మపథం' సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. కాకినాడకు చెందిన శ్రీ బాలాత్రిపుర సుందరి కూచిపూడి నాట్య పాఠశాల కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభను నింపింది. నాట్య గురువులు బి. సత్యనారాయణ పర్యవేక్షణలో కళాకారులు పలు ఆధ్యాత్మిక అంశాలను అత్యంత అద్భుతంగా



ప్రదర్శించారు. గణపతి ప్రార్థనతో (మూషిక వాహన..) కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. అనంతరం 'బ్రహ్మాంజలి' నృత్యంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. 'కామేశ్వరీ మహేశ్వరి' మరియు 'దుర్గా స్తుతి' వంటి ప్రదర్శనల ద్వారా అమ్మవారి వైభవాన్ని కళాకారులు తమ అభినయంతో ఆవిష్కరించారు. చివరగా అన్నమాచార్య కీర్తనలకు చేసిన నృత్య ప్రదర్శన భక్తుల ప్రశంసలు అందుకుంది. సహజసిద్ధమైన ముద్రలు, లయబద్ధమైన పాదఘట్టనలతో సాగిన ఈ కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు కనువిందు చేసింది. ప్రదర్శన అనంతరం కళాకారులను దేవస్థాన మర్యాదలతో గౌరవించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

## నందలూరు మండలంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి క్షేత్రస్థాయి పర్యటన

- **లేపాకు చెరువు,మర్రిపల్లి ఫీడర్ ఛానల్ కాలువ పనులను పరిశీలన**
- **కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

**ప్రజాభూమి ప్రతినిధి-కడప సిటీ**

శనివారం కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జల ధార-జలహారతికార్యక్రమంలో భాగంగా శనివారం రాజంపేట సబ్ కలెక్టర్ భావనతో కలసి నందలూరు మండలంలో



చేపడుతున్న పనులను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మర్రిపల్లి గ్రామంలోని ఫీడర్ ఛానల్ కాలు వ పనులను పరిశీలించి, సాగ నీరు సజావుగా అందేలా కాల వల నిర్వహణ ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లేపాక చెరువును సందర్శించి,నీటి నిల్వ సామర్థ ,ఆయకట్టు తదితర అంశాల పై సమీక్ష చేసి,చెరువుల పునరుద్ధరణ పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, జల సంరక్షణ పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పష్టంచేశారు. ఈకార్యక్రమంలో డ్వామా పీడీ ఆది శేషారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్ సమీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కళ్లజోళ్ల ఉచిత పంపిణీ



**ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు**

ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో అమలు చేస్తున్న (పి 4) కార్యక్రమం లో భాగంగా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పెదపాడు మండలంలోని సత్యవోలు మరియు సకల కొత్తపల్లి గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల ప్రజల కంటి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, మొత్తం 100 మందికి ఉచితంగా కళ్లజోడులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు తమ కంటి సమస్యలు తగ్గేందుకు ఈ సహాయం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏపీలో ఎక్కడా విద్యుత్ కోతలు ఉండడానికి వీల్లేదు

**-మంత్రి గొట్టిపాటి రవి కుమార్**

**ప్రజా భూమి ప్రతినిధి-అమరావతి**



వేసవిలో ఎంత డిమాండ్ ఉన్నా విద్యుత్ కోతలు ఉండటానికి వీల్లేదని ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు స్పష్టం చేశారు. అకాల వర్షాలు, అధిక వేడి వల్ల తాత్కాలిక కరెంట్ సమస్యలు తలెత్తినా వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. శనివారం నాడు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం డీలతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా తాత్కాలికంగా విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తే అవకాశమున్నప్పటికీ, ఎలాంటి పరిస్థితుల్లో వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అధికారికంగా గానీ, అనధికారికంగా గానీ రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు ఉండటానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. సాంకేతిక కారణాల వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సిన పరిస్థితులు వచ్చినప్పుడు ప్రజలకు ముందస్తుగా సమాచారం అందించడంతో పాటు, సమస్యను అత్యంత వేగంగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదని మంత్రి పేర్కొన్నారు. వేసవి డిమాండ్‌కు సరిపడా విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల నుంచి ఫిర్యాదులు రావడంపై మంత్రి ఆరా తీశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, అధిక వేడి కారణంగా పలుచోట్ల ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతినడం, అలాగే అకాల వర్షాల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని వివరించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

## కుడా అభివృద్ధే నా లక్ష్యం: చైర్ పర్సన్ తలాటం సత్య

**ప్రజాభూమి ప్రతినిధి - కాకినాడ**



కాకినాడ అర్బన్ అభివృద్ధి మండలి ( కుడా) చైర్మన్‌గా తనను ఎంపిక చేయడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ తోట సుధీర్, జనసేన పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని కుడా చైర్మన్గా ఎంపికైన తలాటం నాగ వెంకట సత్యనారాయణ (సత్య) ధన్యవాదాలు తెలిపారు. తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని ఆయన పేర్కొన్నారు. శనివారం మెయిన్ రోడ్లో ఉన్న ఆయన కార్యాలయంలో విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ కవుడ అభి, వృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఒకరోజు బిల్డర్లతో సమావేశమయ్యి దానిని అభివృద్ధి చేసి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు చేపడతానన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధుల వారి సమయాన్ని తీసుకుని త్వరలో భారీ ఎత్తున ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహి స్తానన్నారు. తనపై కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. అందరి సహకారంతో కుడా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని సత్య చెప్పారు.

## ముత్యాలమ్మ అమ్మవారి 39 రోజుల ఆదాయం రూ. 5.42 లక్షలు



**ప్రజాభూమి ప్రతినిధి -సామర్లకోట**

సామర్లకోట- కాకినాడ రోడ్డులో వేంచేసియున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మ వారి ఆలయ హుండీల ఆధాయం 39 రోజులకు గానూ రూ. 5,42, 150 ఆధాయం వచ్చినట్టు ఆలయ అధికారి ఎం మురళి వీరభద్ర రావు తెలిపారు. శనివారం కాకినాడ శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం పర్యవేక్షణలో అర్చక ఆసాది, సిబ్బంది, భక్తులు సమక్షంలో ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో హుండీ తెరచి ఆధాయాన్ని లెక్కించారు. ఈ ఏడాది మార్చి 24 నుండి మే 2వ తేదీ వరకు 39 రోజులకు గానూ ఈ ఆధాయం వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో వేట్లపాలెం శ్రీ కోదండ రామ భజన సేవ సంఘం, ఆలయ సిబ్బంది బిక్కిన నాని, టి. వీర్రాజు, వి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మన కడప -- స్వచ్ఛ కడప : మున్సిపల్ కమిషనర్ రాకేష్ చంద్ర

ప్రజాభూమి ప్రతినిధి-కడప సిటీ

మన పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత అనే సంకల్పంతో కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరపరిశుభ్రతను మరింత బలోపేతం చేయ టకు వినూత్న కార్యక్రమంగా మెగా మాస్ గ్యాంగ్ వర్క్ నిర హించబడింది. ఈ కార్యక్రమం కడప నగరపాలక సంస్థ కమిషనర్ రాకేష్ చంద్ర ఆధ్వర్యశీ లో 16వ డివిజన్ ఇందిరా న గర్ సచివాలయం పరిధిలో విస్తృతంగా చేపట్టబడింది. ఈ సందర్భంగా సుమారు 100 మంది పారిశుద్ధ్య కార్మికులను ఒకేచోట సమీకరించి,ఒక వా ర్డు పరిధిలోని ప్రధాన రహదా రులు,కాలనీలు,అంతర్గత వీధులు,డ్రైనేజీలు,ఖాళీ ప్రదేశా లు తదితర ప్రాంతాలలో సమ గ్ర శుభ్రత కార్యక్రమాలు నిర్వ నిర్వహించినారు.ప్రత్యేకంగా చెత్త పేరుకుపోయిన ప్రదేశాల డ్రైనేజీ వ్యవస్థలు, బహిరంగ గంగా చెత్త వేయబడుతున్న ప్రాంతాలను గుర్తించి, యంత్రా లు,మానవ వనరులను వినియోగించి వేగవంతంగా సుబ్రపరిచే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా తక్కువ సమయంలో గరిష్ట స్థాయిలో పరిశుభ్రత సాధించడం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్ణయించబడింది. ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేయుట యొక్క ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన



కల్పించబడింది. ఈ సందర్భం గా గృహాలకు గ్రీన్, బ్లూ కలర్ డస్ట్ బిన్లు పంపిణీ చేయబడినవి. తడి చెత్తను గ్రీన్ బిన్‌లో, పొడి చెత్తను బ్లూ బిన్‌లో వే యవలసిందిగా సూచనలు అందించబడినవి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,నగ ర పరిశుభ్రతలో ప్రజల భాగా స్వామ్యం అత్యంత కీలకమని ప్రతి పౌరుడు తన పరిసరాల ను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మాత్రమే స్వచ్ఛ కడప లక్ష్యం సాధ్యమవుతుందని, ఈ దిశగా నగరంలోని అన్ని వార్డులలో ఈ మెగా మాస్ గ్యాంగ్ వర్క్ కార్యక్రమాలను దశలవారీగా నిర్వహించి, నగరవ్యాప్తంగా పరిశుభ్రతను మరింత మెరుగుపరచడానికి చర్యలు చేపడతామని రాకేష్ చంద్ర తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 4వ తేదీ చంద్రగిరి తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక: తహశీల్దార్ అమరేశ్వరి..!

ప్రజాభూమి ప్రతినిధి-చంద్రగిరి



చంద్రగిరి మండల ప్రజలందరు మే 4వ తేదీ సోమవారంనాడు చంద్రగిరి తహశీల్దార్ కార్యాల యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజీఆర్ఎస్) కార్యక్రమంనిర్వహించబడునని తహశీ ల్దార్ అమరేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలన్నింటినీ ఒకే చోట పరిష్కరించాలనే ఉద్దేశంతో, అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

**ముఖ్య గమనికలు:**

ప్రాథమిక పరిష్కారం: మండల స్థాయి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు మొదటగా చంద్రగిరి తహశీల్దార్ కార్యాలయంలోనే సంప్రదించవలసిందిగా కోరడమైనది. అన్ని శాఖలు ఒకే చోట: అన్ని రకాల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించడానికి వీలుగా, మండల స్థాయి అధికారులందరూ ఒకే చోట అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయబడ్డాయి. రశీదు : ఫిర్యాదు అందజేసిన ప్రతి ఒక్కరికీ అధికారికంగా ఒక రశీదు కాపీ ఇవ్వబడుతుంది. కాలపరిమితి: కేటాయించిన సమయం లోపు మీ సమస్య పరిష్కారం కాకపోతే, సంబంధిత కార్యాలయాన్ని సంప్రదించడానికి ఈ రశీదు ఉపయోగపడుతుంది. జిల్లా స్థాయి సమస్యలు: కేవలం తిరుపతి జిల్లా కలెక్టర్ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యల కోసం మాత్రమే ప్రజలు తిరుపతి కలెక్టరేట్‌కు వెళ్లవలసి ఉంటుంది. "చంద్రగిరి మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను. మీ సమస్యల పరిష్కారం కోసం మొదటి అడుగుగా తహశీల్దార్ కార్యాలయానికి రావాల్సిందిగా కోరుతున్నాము. మండల స్థాయి అధికారుల సమక్షంలో మీ ఫిర్యాదులను నమోదు చేసి, మీకు రశీదు అందజేయబడుతుంది. తద్వారా నిర్ణీత గడువులోగా మీ సమస్య పరిష్కారమయ్యేలా మేము కృషి చేస్తాము."ప్రజలు తమ ఫిర్యాదులకు సంబంధించిన తగిన ధ్రువ పత్రాలతో హాజరై, సమస్యలను త్వరగా పరిష్కరించుకోవాల్సిందిగా ఆమె తెలిపారు. కోరడమైనది.

# శెట్టిపల్లి భూముల రిజిస్ట్రేషన్లకు వేగం - రైతులకు పూర్తి హక్కుల దిశగా కీలక అడుగు

శెట్టిపల్లి భూముల రిజిస్ట్రేషన్లకు వేగం - రైతులకు పూర్తి హక్కుల దిశగా కీలక అడుగు.


ప్రజాభూమి ప్రతినిధి-తిరుపతి

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న శెట్టిపల్లి భూముల సమస్యకు పరిష్కారం లభించిన నేపథ్యంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి శనివారం తిరుపతి రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేస్తూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు నిర్వహించాలని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చిన శెట్టిపల్లి రైతులతో మాట్లాడి, డాక్యుమెంట్ల పరిశీలన, స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. శెట్టిపల్లి భూములకు సంబం ధించి సాంకేతిక



సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని, రైతులకు అనవసర జాప్యం చేయకూడదని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో శెట్టిపల్లి రైతుల ఏళ్ల నాటి కల సాకారమైందన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అరుదైన, ఆదర్శవంతమైన ప్రక్రియ గా నిలుస్తుందన్నారు. దశాబ్దాలుగా నలుగు తున్న ఈ సమస్యకు పరిష్కారం చూపుతూ సుమారు 16 కోట్ల రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజును ప్రభుత్వం భరించిందని తెలిపారు. లబ్ధిదారులపై ఒక్క రూపాయి కూడా భారం లేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నామని, గతంలో నష్టపోయిన రైతులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించడం సంతోషకరమన్నారు. ఇప్పటివరకు సుమారు 1300 మంది రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోగా, మిగిలిన వారు కూడా త్వరితగతిన నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో దళారుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా అధికారులను సంప్రదించాలని కోరారు. రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఉదయం 8 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు అదనపు పని గంటలు కేటాయించి సేవలు అందిస్తున్నారని తెలిపారు. భూసేకరణ, ప్లానింగ్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎక్కడా తప్పులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కారం చారిత్రాత్మక విజయమని, రైతులకు పూర్తి హక్కులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వచ్చే వారం లేదా పది రోజుల్లో ఇన్‌ఛార్జ్ మంత్రి, మున్సిపల్ శాఖ మంత్రులను తిరుపతికి ఆహ్వానించి, లబ్ధిదారులకు ఒరిజినల్ డాక్యుమెంట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ యన్ వి శ్రీకాంత్ బాబు, భూసేకరణ అధికారి సుజన, సబ్ రిజిస్ట్రార్ విజయ కుమార్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, తుడా అధికారులు, శెట్టిపల్లి వాసులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా వెయ్యినూతలకోన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవం



ప్రజాభూమి ప్రతినిధి-పెండ్లిమర్రి

కడప జిల్లాలో ప్రసిద్ధి చెందిన వెయ్యినూతలకోనలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వామివారి కళ్యాణోత్సవం, చక్రస్నానం కన్నుల పండుగగా వైభవంగా నిర్వహించి ఘనంగా ముగించినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పిన్నపాటి నరసింహా హరిప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 30న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు శనివారం జరిగిన కళ్యాణోత్సవం, చక్రస్నానంతో ఘనంగా ముగిసినట్లు తెలిపారు. శనివారం జరిగిన కళ్యాణోత్సవాన్ని వంశపారంపర్య అర్చకులు ధర్మశేఖరాచార్యుల నేతృత్వంలో వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రతి రోజూ పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వేదపారాయణం, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. స్వామివారిని ప్రత్యేక వెండి కవచంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, దాతల సహకారంతో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి సాయంత్రం స్వామివారు వివిధ వాహనాలపై గ్రామోత్సవంగా విహరించినట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా పెండ్లిమర్రి ఎస్సై ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. వైశాఖ పౌర్ణమి, బ్రహ్మోత్సవాల సమయంలో ఈ క్షేత్రానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి ఉత్సవాలను తిలకిస్తారని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

# పెండింగ్ కేసులకు వేగం - దర్యాప్తు నాణ్యత పెంపుపై ఎస్పీ సమగ్ర సమీక్ష.

ప్రజాభూమి ప్రతినిధి-తిరుపతి

జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల కేసుల పురోగతిపై జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు జూమ్ ద్వారా సమగ్ర సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులు, నేరాల దర్యాప్తు, ఫిర్యాదుల పరిష్కారంపై క్షుణ్ణంగా వివరాలు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, స్టేషన్ హౌస్ అధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో, ప్రతి పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన కేసులపై విడివిడిగా కేస్ స్టడీ నిర్వహించి, దర్యాప్తు నాణ్యత పెంపుపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. కేసుల దర్యాప్తులో సాక్ష్యాధారాల సేకరణ, నిందితుల గుర్తింపు, అరెస్టు ప్రక్రియ, ఛార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి దశలో పాటించాల్సిన విధానాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా పెండింగ్ కేసులను నిర్లక్ష్యం చేయకుండా ప్రాధాన్యతతో తీసుకుని త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును చట్టపరంగా, బాధ్యతాయుతంగా స్వీకరించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. నేరాల నియంత్రణలో నాణ్యమైన దర్యాప్తు, సకాలంలో చర్యలు, ప్రజా ఫిర్యాదులపై స్పందన, సమగ్ర రికార్డు నిర్వహణ కీలకమని తెలిపారు. అలాగే కేసుల పురోగతిని స్టేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, విచారణ నాణ్యత తగ్గకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. వివిధ రకాల కేసుల విచారణలో ఎదురవుతున్న సమస్యలను తెలు



సుకుని, అవసరమైన పరిపాలనా, దర్యాప్తు పరమైన మార్గదర్శకాలు అందించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరగాలంటే ప్రతి కేసును పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ సీసీటీవీ ఫుటేజీలు, డిజిటల్ ఆధారాలు తదితర సాక్ష్యాలను సమగ్రంగా సేకరించి నేరస్తులపై పటిష్ఠమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ నైట్ సేఫ్టీ చేపట్టి అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేస్తూ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీలత, డీసీఆర్బీ డీఎస్పీ రమణ, ఎస్బీ సీఐ విక్రమ్, సైబర్ సీఐ వినోద్ కుమార్, అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, స్టేషన్ హౌస్ అధికారులు పాల్గొన్నారు.

# క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఘన విజయం

- 470 మందికి ఉద్యోగాలు
- ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

ప్రజాభూమి ప్రతినిధి-వేంపల్లె

ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సర క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో తమ ప్రతిభతో ఘన విజయాన్ని సాధించారు. దేశ, విదేశీ ప్రముఖ ఐటీ సంస్థల్లో భారీ సంఖ్యలో ఉద్యోగాలు పొందుతూ విద్యార్థులు రికార్డు స్థాయి ఫలితాలు నమోదు చేశారు. తుది సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలకు ఎంపిక కావడం గర్వకారణమని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. మొత్తం 643 మంది విద్యార్థుల్లో 470 మంది ప్రతిష్ఠాత్మక కంపెనీల్లో ఉద్యోగాలు పొందినట్లు ఆయన వెల్లడించారు. ఈ క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఇంటెల్, కాగ్నిజెంట్, వైజాక్ ల్యాబ్స్, మోస్చిప్, కోవేసెంట్, అచల ఐటీ, వాసర్ ల్యాబ్స్, గ్లాస్ డేటా వంటి అనేక జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు పాల్గొన్నాయి. కఠినమైన ఎంపిక ప్రక్రియలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ ఉద్యోగ



అవకాశాలను అందుకున్నారు. విద్యార్థుల విజయానికి నిరంతర కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వమే కారణమని డైరెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ సంద్ర, పరిపాలనాధికారి రవి కుమార్, డీన్ అకాడమిక్స్ రమేష్ కైలాస్, శ్యామ్, సత్యానందరామ్, సుందర్, రవిబాబు తదితరులు, వివిధ విభాగాల శాఖాధిపతులు మరియు అధ్యాపకులు విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# పోలీసులకు ఆర్టీజీఎస్ సాంకేతిక తోడ్పాటు

- కేసుల ఛేదనలో సహకారం కీలక సహకారం అందిస్తున్న ఆర్టీజీఎస్ సీసీటీవీ360
- అదృశ్యమైన ముగ్గురు మహిళల ఆచూకీ లభ్యం
- హత్య, దోపిడీ కేసులో నిందితుడిని పట్టించిన టెక్నాలజీ
- వాహన చోరీ కేసు ఛేధనలోకూ కీలక పాత్ర

ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి


వివిధ కేసుల దర్యాప్తులో పోలీసులకు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ తనదైన సాంకేతిక తోడ్పాటు అందిస్తూ కేసుల ఛేదనలో పోలీసులకు తగినంత సహకారం అందిస్తోంది. తాజాగా ఐదు కేసుల్లో ఆర్టీజీఎస్ సీసీటీవీ360 వ్యవస్థ కీలకపాత్ర పోషించి ఈ కేసుల దర్యాప్తులో పోలీసుల పని సులభతరం చేసింది. అదృశ్యమైన ముగ్గురు మహిళల ఆచూకీ కనుగొనడంలో ఆర్టీజీఎస్ సీసీటీవీ360 కీలక పాత్రపోషించింది. ఈ ముగ్గురిలో ఇద్దరు బాలికలున్నారు. అలాగే తాడేపల్లిగూడెంలో హత్య చేసి, ఇంట్లో సొత్తు దోపిడీ చేసి వెళ్లిన హంతకుడ్ని కూడా సకాలంలో పట్టించడంలో ఆర్టీజీఎస్‌కు చెందిన సర్వైలెన్సు కెమెరాలు కీలకంగా పనిచేశాయి. మోటారు సైకిల్ దొంగిలించి పరారైన మరో నిందితుడి కదలికలను సైతం పసిగట్టి నిందితుడ్ని పట్టించేలా చేయడంలో ఆర్టీజీఎస్ సాంకేతికత సమర్థవంతంగా పనిచేసింది. శాంతిభద్రత పరిరక్షణకే కాకుండా, పలు కేసుల దర్యాప్తులోనూ పోలీసులకు సహకరించేలా ఆర్టీజీఎస్‌లో సీసీటీవీ360 అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా తాగాజా ఐదు కేసుల్లో పోలీసులు ఆర్టీజీఎస్ సీసీటీవీ360 సాంకేతిక సహకారాన్ని సమర్థంగా వినియోగించుకున్నారు.

**1. కర్నూలు అదృశ్యమైన బాలిక...విజయవాడలో గుర్తింపు**

కర్నూలు జిల్లాల నందవరం పోలీసు స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 22న 17 సంవత్సరాల బాలిక అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలిక ఆచూకీ కనుక్కోవడానికి ఆర్టీజీఎస్ సహకారాన్ని పోలీసులు కోరారు. ఆమె ఫొటోను ఆర్టీజీఎస్ సీసీటీవీ360 అప్లికేషన్లో అప్‌లోడు చేసి టైమ్ సెన్సిటివ్ అప్రోచ్ ద్వారా డిజిటల్ గాలింపు చేపట్టారు. ఆమె విజయవాడకు వచ్చి నగరంలోని ఒక ప్రధాన కూడలిలో తచ్చాడుతున్నట్లు ఆర్టీజీఎస్ రియల్ టైమ్ అలర్టులను పోలీసులకు పంపింది. దీంతో నందవరం పోలీసులు విజయవాడ పోలీసుల సహకారంతో బాలికను పట్టుకుని ఆమె తల్లిదండ్రులకు అప్పగించగలిగారు.

**2. నంద్యాలలో అదృశ్యమై.. ఒంగోలులో కనిపించిన బాలిక**

నంద్యాల జిల్లా గడివేముల పోలీసు స్టేషన్ పరిధిలో ఈ నెల 25న 16 సంవత్సరాల బాలిక అదృశ్యమైనట్లు ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె వెళ్లిన మోటారు బైకు నంబరు ఆధారంగా ఆమె ఆచూకీ కనిపెట్టడానికి పోలీసులు ఆర్టీజీఎస్ సహకారం కోరారు. ఆ బాలిక ఫొటో, ఆమె వెళ్లిన వాహనం నంబరును ఆర్టీజీఎస్ సీసీటీవీ360 అప్లికేషన్‌లో అప్‌లోడు చేసి ఆమె కదలికలను గాలించారు.



ఆమె ఏప్రిల్ 29న ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలోని ఒక ప్రధాన కూడలిలో ఉండగా సీసీటీవీ కెమెరాలు కనిపెట్టాయి. ఆర్టీజీఎస్ పోలీసులకు రియల్ టైమ్ అలర్టులు పంపడంతో నంద్యాల, ఒంగోలు పోలీసులు సమన్వయంతో వ్యవహరించి ఆమెను ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.

**3. చిత్తూరులో యువతి ఆచూకీ కొనుగొన్న సీసీటీవీలు**

చిత్తూరు జిల్లా రొంపిచెర్లలో ఈ నెల 24న 22 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు అక్కడి పోలీసులకు ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఈ అదృశ్యం వెనుక ఉన్నారనే అనుమానం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు ఈ కేసు ఛేదనకు ఆర్టీజీఎస్ సహకారం కోరారు. ఆ యువకుడి వాహనం నంబరు, ఆ యువతి ఫొటోలను ఆర్టీజీఎస్ సీసీటీవీ360 అప్లికేషన్‌లో అప్‌లోడు చేసి పర్సన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (పీఓఐ), ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) టెక్నాలజీ అప్రోచ్ ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. వారు వెళ్లిన వాహనం 28వ తేదీ వరకు తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో తిరుగాడినట్లు గుర్తించి అటు నుంచి చిత్తూరుకు వెళుతున్నట్లు సీసీటీవీల ద్వారా గుర్తించారు. ఆ సమాచారాన్ని ఆర్టీజీఎస్ పోలీసులకు రియల్ టైమ్ అలర్టులు పంపడంతో పోలీసులు వారిని చిత్తూరు పట్టణంలో పట్టుకున్నారు.

**4. హత్య, దోపిడీ కేసు ఛేదనలో సహకారం**

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏప్రిల్ 15న నమోదైన హత్య, దోపిడీ కేసుకు సంబంధించి నిందితుడ్ని పట్టుకోవడంలో ఆర్టీజీఎస్ సీసీటీవీ360 వ్యవస్థ కీలకంగా పనిచేసింది. నిందితుడి ఆచూకీ కనుగొనడానికి పోలీసులు ఆర్టీజీఎస్ సహకారం కోరారు. ఈ సంఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలోని



ఆర్టీజీఎస్‌కు చెందిన మ్యాట్రిక్స్ సర్వైలెన్సు కెమెరాల్లో నిందితుడి అనుమానిత కదలికలు రికార్డు అయ్యాయి. ఇది పోలీసులకు గోల్డెన్ లీడ్‌గా మారింది. దీని ఆధారంగా పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేయడంతో పాటు అతడి నుంచి బంగారు నగలు, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఇది డిజిటల్ ఎవిడెన్సుగా కూడా పోలీసులకు ఉపయోగపడనుంది.

**5. మార్చిలో చోరీకి గురైన మోటారు సైకిల్ ఆచూకీ లభ్యం**

ఏలూరు జిల్లా పోలవరం పోలీసు స్టేషన్ పరిధిలో గత మార్చిలో చోరీకి గురైన మోటారు సైకిల్‌ను కూడా పోలీసులు ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 సహకారంలో విజయవంతంగా పట్టుకోగలిగారు. చోరీకి గురైన మోటారు సైకిలు నంబరు ఆధారంగా ఆర్టీజీఎస్ జనరల్ సర్వైలెన్స్ మ్యాట్రిక్స్ ద్వారా హై రిజల్యూషన్ ఇమేజెస్ ద్వారా ఆ వాహనం కదలికలను పసిగట్టారు. గోదావరి జిల్లా కడియం పోలీసు స్టేషన్ పరిధిలో సంచరిస్తున్నట్లు పోలీసులకు ఆర్టీజీఎస్ అలర్టులు పంపడంతో పోలీసులు సమన్వయంతో వ్యవహరించి ఈ బైకును చోరీ చేసిన నిందితుడ్ని పట్టుకుని బైకును స్వాధీనం చేసుకున్నారు.

**పోలీసుల మధ్య మరింత సమన్వయం**

ఆర్టీజీఎస్‌లోని సీసీటీవీల సాంకేతిక వ్యవస్థ పోలీసుల మధ్య సమన్వయం పెంపొందించడానికి దోహదపడుతోంది. కేసు దర్యాప్తులో పోలీసుల మధ్య జిల్లాల మధ్య ఉన్న సరిహద్దులను చెరిపివేస్తూ, నేరస్థులు రాష్ట్రంలో ఎక్కడ సంచరిస్తున్నా వారి కదలికలను ఆర్టీజీఎస్ సీసీకెమెరాలు ఇట్టే పట్టేస్తున్నాయి. ఆయా కేసుల్లో ఆ నిందితులకు సంబంధించిన సమాచారాన్ని కేసు నమోదైన పోలీసు స్టేషన్ పోలీసులకు చేరవేస్తున్నాయి. దీంతో పోలీసులు సమన్వయంతో వ్యవహరించి నిందితులను ఇట్టే పట్టుకుంటుని కేసులను విజయవంతంగా ఛేదిస్తున్నారు.